PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 311 | విజయవాడ, సోమవారం 12 జూన్ 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 12 June 2023 | Rs

ప్రతి పౌరుడి ఆరోగ్యం ప్రభుత్వ బాధ్యత

- జెట్టి శేషారెడ్డి సార్మక సదస్సులో డాక్టర్ పివి రమేష్, డాక్టర్ కె నాగేశ్వర్

3

రాష్ట్రంలోకి 'నైరుతి'

గతంలో ఎన్నడూ లేనివిధంగా ఎండలతీవ్రత, వడగాల్పులతో తీవ్ర ఇబ్బందులకు గురైన రాష్ట్ర ప్రజలకు చల్లని కబురు అందింది. ఈ నెల 8న కేరళను తాకిన నైరుతి పవనాలు రాష్ట్రంలోకి ఆదివారం నెల్లూరు జిల్లా శ్రీహరికోట ప్రాంతం వద్ద ప్రవేశించాయి. రుతుపవనాల ప్రభావంతో ఆది, సోమవారాల్లో రాయలసీమ జిల్లాలతోపాటు నెల్లూరు, ప్రకాశం జిల్లాలలో వర్షాలు కురిసే అవకాశం వుందని, రుతుపవనాలు రాష్ట్రం అంతటా విస్తరించేందుకు మరో ఐదురోజులు సమయం పడుతుందని వాతావరణ శాఖ తెలిపింది. అలాగే రాష్ట్రంలో చాలా ప్రాంతాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు, వడగాల్పులు నమోదయినట్లు విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం అనకాపల్లి జిల్లా కేంద్రంలో, కాకినాడ జిల్లా కరప, విజయనగరం జిల్లా జామిలో 44.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే విశాఖపట్నం జిల్లా పద్మనాభంలో 44.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు తెలిపింది.

ఆదివారం ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో జరిగిన ర్యాలీకి హాజరైన జనం

రోజులు దగ్గరపడ్డాయ్

- బిజెపికి కేజ్రీవాల్ హెచ్చరిక
- కేంద్ర ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా భారీ ర్యాలీ
- ఈరోజు ఢిల్లీ.. రేపు ఇతర రాష్ట్రాల పైనా...

ర్యాలీనుద్దేశించి మాట్లాడుతున్న సిఎం కేజ్రీవాల్

న్యూఢిల్లీ. కేంద్రంలోని నియంతృత్వ ప్రభుత్వాన్ని దేశం నుంచి తరిమికొట్టే రోజులు దగ్గరపడ్డాయని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ హెచ్చరించారు. .కేంద్ర ప్రభుత్వ ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఆదివారం ఢిల్లీలో భారీ ర్యాలీ నిర్వహించింది.ఈ సంధర్భంగా ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ మాట్లాడుతూ ఈ రోజు ఢిల్లీలో నియంతృత్వాన్ని రుద్దారు. రేపు ఇతర రాష్ట్రాలన్నిటిపైనా దీనిని రుద్దుతారు అని ఆయన విమర్శించారు. కేంద్రంలోని బిజెపి సర్కార్ ను తరిమికొట్టేందుకు రాంలీలా మైదాన్‌కు వచ్చాం.అని చెప్పారు.,'సుప్రీంకోర్టుపై నాకు నమ్మకం లేదు' అని ఈ దేశ ప్రధాని అంటున్నారు. అతనికి అహం ఎక్కువ. దేశంలో ప్రజాస్వామ్యం అంతరించి పోతోంది. దీన్ని నియంతృత్వం, హిట్లర్‌షాహి అంటారు,.అని వివరించారు. మోడీ 12 ఏళ్లు గుజరాత్ ముఖ్యమంత్రిగా, తొమ్మిదేళ్లు ప్రధానిగా ఉండి దేశాన్ని సర్వనాశనం చేశారని, ఢిల్లీ ముఖ్యమంత్రిగా తాను ఈ ఎనిమిదేళ్లలో అనేక సంస్కరణలు తీసుకొచ్చానని ఆప్ నేత చెప్పారు. మోడీ పాలనకు, తన పాలనకు మధ్య తేడాను గుర్తించాలని ఆయన ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో పంజాబ్ సీఎం భగవంత్ మాన్, సౌరభ్ భరద్వాజ్, అతిషి, సంజయ్ సింగ్ తదితర ఆప్ నేతలతో బాటు రాజ్యసభ సభ్యులు కపిల్ సిబాల్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కపిల్ సిబాల్ మాట్లాడుతూ, నిరంకుశ మోడీని గద్దె దించేందుకు ప్రతిపక్షాలన్నీ ఐక్యంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు.

ఈ ఐదు అంశాలే కేజ్రీవాల్ టార్గెట్.

ద్రవ్యోల్బణంపై..

కేజ్రీవాల్ తన ప్రసంగంలో ద్రవ్యోల్బణం గురించి ప్రస్తావించారు. ద్రవ్యోల్బణం మిగతా 2లో

'ఉక్కు' ఆస్తుల అమ్మకం

- ప్రకటన విడుదల చేసిన స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ విషయంలో కేంద్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. స్టీల్‌ప్లాంట్‌కు చెందిన 558 ప్లాట్‌లను, 76 భవనాలను అమ్మకానికి పెడుతూ ప్రకటన విడుదల చేసింది. విశాఖ పర్యటనలో ఉన్న కేంద్ర మంత్రి అమిత్ షా స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను విరమించుకుంటున్నట్టు ప్రకటించాలని కార్మిక సంఘాలు నిరసనలు తెలియజేస్తున్న నేపథ్యంలో ఉక్కు యాజమాన్యం విడుదల చేసిన ఈ ప్రకటన మరో పిడుగులా మారింది. గతంలోనూ కొన్ని ఆస్తులను అమ్ముతామంటూ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ప్రకటన విడుదల చేసిన విషయం తెలిసిందే. విశాఖ నగరంలో స్టీల్‌ప్లాంట్‌కు ఉన్న విలువైన స్థలాలను అమ్మకానికి పెడుతూ యాజమాన్యం ఈ ప్రకటనను ముందుకు తెచ్చింది. హెచ్‌బి కాలనీ, మద్దిలపాలెంల్లో ఉక్కు ఉద్యోగులకు కేటాయించిన 588 ప్లాట్లను అమ్మకానికి పెడుతున్నట్టు దీనిలో పేర్కొంది. ఈ ప్లాట్లు సుమారు 23 ఎకరాల్లో ఉన్నాయి. ఆటోనగర్ గాజువాక ఏరియాలో రెండు ఎకరాల్లో ఉన్న 76 ఇళ్లను కూడా అమ్మకానికి సిద్ధం చేసింది.

హౌసింగ్ బోర్డు కాలనీ ఉన్న ఓల్డ్ హెల్త్ సెంటర్‌ను కూడా అమ్మకానికి పెట్టినట్లు యాజమాన్యం ప్రకటించింది. మొత్తం కొనుగోలు చేసేవారు గానీ, పార్టీలుగా కొనుక్కునేవారుగానీ పది రోజుల్లో సంప్రదించాలని ఆ ప్రకటనలో అధికారులు కోరారు.

హైఎండ్ టెక్నాలజీతో

గ్లోబల్ చదువులు

ఉన్నతాధికారులు, కంపెనీల ప్రతినిధులతో వర్కింగ్ గ్రూపు

జులై 15 నాటికి నివేదిక: జీవో జారీ

(ఫైల్)

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలను గ్లోబల్ సిటిజన్లుగా తీర్చిదిద్దాలంటూ రాష్ట్ర ప్రభుత్వం ఉన్నతాధికారులు, గ్లోబల్ కంపెనీల ప్రతినిధులతో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఎఐ, ఎల్ఎల్ఎం, ఛాట్‌జిపిటి, వెబ్ 3.0 తరహా భవిష్యత్ సాంకేతిక పరిజ్ఞానంతో సుశిక్షితులుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ఈ కమిటీ వేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ ప్రకాష్ ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఛైర్మన్‌గా వ్యవహరించే ఈ కమిటీకి పాఠశాల మౌలిక సదుపాయాల కమిషనర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఐటి సెక్రటరీ, స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్, ఎస్ఎస్‌ఎ డైరెక్టర్, ఎస్ఇఆర్‌టి డైరెక్టర్, మైక్రోసాఫ్ట్ ఇండియా ప్రతినిధి అశుతోష్ చద్దా సభ్యులుగా ఉంటారు. వీరితోపాటు అమెజాన్ వెబ్ సర్వీసుకు చెందిన షాలినీ కపూర్, గూగుల్ ప్రతినిధి, ఇంటెల్ ఆసియా ప్రతినిధి, నాస్కాం ప్రతినిధి, సెంటర్ ఫర్ డిజిటల్ ఎకానమీ పాలసీ రీసెర్చ్ అధ్యక్షులు బైజిత్ భట్టాచార్య, నీతిఅ-యోగ్ డిసి మాజీ సలహాదారు అర్చనా గులాటీ తదితరులు సభ్యులుగా ఉంటారు. అధునాతన విద్యపై తీసుకోవాల్సిన అంశాలపై ఈ కమిటీ చర్చించి జులై 15వ తేదీ నాటికి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని, దాని ఆధారంగా డిజిటల్ విద్యా విధానాన్ని రూపొందించనున్నట్టు ప్రభుత్వం పేర్కొంది. ఉన్నత విద్యారంగంలో నయా ఉదారవాద విధానాలను ప్రవేశపెట్టడానికి, బహుళ జాతి కంపెనీలకు పెద్ద పీట వేయడానికే ఈ కమిటీ ఏర్పాటని విశ్లేషకులు అంటున్నారు. పాఠశాల విద్యలో బైజూస్ చేతికి తాళాలప్పగించిన సర్కారు ఉన్నత విద్యా రంగంలో ఏదో ఒక సంస్థకా లేక కొన్ని కంపెనీ లకు అప్పగి స్తుందా అన్నది త్వరలోనే తెలుస్తుందని వారంటు న్నారు. కేవలం నెల రోజుల్లోనే ఇంత కీలకమైన విషయంపై నివేదిక ఇవ్వాలని గడువు పెట్టారంటే ఆ విధానమేమిటో ప్రాథమికంగా నిర్ణయించినట్టుందని అనుమానాలు వ్యక్తమవు తున్నాయి.

భవిష్యత్ టెక్నాలజీ రంగానికి అవసరమయ్యే నైపుణ్యాలతో ప్రభుత్వ విద్యార్థులు హైఎండ్ టెక్నాలజీలో ఉన్నత ఉద్యోగాల సాధనే లక్ష్యంగా ఈ కమిటీ చర్చించి తయారు చేసే నివేదిక ఆధారంగా పాఠ్యప్రణాళిక, మానవ వనరులు, సదుపాయాలపై ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకోనుంది. ఇప్పటికే సబ్జెక్టు టీచర్ల కాన్సెప్ట్‌ను తీసుకొచ్చిన ప్రభుత్వం రెండు భాషలతో పుస్తకాలను ముద్రించి సరఫరా చేసింది. 5,18,740 మంది విద్యార్థులకు ట్యాబులు కూడా అందించడంతోపాటు బైజూస్ కంటెంట్‌ను ఏర్పాటు చేసింది. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటలైజేషన్ ప్రక్రియను తీసుకొచ్చింది. 30213 తరగతి గదుల్లో స్మార్ట్ టివిలను ఏర్పాటు చేసింది. ఇంటరాక్టివ్ ఫ్లాట్ పానెల్స్‌నూ పెట్టింది. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, లార్డ్ లాంగ్వేజ్ మోడల్, డేటా అనలటిక్స్, ఛాట్ జిపిటి, ఆగ్‌మెంటెడ్ రియాలిటీ, వర్చువల్ రియాలిటీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, డిజిటల్ కరెన్సీ తదితర అంశాలపై విద్యార్థులకు నైపుణ్యం ఇచ్చే అంశాలపై తీసుకోవాల్సిన చర్యలను మార్పులను గుర్తించేందుకు ఈ వర్కింగు గ్రూపు ప్రణాళిక రూపొందించనుంది.

విభజన హామీల ఊసే లేదు

- వైసిపి ప్రభుత్వంపై విసుర్లు, మోడీపై పొగడ్తలు
- విశాఖ ఉక్కుపై అదే దాటవేత
- బిజెపి సభలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రసంగం తీరిది

బహిరంగ సభలో మాట్లాడుతున్న అమిత్ షా

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

మోడీ ప్రభుత్వ పాలనకు తొమ్మిదేళ్లు పూర్తయిన సందర్భంగా వామపక్షాల నిరసనల మధ్య ఆదివారం నాడిక్కడి రైల్వే గ్రౌండ్స్‌లో నిర్వహించిన బిజెపి సభలో కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మోడీ ప్రభుత్వాన్ని ఆకాశానికెత్తేస్తూ, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వ పాలనపై విమర్శలు గుప్పించారు. విభజన హామీల అమలు గురించి కానీ, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ పరిరక్షణ వంటి కీలక అంశాలకు సంబంధించి ఆయన ఒక్క ముక్క కూడా మాట్లాడలేదు.

జగన్ పాలనలో విశాఖ నగరం సంఘ విద్రోహ శక్తులకు నిలయంగా మారిందని ఆయన ఆరోపించారు. భూ, మైనింగ్ మాఫియాలు, ఫార్మా కంపెనీల్లో అక్రమాలు ఎపిలో, అందునా విశాఖలో పెచ్చుమీరుతున్నాయని విమర్శించారు. రైతు సంక్షేమం అని చెప్పుకునే జగన్ సర్కారు... దేశంలో రైతుల ఆత్మహత్యల్లో మూడో స్థానంలో ఉందన్నారు. తెలుగు ప్రజల కోసం రెండు వందే భారత్ రైళ్లు నడుపుతున్నామని తెలిపారు. విశాఖ రైల్వే స్టేషన్‌ను రూ.450 కోట్లతో భవ్య రైల్వే స్టేషన్‌గా తీర్చిదిద్దబోతున్నామన్నారు. విశాఖ, కాకినాడ, తిరుపతిని స్మార్ట్ సిటీలుగా అభివృద్ధి చేస్తున్నామని, కాకినాడలో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు చేశామని తెలిపారు. కోవిడ్ వచ్చినప్పటి నుంచీ పేదలకు ఐదు కిలోల బియ్యాన్ని కేంద్ర ప్రభుత్వం ఉచితంగా ఇస్తోందన్నారు. దేశంలో 70 కోట్ల మందికి, ఎపిలో 40 లక్షల మందికి ఇళ్లు నిర్మించిన ఘనత మోడీ సర్కార్‌దేనని పేర్కొన్నారు. కోవిడ్ సమయంలో 230 కోట్ల వ్యాక్సిన్‌లు ఇచ్చామన్నారు. 2024 సాధారణ ఎన్నికల్లో 300కుపైగా సీట్లతో మళ్లీ మోడీయే తిరిగి అధికారంలోకి వస్తారని ఆయన జోస్యం చెప్పారు. ఎపిలో 25 సీట్లలో కనీసం 20 బిజెపికి ఇవ్వాలని కోరారు. యుపిఎ ప్రభుత్వ హయాంలో రూ.12 లక్షల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు. కేంద్ర మాజీ మంత్రి డి.పురంధేశ్వరి మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో స్కాములతో దేశం నిండిపోగా, మోడీ పాలన అంతా సంక్షేమ స్కీములమయంగా మారిందన్నారు. జగన్ ఎపిని అప్పులమయం చేయడంతో పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామికవేత్తలు ఎవ్వరూ ముందుకు రావడం లేదని విమర్శించారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు మాట్లాడుతూ దేశంలో యుపి, బీహార్ వంటి బిజెపి పాలిత రాష్ట్రాల కంటే ఎపికి కేంద్రం అధిక లబ్ధి చేకూర్చుతోందన్నారు. నేడు, రాష్ట్రంలో అవినీతి, దోపిడీ పాలన సాగుతోందని ఆరోపించారు. ఈ సభలో బిజెపి జాతీయ నాయకులు సత్యకుమార్, మాజీ ఎపి సిఎం కిరణ్‌కుమార్‌రెడ్డి, వై.సృజనాచౌదరి, సిఎం.రమేష్, జివిఎల్.నరసింహారావు, జిల్లా నేతలు రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

విశాఖ నిరసన ప్రదర్శనలో వామపక్ష పార్టీలు, ఆప్ నాయకులు

అమిత్ షా గో బ్యాక్!

తొమ్మిదేళ్ల బిజెపి విద్రోహ పాలనపై నిరసన ర్యాలీలు

ప్రజాశక్తి- యంత్రాంగం

కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా రాకను నిరసిస్తూ రాష్ట్రంలో వామపక్ష పార్టీల ఆధ్వర్యాన ఆదివారం ఆందోళన కార్యక్రమాలు జరిగాయి. 'అమిత్ షా గో బ్యాక్' అంటూ నినాదాలు చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేసిందని, పైగా, విశాఖ స్టీల్ ప్లాంట్‌ను అమ్మకానికి పెట్టిందని వామపక్ష నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని విధాలా రాష్ట్రానికి తీవ్ర ద్రోహం చేసిందిగాక విజయోత్సవ సభల పేరుతో మరోమారు మోసం చేయాలని చూస్తున్న బిజెపికి రాష్ట్ర ప్రజలు పాడె కట్టాలని పిలుపునిచ్చారు. బిజెపి తొమ్మిదేళ్ల విద్రోహ పాలనపై వామపక్షాల ఆధ్వర్యంలో ఆదివారం విశాఖలో రైల్వే డిఆర్ఎం కార్యాలయం జంక్షన్ నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపాన ఉన్న గురజాడ విగ్రహం వరకు నల్లజెండాలు, నల్లదుస్తులతో నిరసన ర్యాలీ జరిగింది. గురజాడ విగ్రహం వద్ద మానవహారం చేపట్టారు. 'అమిత్ షా గో బ్యాక్' స్టీల్‌ప్లాంట్‌ను అమ్మకానికి పెట్టిన వారికి విశాఖలో అడుగుపెట్టే అర్హత లేదు' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు అధ్యక్షతన సభ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, పోలవరానికి నిధులు, దేశంలో యువతకు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు అంటూ అధికారంలోకి ఇచ్చిన బిజెపి తొమ్మిదేళ్ల పాలనంతా విద్వేష, విద్రోహపూరితంగా సాగిందని విమర్శించారు. సుజల స్రవంతికి, వెనుకబడిన ఉత్తరాంధ్ర ప్రాంతానికి నిధులు, రైల్వే జోన్ వంటి హామీలన్నింటి నీ తుంగ లో తొక్కిందన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను విక్రయిస్తున్న బిజెపి చెందిన నేత అమిత్ షాకు విశాఖలో అడుగుపెట్టే నైతిక అర్హత లేదని తెలిపారు. పోలవరం నిర్వాసితులను గోదాట్లో ముంచేయాలని కేంద్రం ప్రభుత్వం నిర్ణయించు కుందని విమర్శించారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ మోడీ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు తిరగబడే రోజులు వచ్చాయన్నారు. అటవీ చట్టాలను తుంగలో తొక్కి గిరిజనులకు అన్యాయం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఎం.లక్ష్మి, ఆప్ రాష్ట్ర నాయకులు డాక్టర్ సీతల్ తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ లెనిన్ సెంటర్‌లో జరిగిన ధర్నాలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, ప్రధాని మోదీ తొమ్మిదేళ్ల పాలనలో దేశానికి, దేశానికి చేసిన మేలు ఏమీ లేదని అన్నారు. రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని తెలిపారు. 2014లో బిజెపి అధికారంలోకి వచ్చే నాటికి దేశం రూ.47 లక్షల కోట్లు అప్పు ఉంటే, ఈ తొమ్మిదేళ్లలో రూ.153 లక్షల కోట్లకు పెరిగిందన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం అన్ని రకాల ధరలూ పెంచి ప్రజల నుంచి కోట్లాది రూపాయలు కొల్లగొడు తోందన్నారు.అదానీ కుంభకోణానికి పాల్పడినందుకు ఉత్సవాలా? అని బిజెపిని నిలదీశారు.సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర నాయకులుఎం.రామకృష్ణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పేరుతో ఉన్న ఆంధ్రా బ్యాంకును కూడా మూసేసిన బిజెపికి రాష్ట్ర ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. సభకు అధ్యక్షవర్గంగా సిపిఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, సిపిఎం రాష్ట్ర నాయకులు దోనేపూడి కాశీనాథ్ వ్యవహరించారు. విశాఖనగరం, అనకాపల్లి, శ్రీకాకుళం, విజయనగరం, ఏలూరు, పశ్చిమ గోదావరి, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు తదితర జిల్లాల్లో నిరసన కార్యక్రమాలు జరిగాయి.

కుటుంబాలతో సహా స్టీల్ కార్మికుల ధర్నా

విశాఖకు వచ్చిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని విరమించుకుంటున్నట్లు ప్రకటించాలని డిమాండ్ చేస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో ఉక్కు కార్మికులు, నిర్వాసితులు, వారి కుటుంబీకులు తరలివచ్చారు. 'సేవ్ వైజాగ్ స్టీల్' అని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ, కో-కన్వీనర్ జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ లాభాల్లో ఉన్న స్టీల్‌ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వం అమ్మకానికి పెడితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.

కర్ణాటక ప్రజలు తిప్పి కొట్టినా బిజెపికి సిగ్గులేదు

- మాజీ మంత్రి పేర్ని నాని

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైసిపి ప్రభుత్వం అవినీతిమయం అయిందని చెబుతున్న బిజెపి జాతీయ నాయకులు రాష్ట్రంలో నాలుగేళ్ల పాటు టిడిపి ప్రభుత్వ భాగస్వామ్యంలో చేసిన అక్రమాలు, కుంభకోణాలతో పాటు ఇప్పుడు విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై కూడా స్పందించాలని వైసిపి నేత, మాజీ మంత్రి పేర్ని నాని డిమాండ్ చేశారు. తెలుగు ప్రజల ప్రాణత్యాగాలతో ఏర్పడ్డ విశాఖ స్టీల్‌ను కమీషన్ల కోసమే ప్రయివేట్‌కు కట్టబెడుతున్నారని నాని విమర్శించారు. కర్ణాటకలో చేసిన అవినీతి వల్లే అక్కడి ప్రజలు 'ఊసేశారన్న' సంగతిని బిజెపి జాతీయ అధ్యక్షులు జెపి నడ్డా గుర్తుంచుకోవాలని సూచించారు. ఆదివారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో పేర్ని నాని మాట్లాడారు. ఢిల్లీ నుండి వచ్చి ఎవరో చెప్పిన మాటలను బట్టీపట్టి మాట్లాడటం నడ్డాకు తగదన్నారు. ఒక జాతీయ పార్టీకి జాతీయ అధ్యక్షుడి హోదాలో వున్న వ్యక్తి బాధ్యతారహితంగా మాట్లాడటం సరైంది కాదని హితవు పలికారు.

రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీల్లో పేదలకు నేరుగా వారి ఖాతాల్లోకి రూ 2.16 లక్షల కోట్లు జమ చేసిందని తెలిపారు. బిజెపి పాలిస్తున్న రాష్ట్రాల్లో ఎక్కడైనా తమ ప్రభుత్వం ఖర్చు చేసిన దాంట్లో సగమైనా ఖర్చు చేశారా? అని నిలదీశారు. రాష్ట్రంలో 2014 నుండి టిడిపి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న బిజెపి గనులు, ఇసుక, మద్యం, భూముల వ్యవహారాల్లో పెద్ద ఎత్తున జరిగిన అవినీతి, కుంభకోణాలపై సమాధానం చెప్పాలన్నారు. బిజెపి ఎన్ని ప్రయత్నాలు చేసినా రాష్ట్రంలో ఒక్క సీటు కూడా రాదన్నారు. నడ్డాకు చిత్తశుద్ధి వుంటే పార్లమెంట్‌లో వస్తున్న ఆరోపణలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎపి నేతల మాటలు కోటలు దాటుతాయని, చేతలు మాత్రం తక్కువని తెలంగాణ మంత్రి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలు ఆయనకే వర్తిస్తాయని వ్యాఖ్యానించారు.

నేటి నుంచి మళ్లీ బడులు

- 17వ తేదీ వరకు ఒంటిపూట
- 7.30 నుంచి 11.30 గంటల వరకు పనివేళలు

(ఫైల్)

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నేటి నుంచి పాఠశాలలు తెరుచుకోనున్నాయి. వేసవి తీవ్రత దృష్ట్యా విపత్తుల నిర్వహణ శాఖ సూచనల మేరకు పాఠశాలల పనివేళలను ప్రభుత్వం మార్చింది. ఈనెల 12 నుంచి 17 వరకు ఒంటిపూట బడులు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ కమిషనరు ఎస్ సురేష్‌కుమార్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాలల బోధనా సమయం ఉదయం 7.30 గంటల నుంచి 11.30 గంటల వరకు నిర్వహించాలని, రాగి జావ ఉదయం 8.30 నుంచి తొమ్మిది గంటల మధ్య, మధ్యాహ్న భోజనం 11.30 గంటల నుంచి 12 గంటలోపు పెట్టాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. రాష్ట్ర వ్యాప్తంగా సరాసరి అన్ని ప్రాంతాల్లో 40 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ ఉత్తర్వులను ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు, అన్ ఎయిడెడ్, మేనేజ్‌మెంట్ పాఠశాలలు తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించింది. ఈనెల 19 నుంచి 2023-24 అకడమిక్ క్యాలెండర్ ప్రకారం పాఠశాలలు యథావిదిగా పనిచేస్తాయని తెలిపారు.

10 రోజులు వాయిదా వేయాలి

- ఎస్ఎఫ్ఐ డిమాండ్

ఎండల తీవ్రత నేపథ్యంలో ఈనెల 12 నుంచి ఒంటిపూట బడులు నిర్వహించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పున: పరిశీలించాలని, మరో పదిరోజులపాటు పాఠశాలల ప్రారంభాన్ని వాయిదా వేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఎండలు తీవ్రత, వడగాడ్పులు ప్రభావం విద్యార్థులపై ఎక్కువగా పడుతోందన్నారు. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.ప్రసన్నకుమార్, ఎ.అశోక్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

భార్య, అత్త దారుణ హత్య

- యువకుడి ఘాతుకం

ప్రజాశక్తి- కౌతాళం

కుటుంబ కలహాల కారణంగా తన భార్యను, అత్తను ఓ యువకుడు హత్య చేశాడు. కర్నూలు జిల్లా కౌతాళం మండలంలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... బాపురం గ్రామానికి చెందిన గ్రామసహాయకురాలు హనుమంతమ్మ (45) కుమార్తె మహాదేవి (25) అదే గ్రామంలో వలంటీర్‌గా పనిచేస్తున్నారు. మహాదేవికి ఐదేళ్ల క్రితం వివాహమైంది. వ్యక్తిగత కారణాలతో భార్యాభర్తలు విడిపో యారు. దీంతో, కర్ణాటక రాష్ట్రం తెక్కలకోటకు చెందిన బోయ రమేష్‌ను నెల రోజుల క్రితం మహాదేవి రెండో వివాహం చేసుకున్నారు. తెక్కలకోటలో కాపురం ఉండాలని రమేష్, గ్రామవలంటీర్ చేస్తున్నందున బాపురంలో కాపురం ఉండాలని మహాదేవి ఈ నెల 9న గొడవ పడ్డారు. బంధువులు వారికి సర్ది చెప్పారు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి రమేష్ తన భార్య మహాదేవితోనూ, అత్త హనుమంతమ్మతోనూ గొడవ పడ్డాడు. వారిద్దరినీ బలమైన ఆయుధంతో తలపై మోది హత్య చేసి ఇంటికి తాళం వేసి పరారయ్యాడు. ఈ విషయం ఆదివారం వెలుగులోకి వచ్చింది.

ఆర్థికశాఖకు అప్పుల తిప్పలు

- చెల్లింపు కోసం విత్త సంస్థల ఒత్తిళ్లు

3

'సమగ్ర శిక్షా' సిబ్బందిని రెగ్యులర్ చేయాలి

- సిహెచ్ఎన్ దేవేంద్రరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విద్యాహక్కు చట్టంలో భాగంగా 'సమగ్ర శిక్ష' ద్వారా ఆర్ట్, క్రాఫ్ట్, పిఇటిలుగా వివిధ ప్రభుత్వ, జిల్లా పరిషత్తు, మునిసిపల్ పాఠశాలల్లో వృత్తి విద్యా బోధకులుగా పనిచేస్తున్న వారిని రెగ్యులర్ చేయాలని ఆర్ట్, వర్క్, హెల్త్, ఫిజికల్ ఎడ్యుకేషన్ పార్ట్ టైమ్ కాంట్రాక్టు ఇన్‌స్ట్రక్టర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ఎన్ దేవేంద్రరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పాదయాత్రలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ నిబంధనలతో తాము రెగ్యులర్ అయ్యే అవకాశం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. 2022 డిసెంబరు 31 నాటికి ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారందరినీ రెగ్యులర్ చేయాలని సిహెచ్ఎన్ దేవేంద్రరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తమను రెగ్యులర్ చేసే లోగా కుటుంబ పోషణ కోసం సెకండరీ గ్రేడ్ టీచర్ స్కేల్ ప్రకారం రూ.32,670 ఇచ్చే విధంగా చర్యలు చేపట్టాలని విన్నవించారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

ఎన్‌టిటిపిఎస్‌లో స్టేజ్-5 ప్రారంభం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పెరుగుతున్న ఇంధన డిమాండ్‌కు అనుగుణంగా రాష్ట్రంలో విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యాలను పెంచడంతో పాటు రాష్ట్రంలోని విద్యుత్తు వినియోగదారులకు 24/7 నాణ్యమైన, తక్కువ ఖర్చుతో కూడిన విద్యుత్తును సరఫరా చేసే లక్ష్యంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ పవర్ జనరేషన్ (ఎపిజెన్‌కో) మరో కీలక అడుగు వేసింది. డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్ ఎన్‌టిటిపిఎస్) కొత్త 800 మెగావాట్ల యూనిట్ (స్టేజ్-5)ను ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇంధనశాఖ ప్రధాన కార్యదర్శి, ఎపిజెన్‌కో మేనజింగ్ ఛైర్మన్ కె విజయానంద్, ఎపిజెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ కెవి చక్రధర్‌బాబు, పాల్గొన్నారు.

మధ్యప్రదేశ్ బిఆర్ఎస్ సమన్వయకర్తగా బుద్దసేన్ పటేల్

ప్రజాశక్తి - హైదరాబాద్‌బ్యూరో

మధ్యప్రదేశ్ రాష్ట్రం నుంచి పలువురు నాయకులు బిఆర్ఎస్‌లో చేరారు. తెలంగాణ ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు వారిని కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బుద్ధసేన్ పటేల్‌ను కెసిఆర్ నియమించారు. ఆదివారం ప్రగతిభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సిఎం మాట్లాడుతూ స్వతంత్ర భారతదేశంలో కేంద్రంలోని సర్కారు తన లక్ష్యాన్ని విస్మరించిందని చెప్పారు. దశ దిశ లేని పరిపాలన దేశ భవిష్యత్తుకు గొడ్డలిపెట్టుగా మారిందని విమర్శించారు. రానున్న రోజుల్లో చైతన్యమై, పార్టీలను కాకుండా తమ ఆకాంక్షలను గెలిపించుకోవాల్సిన అవసరమున్నదని దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన వారిలో చాంద్వాడా జిల్లా, జున్నార్ దేవ్ నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే రామ్ దాస్, సర్వజన్ కళ్యాణ్ పార్టీ జాతీయ అధ్యక్షులు సంజయ్ యాదవ్, గోండ్వానా పార్టీ అధ్యక్షులు శోభారామ్ బాలావి, భువన్ సింగ్ కోరం, లక్ష్మణ్ మస్కోలేతోపాటు దాదాపు 200 మంది సీనియర్ నాయకులు, ప్రజా సంఘాల నేతలు, మేధావులు తదితరులు బిఆర్ఎస్‌లో చేరారు.

ఉమెన్స్ క్రికెట్ లీగ్ విజేత విజయనగరం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళల టి20 కప్ రెండో సీజన్ విజేతగా విజయనగరం రాయల్స్ జట్టు నిలిచింది. విజయనగరంలోని చింత లవలస వద్ద డాక్టర్ పివిజి రాజు ఎసిఎ- నార్త్ జోన్ క్రికెట్ అకాడమీ మైదానంలో ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో విజయనగరం రాయల్స్ జట్టు.. వైజాగ్ డాల్ఫిన్స్ జట్టుపై 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఫైనల్ మ్యాచ్‌కు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సమక్షంలో టాస్ వేశారు. టాస్ గెలిచిన వైజాగ్ డాల్ఫిన్స్ జట్టు బ్యాటింగ్ ఎంచుకొని నిర్ణీత 20 ఓవర్లలో ఎనిమిది వికెట్ల నష్టానికి 133 పరుగులు చేసింది. హిమబిందు 44, రంగలక్ష్మి 31 పరుగులు చేశారు. విజయనగరం జట్టుకు చెందిన సరయూ 29 పరుగులిచ్చి మూడు వికెట్లు తీశారు. 134 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన విజయనగరం రాయల్స్ జట్టు 19.2 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. విజేతలకు ఆంధ్ర మహిళల క్రికెట్ బ్రాండ్ అంబాసిడర్ రష్మి గౌతమ్, విజయనగరం జడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, టోర్నమెంట్ స్పాన్సర్ హనీ గ్రూప్ చైర్మన్ ఓబుల్ రెడ్డి తదితరులు ట్రోఫీ, నగదు బహుమతిని అందజేశారు.

కొండెక్కిన కోడి

- కేజీ చికెన్ ధర రూ.320
- నెల రోజుల్లో రూ.100పైగా పెరుగుదల

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

చికెన్ ప్రియులకు ధరల షాక్ తగిలింది. మార్కెట్‌లో చికెన్ కొనాలంటే ముందు పర్సును ఒకటికి రెండుసార్లు తడుముకోవాల్సి వస్తోంది. రికార్డు స్థాయికి చికెన్ ధర చేరుకుంది. తాజాగా ఆదివారం మార్కెట్‌లో కిలో చికెన్ ధర ఏకంగా రూ.320కి చేరింది. స్కిన్‌లెస్ రూ.340 పలుకుతోంది. గత నెల 10వ తేదీన కిలో చికెన్ ధర రూ.210 ఉంది. గత నెలలో కోడి (లైవ్) కేజీ ధర రూ.120 కాగా, ప్రస్తుతం అది రూ.166కు చేరింది. గత కొన్ని రోజులుగా రోజురోజుకూ ధరలు ఆకాశాన్ని అంటుతుండడంతో సామాన్యులకు చికెన్ అందుబాటులో లేకుండా పోయింది.

ఎండలతో తగ్గిన ఉత్పత్తి

ఉష్ణోగ్రతలు 35 డిగ్రీల సెల్సియస్ దాటితే కోళ్లు తట్టుకోలేవు. జూన్ ఒకటి నుంచి ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగాయి. సరాసరిన 44 నుంచి 46 డిగ్రీల సెల్సియస్ నమోదవుతుండడంతో వేడికి తట్టుకోలేక అవి చనిపోతున్నాయి. మరోవైపు దంబోరా వ్యాధి కోళ్ల పరిశ్రమలను వెంటాడుతోంది. నెల రోజులుగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 30 శాతం అంటే, సుమారు 30 లక్షల వరకూ కోళ్లు చనిపోయినట్లు రైతులు చెబుతున్నారు. మార్కెట్‌లో లేయర్ కోళ్ల కన్నా బ్రాయిలర్ కోళ్లకే డిమాండ్ ఎక్కువ. లేయర్ కోళ్లు కొంతవరకూ ఎండను తట్టుకుంటున్నా బ్రాయిలర్ కోళ్లు మాత్రం ఎక్కువగా చనిపోతున్నాయి. దీంతో, డిమాండ్‌కు తగ్గ ఉత్పత్తి లేక వ్యాపారులు ధర పెంచేశారు. రైతులు నష్టాలను పూడ్చుకునేందుకు తక్కువ బరువు ఉండగానే వచ్చినకాడికి కోళ్లను అమ్ముకుంటున్నారు. కొంతమంది రైతులు వేసవి దృష్ట్యా ఉత్పత్తిని ఆపేశారు. మరోవైపు కార్పొరేట్ సంస్థల నుంచి పోటీని స్థానిక పౌల్ట్రీ రైతులు తట్టుకోకపోతున్నారు. కార్పొరేట్ కంపెనీల నుంచి దిగుమతి అవుతున్న కోళ్లతో పోల్చితే లోకల్ కోళ్లు తక్కువ బరువు ఉంటున్నాయి. దీంతో, దళారులు అడిగిన ధరకు రైతులు విక్రయించక తప్పడం లేదు.

రోజుకు కోటికిపైగా కోళ్ల ఉత్పత్తి

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 350కిపై కోళ్ల ఫారాలు ఉన్నాయి. 1.40 లక్షల గుడ్డుపెట్టే కోళ్లు, బాయిలర్ కోళ్లు రోజుకు కోటికిపైగా ఉత్పత్తి అవుతున్నాయి. దాణా ధరలు, విద్యుత్ ఛార్జీలు విపరీతంగా పెరగిపోవడంతో పౌల్ట్రీ పరిశ్రమ సంక్షోభంలో పడింది. ఆక్వా రంగానికి ఇచ్చినట్లు తమకూ రాయితీ విద్యుత్ ఇవ్వాలని రైతులు కోరుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు.

ప్రభుత్వం ఆదుకోవాలి

మండుతున్న ఎండలు ఓ వైపు, దంబోరా వ్యాధి మరోవైపు పౌల్ట్రీ రంగాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. కొన్ని పౌల్ట్రీలలో బ్యాచ్‌లకు బ్యాచ్‌లే కోళ్లు మృత్యువాత పడ్డాయి. ఈ నష్టం నుంచి కోలుకునే పరిస్థితి లేదు. డిమాండ్‌కు తగ్గట్లుగా సరఫరా లేకపోవడంతో చికెన్, గుడ్లు ధరలు పెరిగాయి. మరోవైపు దాణా ధరలు, విద్యుత్ ఛార్జీలు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. పౌల్ట్రీ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. రాయితీలు ఇచ్చి ప్రోత్సహించాలి.

**- పడాల సుబ్బారెడ్డి, అధ్యక్షులు
అనపర్తి ప్రాంతీయ కోళ్ల రైతుల సమన్వయ సంఘం**

చికెన్ కొనలేకపోతున్నాం

చికెన్ తినాలంటే చుక్కలు కనపడుతున్నాయి. ఎన్నడూ లేనంతగా ధరలు పెరిగాయి. ఎండా కాలంలో ధర పెరగడం పరిపాటి. అయితే, ఈ స్థాయిలో గతంలో ఎప్పుడూ పెరగలేదు. గరిష్టంగా రూ.300కు మించిన దాఖలాలు లేవు. ప్రస్తుతం కేజీ చికెన్ రూ.320కు చేరింది. రాబోయే రోజుల్లో ఇంకా పెరుగుతుందని అంటున్నారు.

**- కె. రామారావు, కూలీ, నటరాజ్ సెంటర్
రాజమహేంద్రవరం**

మైనార్టీలను కించపరుస్తూ.. ఫేస్‌బుక్‌లో యువకుడి పోస్టు

- నిందితుడిపై చర్యలు కోరుతూ రాస్తారోకో

అంబేద్కర్ బొమ్మ సెంటర్‌లో రాస్తోరోకో చేస్తున్న స్థానికులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం (ప్రకాశం జిల్లా)

ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం పట్టణంలో చిన్న చౌదరి చియాన్ అనే యువకుడు ఆదివారం రాత్రి ముస్లిములను, క్రిస్టియన్‌లను కించపరుస్తూ.. ఫేస్‌బుక్‌లో పోస్టు పెట్టాడు. ఈ విషయం తెలుసుకున్న వందలాది మంది స్థానికులు యర్రగొండపాలెం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. మైనార్టీలను కించపరస్తూ పోస్టు పెట్టిన వ్యక్తిని అరెస్టు చేయాలంటూ డిమాండ్ చేశారు. మత సామరస్యం పాటించాలని నినదించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. మరికొంత మంది 565 జాతీయ రహదారిపై మానవహారం నిర్వహించారు. టైర్లు కాల్చి నిరసన తెలిపారు. నిందితుడితో బహిరంగ క్షమాపణ చెప్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ జి కోటయ్య స్థానిక యువకులతో మాట్లాడారు. చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోస్టు పెట్టిన యువకుడిని అదుపులోకి తీసుకోవడంతో ఆందోళన విరమించారు.

సచివాలయాల సిబ్బందిపై 'ఇన్‌ఛార్జీల' భారం

- ఎంపిడిఒ, మున్సిపల్ కార్యాలయాల్లోనూ పనుల అప్పగింత
- పరోక్ష భారాలపై వార్డు, గ్రామ సచివాలయాల సిబ్బంది ఆందోళన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సాధారణంగా 'ఇన్‌ఛార్జ్' పదం వినగానే పదోన్నతిగా భావిస్తాం. కానీ వార్డు, గ్రామ సచివాలయ ఉద్యోగులు ఇప్పుడు ఈ పదం వింటేనే జంకుతున్నారు. ఈ పేరుతో సచివాలయాల్లో నిర్వర్తించాల్సిన బాధ్యతలతో పాటు మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపిడిఒ), పుర పాలక కమిషనర్ కార్యాలయాల్లోనూ పనులు అప్పగిస్తుండటంతో వీరిపై పనిభారం పెరిగిపోతోంది. రాష్ట్ర ప్రభుత్వం పాలనా సౌలభ్యం పేరిట వార్డు, గ్రామ సచివాలయాల సిబ్బందిలో కొందరు ఉద్యోగులను ఎంపిక చేసి ఒకటి రెండు సచివాలయాలకు ఇన్‌ఛార్జిలుగా నియమిస్తోంది. అయితే చాలా చోట్ల ఎంపిడిఒ, మున్సిపల్ కమిషనరు కార్యాలయాల్లోనూ ఈ 'ఇన్‌ఛార్జీల'ను వాడేస్తున్నారని విమర్శలొస్తున్నాయి. కొన్ని చోట్లయితే ఈ పని మొత్తం ఇక్కడే అన్నట్టుగా ఎంపిడిఒ, మున్సిపల్ కార్యాలయాల ఉన్నతాధికారులు సచివాలయాల 'ఇన్‌ఛార్జీల'పై పరోక్ష భారం మోపుతున్నట్లు తెలిసింది. దీంతో వార్డు, గ్రామ సచివాలయాల్లో కీలక పోస్టులకు సిబ్బంది కొరత ఏర్పడింది.

వార్డు సచివాలయ సిబ్బందికి ఇతర సచివాలయ బాధ్యతలు అప్పజెప్పాలనుకుంటే తప్పని సరిగా ఆయా సిబ్బందికి ఫుల్ అడిషనల్ ఛార్జీ కింద అప్పజెప్పాలంటూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్టుమెంట్ 2020 ఫిబ్రవరి 09న మున్సిపల్ కమిషనర్లకు ఒక సర్క్యులర్ జారీ చేసింది. ఉత్తర్వుల్లో పేర్కొన్న ప్రకారం వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ, వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రటరీ, వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ, వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీ గ్రేడ్ -2, వార్డు ఎమినిటీస్ సెక్రటరీ గ్రేడ్-2, వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీ గ్రేడ్ -2లను ఎఫ్ఎసిలుగా నియమించుకోవాలని పేర్కొన్నారు. ఉత్తర్వుల ప్రకారం ఇన్‌ఛార్జీ బాధ్యతలు అప్పజెప్పే ఉద్యోగులకు ఎఫ్ఎసి అధికారాలు ఇస్తే ప్రభుత్వం వారికి అలవెన్స్‌లు చెల్లించాల్సి ఉంటుంది. అలా కాకుండా కేవలం ఇన్‌ఛార్జీలుగా నియమిస్తే ప్రభుత్వం ఎటువంటి అలవెన్స్‌లు చెల్లించాల్సిన అవసరం ఉండదు. కేవలం అలవెన్స్‌లు చెల్లించకుండా ఉండేందుకే మున్సిపల్ కమిషనర్లు పాలనా సౌలభ్యం కోసం సిబ్బందిని ఇన్‌ఛార్జీలుగా నియమించే ప్రక్రియను చేపడుతున్నారని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగ సంఘాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి.

ఇది ఇలా ఉంటే మరో పక్క వార్డు శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలకు యూజర్ ఛార్జీల వసూళ్ల బాధ్యతలు పెనుభారంగా మారాయి. లక్ష్యాలు నిర్దేశించి వసూళ్లు పెంచాలని ఒత్తిడి చేస్తుండటంతో నిర్దిష్ట పనివేళలు కూడా లేకుండా విధులు నిర్వహించాల్సివస్తోందనివ వారు వాపోతున్నారు.

యూజర్ ఛార్జీల బాధ్యతల నుంచి విముక్తి కల్పించాలని, నిర్దిష్ట పనివేళలు అమల్జేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. మహిళా కార్యదర్శుల పరిస్థితి మరింత దయనీయంగా ఉంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. జాబ్ చార్ట్ ప్రకారం జనన, మరణ ధృవీకరణ పత్రాల జారీ, ట్రేడ్ లైసెన్స్‌ల జారీ బాధ్యతలు అప్పగించాలని, సచివాలయ ఉద్యోగుల మాదిరిగా పనివేళలు కల్పించాలని అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

అనుమతుల్లేకుండా వెళ్లడం బాధ్యతారాహిత్యమే

- 'పోలవరం సందర్శన'పై మంత్రి అంబటి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో టిడిపి బాధ్యతారహితంగా వ్యవహరిస్తోందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. పాలన అనుభవం వున్న ఆ పార్టీ.. అనుమతుల్లేకుండా 'పోలవరం సందర్శనకు ఎలా వెళ్తుంది' అని ఆయన ప్రశ్నించారు. ఆదివారం తాడేపల్లిలోని వైసిపి కేంద్రకార్యాలయంలో అంబటి మీడియాతో మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు పనులు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో తమ ప్రభుత్వ హాయంలోనే వేగంగా జరుగుతున్నాయన్నారు. టిడిపి ప్రభుత్వం చేసిన తప్పిదాల వల్ల పోలవరం నిర్మాణంలో చాలా సమస్యలు ఎదురయ్యాయని తెలిపారు. చంద్రబాబుకు ప్రచారయావ తప్ప ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేయాలనే చిత్తశుద్ధి లేదన్నారు. టిడిపి ప్రభుత్వ తప్పులతో రూ.2,020 కోట్ల నష్టం వాటిల్లందని తెలిపారు. ఆ తప్పిదాలను సరిచేసి పనుల్లో తమ ప్రభుత్వం వేగం పెంచితే తట్టుకోలేక టిడిపి నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనుల నుండి నవయుగ కంపెనీని తప్పించామనే కడుపుమంటతోనే టిడిపి నేతలు అసత్యాలను ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. 'పోలవరం సందర్శన' టిడిపి పబ్లిసిటి కోసం చేస్తున్న ఒక ఎత్తుగడగా అంబటి అభివర్ణించారు. అనుమతులు తీసుకుని సందర్శిస్తే ఎవరూ అడ్డుకోరని తెలిపారు.

సంపర తులసమ్మ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న
సిపిఎం నాయకులు బాబూరావు, వి. ఉమామహేశ్వరరావు, కాశీనాథ్, బోయి సత్యబాబు తదితరులు

సిపిఎం సీనియర్ నాయకులు సంపర తులసమ్మ మృతి

ప్రజాశక్తి - వన్‌టౌన్ (విజయవాడ)

సిపిఎం సీనియర్ నాయకులు సంపర తులసమ్మ (86) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. విజయవాడ మల్లికార్జునపేటలోని వారి నివాసంలో తుదిశ్వాస విడిచారు. తులసమ్మ మహిళా సంఘం ప్రారంభం రోజుల్లో మోటూరు ఉదయం, మానికొండ సూర్యావతి, మల్లు స్వరాజ్యం వంటి వారితో కలిసి మహిళల హక్కుల కోసం పోరాడారు. మహిళా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులుగా కూడా పనిచేశారు. సిపిఎంలో శాఖా కార్యదర్శిగా స్థానిక ప్రజలకు అనేక సేవలందించారు. పూర్వం విజయవాడ నగరంలో నక్సలైట్లు, సిపిఐతో విడిపోయిన రోజుల్లో ఏర్పడిన గొడవల్లో సిపిఎం తరపున తులసమ్మ ధైర్యంగా పోరాడడంలో ముందు వరుసలో నిలిచారు. సిపిఎంపై దాడులు, నిర్బంధాలు జరిగినప్పుడు ఆమె ఎనలేని ధైర్యసాహసాలు చూపారు.

తులసమ్మ భర్త సంపర తాతబ్బాయి కూడా సిపిఎం తరపున రెండుసార్లు కౌన్సిలర్‌గా గెలుపొంది పాతబస్తీ ప్రజలకు సేవలందించారు. ఆమెకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కుమార్తె వి.అరుణ ఐద్వా నగర కార్యదర్శిగా, సిపిఎం సభ్యురాలుగా గతంలో పనిచేశారు. అల్లుడు వి.ఉమామహేశ్వరరావు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులుగా సేవలందిస్తున్నారు. నగరపాలక సంస్థ మాజీ డిప్యూటీ మేయర్‌గా కూడా ప్రజలకు సేవలందించారు. తులసమ్మ మృతి విషయం తెలిసిన వెంటనే సిపిఎం సీనియర్ నాయకులు పి.మధు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, వై.వెంకటేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు డి.కాశీనాథ్, కె.శ్రీదేవి, ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ, కృష్ణా జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, సీనియర్ నాయకులు బి.ఆర్. తులసీరావు, పశ్చిమ నగర కార్యదర్శి బోయి సత్యబాబు, సెంట్రల్ సిటీ కార్యదర్శి బి.రమణారావు, సిఐటియు పశ్చిమ నగర కార్యదర్శి ఈ.వి. నారాయణ, అధ్యక్షులు జి.వెంకట్రావు, సిఐటియు సెంట్రల్ సిటీ అధ్యక్షులు కె.దుర్గారావు, ఐద్వా పశ్చిమ నగర కార్యదర్శి, మాజీ కార్పొరేటర్ గాదె ఆదిలక్ష్మి, సహాయ కార్యదర్శి వి.స్వప్న తదితరులు ఆమె భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆదివారం సాయంత్రం కృష్ణలంకలోని స్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

వియత్నాం కమ్యూనిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు
రువాంగ్ థ మాయితో సమావేశమైన సీతారాం ఏచూరి

వియత్నాంలో సిపిఎం బృందం పర్యటన

హనోయ్ : వియత్నాం కమ్యూనిస్టు పార్టీ ఆహ్వానం మేరకు సిపిఎం ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి నేతృత్వంలో ఐదుగురు కేంద్ర కమిటీ సభ్యుల బృందం ఆ దేశంలో పర్యటించింది. ఈ బృందంలో హిరాలాల్ యాదవ్, దేవ్‌లీనా హెబ్రామ్, సిఎస్ సుజాత, జోగేంద్ర శర్మ ఉన్నారు. పర్యటనలో భాగంగా వియత్నాం కమ్యూనిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు, ఆ పార్టీ శాశ్వత కార్యవర్గ సభ్యులు రువాంగ్ థ మాయితో సమావేశమయ్యారు. రువాంగ్ ఈ పదవిని చేపట్టిన తొలి మహిళగా గుర్తింపు పొందారు. హనోయ్‌లోని హోచిమిన్ మ్యూజియాన్ని, నివాసాన్ని కూడా సందర్శించారు. అక్కడి సందర్శకుల పుస్తకంలో ఏచూరి సంతకం చేశారు. వియత్నాం, భారత ప్రజల మధ్య సాంస్కృతిక, ద్వైపాక్షిక సత్సంబంధాలు బలోపేతం కావాలని ఆకాంక్షించారు.

వడదెబ్బతో ముగ్గురు మృతి

ప్రజాశక్తి-యంత్రాంగం

వడదెబ్బ కారణంగా తీవ్ర అస్వస్థతకు గురై ఆదివారం ముగ్గురు మృతి చెందారు. వారిలో ఇద్దరు యాచకులు, ఓ లారీ డ్రైవర్ ఉన్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడు రాష్ట్రంలోని రాణిపట్టు జిల్లా అరవకర్ ప్రాంతానికి చెందిన లారీ డ్రైవర్ కమల్‌నాథన్ లారీ నడుపుకుంటూ అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం ఇరువాడ గ్రామానికి చేరుకున్నారు. ఎండ వేడికి తట్టుకోలేక రోడ్డు పక్కన లారీ నిలిపివేసి ఓ చెట్టు కింద పడుకున్నారు. నిద్రలోనే ఆయన ప్రాణం విడిచాడు. ప్రకాశం జిల్లా శింగరాయకొండ ఆర్‌టిసి బస్టాండ్ ప్రాంతంలో ఓ యాచకుడు వడదెబ్బకు స్వస్థతకు గురై సొమ్మసిల్లి పడిపోయారు. స్థానికులు వెళ్లి చూడగా అప్పటికే అతను మృతి చెందారు. మూలగుంటపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని దేవి సీఫుడ్స్ ఎదురుగా ఉన్న ఓ ఖాళీ స్థలంలో మరో యాచకుడు మతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఇద్దరు యాచకుల వివరాలను తెలుసుకొనేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

జకోవిచ్ స్లామ్ నం.23

- రికార్డు గ్రాండ్‌స్లామ్ సాధించిన నొవాక్

పారిస్ : టెన్నిస్ చరిత్రలో నొవాక్ జకోవిచ్ సరికొత్త రికార్డు. పురుషుల సింగిల్స్‌లో అత్యధిక గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు సాధించిన ఆటగాడిగా నొవాక్ జకోవిచ్ (సెర్బియా) చరిత్ర సృష్టించాడు. ఆదివారం జరిగిన మెన్స్ సింగిల్స్ ఫైనల్లో కాస్పర్ రూడ్ (నార్వే)పై 7-6(7-1), 6-3, 7-5తో వరుస గేముల్లో గెలుపొందిన జకోవిచ్ కెరీర్ 23వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ సొంతం చేసుకున్నాడు. ఫ్రెంచ్ ఓపెన్‌లో మూడో టైటిల్ సాధించి.. నాలుగు గ్రాండ్‌స్లామ్‌లను కనీసం మూడేసి సార్లు ముద్దాడిన ఏకైక క్రీడాకారుడిగా నిలిచాడు. టైటిల్ పోరులో జకోవిచ్ 11 ఏస్‌లు, మూడు బ్రేక్ పాయింట్లతో విరుచుకుపడ్డాడు. పాయింట్ల పరంగా 118-89తో రూడ్‌పై ఆధిపత్యం చెలాయించిన జకోవిచ్.. తొలి సెట్‌ను టైబ్రేకర్‌లో సొంతం చేసుకుని చారిత్రక విజయం సాధించాడు. నార్వే కుర్రాడు కాస్పర్ రూడ్‌కు ముచ్చటగా మూడో గ్రాండ్‌స్లామ్ ఫైనల్లో ఓటమి తప్పలేదు. జకోవిచ్ చేతిలో ఓటమితో రూడ్ రన్నరప్ టైటిల్‌తో సరిపెట్టుకున్నాడు.

లోక్‌సభకు మళ్లీ పోటీ చేస్తా : బ్రిజ్ భూషణ్

లక్నో : వచ్చే లోక్‌సభలో ఎన్నికల్లో కైసర్‌గంజ్ నియోజకవర్గం నుంచి మళ్లీ పోటీ చేస్తానని బిజెపి, రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ ఆదివారం వెల్లడించారు. బ్రిజ్ భూషణ్ లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా రెజ్లర్లు పోరాటం చేస్తున్న సంగతి తెలిసిందే. మోడీ ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఉత్తర్‌ప్రదేశ్‌లోని గోండాలో నిర్వహించిన ర్యాలీలో బ్రిజ్‌భూషణ్ పాల్గొని ప్రసంగించారు. "నన్ను నమ్మకద్రోహి అంటున్నారు.. దీన్ని నేను కీర్తిగా భావించాలా? అపఖ్యాతి భావించాలా? వారు నా పేరును పదే పదే పలుకుతున్నారు" అనే భావం వచ్చే ఓ ఉర్దు పద్యాన్ని పరోక్షంగా తనపై ఆరోపణలు చేస్తోన్న మహిళా రెజ్లర్లను ఉద్దేశిస్తూ చెప్పారు. మహిళా రెజ్లర్ల అంశంపై నేరుగా స్పందించాలని విలేకరులు కోరగా.. కోర్టు తీర్పునిస్తుందంటూ మాట దాటవేశారు.

ఫ్రాన్స్‌లో భారీ విద్యుత్ ప్రాజెక్టు జాతీయీకరణ

పారిస్: ఫ్రాన్స్‌లో అతి పెద్ద విద్యుత్ ప్రాజెక్టు ఇడిఎఫ్‌ను ప్రభుత్వం తాజాగా జాతీయం చేసింది. గతేడాది ఈ కంపెనీ రికార్డు స్థాయిలో నష్టాన్ని చవి చూడడంతో ఆర్థిక మంత్రిత్వ శాఖ దీనిని టేకోవర్ చేయాలని నిర్ణయించింది. ఒకప్పుడు విద్యుత్ ఎగుమతి దారుగా ఉన్న ఫ్రాన్స్ ఇప్పుడు శీతాకాలంలో దేశంలో ఇంధన అవసరాలు తీర్చలేక జర్మనీ, ఇతర ఇరుగుపొరుగు దేశాల నుంచి విద్యుత్ దిగుమతులపై ఆధారపడుతున్నది. అతి పెద్ద విద్యుత్ ప్రాజెక్టు నష్టాలతో మూత పడితే పరిస్థితి మరింత దారుణంగా తయారవుతుంది. అందుకే ఈ జాతీయీకరణను పెద్ద విజయంగా ఫ్రాన్స్ ఆర్థిక మంత్రి బ్రూనో లే మెయిర్ అభివర్ణించారు. ఇంధన సంస్థ భవిష్యత్తు కోసమే దీనిని జాతీయీ కరణ చేశామని అన్నారు. ఫ్రాన్స్ తన విద్యుదత్పత్తిలో 70 శాతం దాకా 56 అణు రియాక్టర్ల ద్వారానే జరుగుతుంది. అయితే, ఇప్పుడు వీటిలో చాలా రియాక్టర్లు తుప్పుపట్టిపోయి సరిగా పనిచేయడం లేదు. మరి కొన్ని మూత పడ్డాయి. పనిచేస్తున్న వాటిలో కూడా పూర్తి స్థాయి సామర్థ్యంలో ఉత్పత్తి చేయగలిగేవి తక్కువే. ఇడిఎఫ్ కూడా నష్టాల్లో కూరుకుని దివాలా తీయడానికి సిద్ధంగా ఉన్నది. ఈ స్థితిలో దానిని ఆదుకోడానికి గతేడాది చివరిలో 16 శాతం వాటాను ప్రభుత్వం మొదట కొనుగోలు చేసింది. దీనిని పూర్తిగా తన స్వాధీనంలోకి తెచ్చుకునేందుకు వెయ్యి కోట్ల యూరోలను వెచ్చించింది. ఇడిఎఫ్ కంపెనీలో దాదాపు 84 శాతం వాటాను ప్రభుత్వం ఇప్పటికే తన నియంత్రణ కిందికి తెచ్చుకుంది. 15 శాతం వాటాను ప్రైవేట్ వాటాదారులు, ఒక శాతం వాటాను ఉద్యోగులు, సిబ్బంది కలిగి వున్నారు. విద్యుత్ ఉత్పత్తి భారీగా పడిపోవడంతో విద్యుత్ ఛార్జీలను ప్రైవేట్ కంపెనీలు అనూహ్యంగా పెంచేశాయి. అసాధారణ రీతిలో పెరిగిపోయిన విద్యుత్ చార్జీలపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ వీధుల్లోకి వస్తున్నారు.

రోజులు దగ్గరపడ్డాయ్

మొదటి పేజీ తరువాయి

పెరుగుతోంది. పెట్రోలు, పాలు, కూరగాయలు ఖరీదైపోయాయి. ఎల్పీజీ సిలిండర్ ధర ఇప్పుడు రూ.1,000 దాటింది. దీన్ని ఎలా నియంత్రించాలో వారికి అర్థం కావడం లేదు. నాలుగో క్లాస్ పాస్ రాజుకి దేశాన్ని ఎలా నడిపించాలో కూడా తెలియదు. ఏదో ఒకరోజు రూ.2000 నోటు వస్తుందని అంటున్నారని, ఐదేండ్ల తర్వాత అది పోతుందని చెప్పారు. రాజుకు మిత్రుడైన నాయకుడు రైతులపై బండి నడిపినా, పట్టించుకోవడం లేదన్నారు. ఉద్యమంలో 700 మంది రైతులు చనిపోయారు. రాజు ఏమాత్రం పశ్చాత్తాపమూ లేకుండా తన అహంభావంలో జీవిస్తున్నారని విమర్శించారు. రాజుకు మరొక స్నేహితుడు ఉన్నాడు, అతను దేశంలోని అంతర్జాతీయ మహిళా మల్లయోధులతో అనుచితంగా ప్రవర్తిస్తాడు, కానీ రాజు దాని గురించి ఏమీ మాట్లాడరు. రాజుకు అతనితో ఉన్న స్నేహం విడదీయలేనిదని చురకలు అంటించారు. మరో స్నేహితుడికి విమానాశ్రయం, భూమి, గనులు అన్నీ రాసి ఇచ్చారని విమర్శించారు..

ఉద్యోగం ఇప్పిస్తామని మోసం

- యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-గుత్తి (అనంతపురం జిల్లా)

శ్రీనివాసులు (ఫైల్)

ఉద్యోగం ఇప్పిస్తామని డబ్బులు తీసుకొని మోసం చేయడంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంఘటన అనంతపురం జిల్లా గుత్తి మండలం వన్నెదొడ్డి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు... వన్నెదొడ్డి గ్రామానికి చెందిన శ్రీనివాసులు (24) ఎంబిఎ చదివారు. ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయనకు అనంతపురానికి చెందిన బయన్న, సజ్జలదిన్నె గ్రామానికి చెందిన రమణయ్య పరిచయమయ్యారు. గుత్తి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా ఉద్యోగం ఇప్పిస్తామని శ్రీనివాసులును నమ్మించాడు. అందుకు డబ్బులు ఖర్చవుతాయని చెప్పారు. వారి మాటలు నమ్మిన శ్రీనివాసులు తన వదిన బంగారం నగలను తాకట్టుపెట్టి రూ.2.30 లక్షల నగదు దళారులకు ఇచ్చారు. ఉద్యోగమిప్పిస్తామని చెప్పిన వారు శ్రీనివాసులును మోసం చేశారు. తాను ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నర్సింగ్ విద్యార్థిని దారుణ హత్య

ప్రజాశక్తి - హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణలోని వికారాబాద్ జిల్లాలో దారుణం జరిగింది. పరిగి మండలం కాళ్లాపూర్ గ్రామంలో ఒక యువతి దారుణ హత్యకు గురైంది. శనివారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిన శిరీష(19) తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాల్లో గాలించారు. ఆదివారం ఉదయం గ్రామ సమీపంలోని నీటికుంటలో రక్తపు మరకలతో శిరీష మతదేహం కనిపించింది. దీంతో కుటుంబ సభ్యులు పరిగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై విఠల్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దుండగలు యువతిని హత్య చేసి నీటికుంటలో పడేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. శిరీష ఇంటర్మీడియట్ పూర్తి చేసి వికారాబాద్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో నర్సింగ్ శిక్షణ తీసుకుంటోంది.

ప్రశాంతంగా తెలంగాణ గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష

ప్రజాశక్తి - హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణలో గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. ఈ సందర్భంగా పరీక్ష రాసిన అభ్యర్థులు మాట్లాడుతూ.. గత గ్రూప్ 1 పరీక్ష కంటే ఈసారి పేపర్ సులభంగా ఉందని చెప్పారు. ఔటాఫ్ సబ్జెక్ట్ ప్రశ్నలు రాలేదన్నారు. పరీక్ష హాల్లో కూడా పకడ్బందీగా ఏర్పాట్లు చేశారని తెలిపారు. ఇన్విజిలేటర్ ఫోన్లను కూడా లోపలికి అనిమతించ లేదని అభ్యర్థులు తెలిపారు. ఈ సారి గ్రూప్ 1 లో ఎక్కువ మంది మంచి మార్కులు సాధించే అవకాశం ఉందని అభ్యర్థులు వెల్లడించారు. పేపర్ లీకేజీ నేపథ్యంలో గత ఏడాది జరిగిన గ్రూప్ 1 ప్రిలిమ్స్‌ను టీఎస్‌పీఎస్సీ రద్దు చేసింది. ఈసారి ఆఫ్‌లైన్ పద్ధతిలో, ఓఎంఆర్ విధానంలో పరీక్ష నిర్వహించాలని కమిషన్ నిర్ణయించింది. 503 గ్రూప్-1 పోస్టుల భర్తీకి గత ఏడాది ఏప్రిల్ 26న నోటిఫికేషన్ జారీ చేశారు. అక్టోబర్ 16న గ్రూప్ 1 పరీక్ష జరిగింది. 3,80,081 మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా 2,85,916 మంది అభ్యర్థులు హాజరయ్యారు. మెయిన్స్ పరీక్షలకు 25,050 మంది అభ్యర్థులను కమిషన్ ఎంపిక చేసింది. ఆదివారం జరిగిన పరీక్షకు అభ్యర్థులు షూలు ధరించి రావొద్దని.. చెప్పులను ధరించే ఎగ్జామ్ సెంటర్లకు రావాలని కమిషన్ ముందుగానే సూచించింది. గోరింటాకు, టాటూలతో రావొవద్దని, వాచీలు కూడా అనుమతించమని కమిషన్ స్పష్టం చేసింది.

ప్రతి పౌరుడి ఆరోగ్యం ప్రభుత్వ బాధ్యత

- జెట్టి శేషారెడ్డి స్మారక సదస్సులో డాక్టర్ పివి రమేష్, డాక్టర్ కె నాగేశ్వర్

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

ప్రతి పౌరుడి ఆరోగ్యం ప్రభుత బాధ్యత అని ప్రభుత్వ మాజీ వైద్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పివి రమేష్ అన్నారు. డాక్టర్ జెట్టి శేషారెడ్డి 15వ వర్ధంతిని పురస్కరించుకుని నెల్లూరు నగరంలోని డాక్టర్ శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో స్మారక సదస్సు నిర్వహించారు. "ప్రజారోగ్యం- రేపటి అవసరాలు- ప్రభుత్వ బాధ్యత" "జాతీయవాదం- ప్రస్తుత పోకడలు" అనే రెండు ప్రధాన అంశాలపై జరిగిన ఈ సదస్సులో పివి రమేష్ మాట్లాడుతూ జెట్టి శేషారెడ్డి పేద ప్రజల కోసం జీవించారన్నారు. తాను సుమారు 35 దేశాల్లో ఆరోగ్య విషయాలను పరిశీలించానని తెలిపారు. మన దేశంలోని ప్రభుత్వాలు పాఠాలు నేర్చుకోవడం లేదన్నారు. కేవలం ఎన్నికల్లో అందరికీ ఆరోగ్యమనే హామీనిచ్చి తర్వాత విస్మరిస్తున్న పరిస్థితి ఉందని తెలిపారు. అందరికీ ఆరోగ్యం ఇచ్చే ప్రభుత్వాలన్ని ఎన్నుకోవాలని సూచించారు. ఆరోగ్య విషయంలో అసమానతలు ఉండకూదదన్నారు. దేశంలో ఆరోగ్య విషయంలో కేరళ ప్రథమ స్థానంలో ఉందని, అంతర్జాతీయ స్థాయి వైద్యం కేరళలో అందుతుందని తెలిపారు. అక్షర్యాసతలోనూ ఎపి వెనుకబడిందన్నారు. ఎపిలో 33 శాతం మంది స్త్రీలకు 18 ఏళ్ల పూర్తి కాకుండానే వివాహాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. స్త్రీ ఆరోగ్యం, చదువు విషయంలో ప్రభుత్వాలు బాధ్యత తీసుకోవాలన్నారు. వైద్య రంగం నిర్లక్ష్యానికి గురవుతుందని తెలిపారు.

ప్రసంగిస్తున్న పివి రమేష్ , కె నాగేశ్వర్

సదస్సుకు హాజరైన జనం

ప్రొఫెసర్ కె నాగేశ్వర్ మాట్లాడుతూ జాతీయత అంటే ఒక మతం, కులం, ప్రాంతం కాదని, రాజ్యాంగాన్ని క్షేమంగా అమలు చేయడమేనని పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం అందరూ కలిసి పోరాటం చేశారన్నారు దేశం అనే భావన ఆధునికతమైందన్నారు. బ్రిటీష్ సామ్రాజ్యవాదంతో జరిగిన పోరాటమే జాతీయతగా ఏర్పడిందని పేర్కొన్నారు. నాటి స్వాతంత్ర్య పోరాటం బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిందని, బ్రిటీష్ ప్రజల మీద కాదని చెప్పారు. ఆంగ్లో ఇండియన్లను భారత్ ఆదరించిందన్నారు. దేశమంటే ఒక మతం, కులం, భాష కాదన్నారు. 'దేశమంటే మట్టి కాదోయో, దేశమంటే మనుషులోయ్' అని మహాకవి గురజాడ చెప్పిన మాటలను గుర్తుచేశారు. డార్విన్ జీవ పరిణామ క్రమాన్ని పాఠ్యాంశాల నుంచి తొలగిస్తురన్నారని మండిపడ్డారు. అదానిపై ఆరోపణలు వస్తే, ఇది తనపై కాదని దేశంపై దాడి అని చెప్పారని, అదాని అంటే దేశం కాదని తెలిపారు. దేశంలో 23 కోట్ల మంది ప్రజలకు రోజు రూ 370 కూలి రావడం లేదని, అదానికి గంటకు రూ 16 వేల కోట్లు ఆదాయం వస్తోందని దేశమంటే ఇద్దరో, ముగ్గురో పారిశ్రామికవేత్తలు కాదని, ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తించాలని అన్నారు. సదస్సుకు డాక్టర్ రామచంద్రారెడ్డి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజేశ్వరరావు అధ్యక్షత వహించారు. మాజీ ఎమ్మెల్యే విరపు బాలసుబ్రమణ్యం, జెఎస్ ట్రస్ట్ చైర్మన్ చంద్ర రాజగోపాల్, ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎంవి రమణయ్య, యుటిఎఫ్ నాయకులు నవకోటేశ్వరరావు, జెవివి నాయకులు మాదాల రాము పాల్గొన్నారు.

ఆక్సిజన్ అందక ఆస్తమా రోగి మృతి

- మార్కాపురం ప్రభుత్వ జిల్లా వైద్యశాలలో దారుణం

ప్రజాశక్తి-మార్కాపురం (ప్రకాశం జిల్లా)

ప్రకాశం జిల్లా మార్కాపురం ప్రభుత్వ ఆస్పత్రిలో దారుణం చోటు చేసుకుంది. విద్యుత్ సరఫరా నిలిచిపోవడం... సకాలంలో జనరేటర్‌ను వినియోగించకపవడంతో ఆక్సిజన్ అందక ఆస్తమా రోగి మృతి చెందిన సంఘటన ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. కురిచేడుకు చెందిన దేవనబోయిన కేశమ్మ (45) ఆస్తమా వ్యాధితో బాధపడుతున్నారు. ఆరోగ్యం క్షీణించడంతో పది రోజుల క్రితం మార్కాపురంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేశారు. అక్కడి వైద్యులు ఆమెకు వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు. ఆదివారం ఉదయం 7:15 గంటల సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఆస్పత్రి సిబ్బంది జనరేటర్‌ను వినియోగించకపోవడంతో కేశమ్మకు ఆక్సిజన్ అందలేదు. సుమారు రెండు గంటలపాటు ఊపిరి ఆడక మృతి చెందారు. ఆక్సిజన్ అవసరమని మొత్తుకున్నా అక్కడ సిబ్బంది పట్టించుకోలేదని, కేశమ్మ మృతికి ఆస్పత్రి సిబ్బందే కారణమని ఆరోపిస్తూ కేశమ్మ కుటుంబీకులు కొద్ది సేపు ఆందోళన చేశారు. అక్కడి వైద్యులు, సిబ్బంది బాధితులకు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.

రైతులను ఇబ్బందులు పెడుతున్న ప్రభుత్వం

- పాదయాత్రలో నారా లోకేష్

ప్రజాశక్తి-బద్వేల్ (కడప)

జగన్ పాలనలో రైతులు నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులతో ఇబ్బంది పడుతున్నారనిటిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పేర్కొన్నారు. వాటి ధరలూ విపరీతంగా పెరిగిపోయాయని.అన్నారు. యువగళం పేరుతో ఆయన చేపట్టిన పాదయాత్ర ఆదివారానికి 123 రోజుకు చేరుకుంది. కడప జిల్లా బద్వేలు నియోజకవర్గంలోని నదియాబాద్ విడిది కేంద్రం నుంచి ప్రారంభమైన పాదయాత్ర సోమేశ్వరపురం, ఎర్రబల్లె, అప్పరాజుపేట, రాజుపాలెం, వెంకటశెట్టిపల్లి, కొంగలవీడు, శివరాంనగర్, శంకరాపురం క్రాస్, చింతలచెరువు క్రాస్, బయ్యనపల్లి, అబ్బూసాహెబ్, బద్వేలు శివారు విద్యానగర్ విడిది కేంద్రం వరకూ కొనసాగింది. ఆయా ప్రాంతాల్లో లోకేష్ మాట్లాడుతూ సీమ రైతులకు నీరిస్తే బంగారం పండిస్తారని అన్నారు. వైసిపి ప్రభుత్వ పాలనలో ఇరిగేషన్‌పై సబ్సిడీని ఎత్తేసి రైతులకు తీవ్ర అన్యాయం చేసిందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో రాయలసీమ ప్రాజెక్టుల కోసం రూ. 11,700 కోట్లు ఖర్చు చేశారని, వైసిపి ప్రభుత్వం పది శాతం కూడా వ్యయం చేయలేదని విమర్శించారు. పంట నష్టం వాటిల్లితే కనీసం పంట నష్టం అంచనా వేసే దిక్కు ఈ ప్రభుత్వానికి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే పాత డ్రిప్ ఇరిగేషన్ విధానాన్ని తీసుకొస్తామన్నారు. భవిష్యత్‌కు గ్యారెంటీ పేరుతో అన్నదాతకు రూ.20 వేల ఆర్థిక సాయం చేస్తామని హామీ ఇచ్చారు. గోదావరి, కృష్ణా, పెన్నా అనుసంధానం ద్వారానే సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు.. లోయర్ సగిలేరు ప్రాజెక్టును ఆధునీకరిస్తామని బద్వేల్ ఉప ఎన్నికల సందర్భంగా జగన్ హామీ ఇచ్చి మోసం చేశారని విమర్శించారు. బద్వేల్‌లో టిడిపి జెండా ఎగురవేస్తే పెండింగ్ ప్రాజెక్టులు, బ్రిడ్జి పనులు పూర్తి చేసే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. వ్యవసాయ అనుబంధ రంగాలనూ పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తాన్నారు. సోమశిల ముంపు బాధితులకు న్యాయం చేస్తామని, మొదటి 18 నెలల్లో పరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు.

బద్వేల్‌లో నిర్వహించిన రైతు సదస్సులో మాట్లాడుతున్న నారాలోకేష్

అసైన్డ్ ల్యాండ్స్ పంపిణీకి కసరత్తు

- రాష్ట్ర వ్యాప్తంగా 55వేల ఎకరాలు గుర్తింపు
- కమిటీలు తమ నేతృత్వంలో ఉండాలని ఎమ్మెల్యేల ఒత్తిడి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా భూమి లేని నిరుపేదలతో పాటు ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీల్లో అర్హులైన వారికి అసైన్డ్ భూములను పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. ఇందుకు సంబంధించి జిల్లాల వారీగా భూముల వివరాలను గుర్తించినట్లు తెలిసింది. ప్రభుత్వ వర్గాల నుంచి అందుతున్న సమాచారం మేరకు ఇప్పటి వరకు సుమారు 55వేల ఎకరాల భూముల సేకరణ ప్రక్రియ పూర్తయింది. ఇందులో కొంత మేర ఇప్పటికే అసైన్డ్ భూములు సాగు చేసుకుంటున్న లబ్దిదారులు కూడా ఉన్నారు. ఇటీవల కాలంలో నిరుపేదలకు భూముల పంపిణీతో పాటు దళితుల శ్మశాన వాటికలకు కూడా స్థలాలు కేటాయించాలని ప్రభుత్వానికి పెద్ద ఎత్తున దరఖాస్తులు అందాయి. ఈ నేపథ్యంలో పంపిణీకి వీలయ్యే భూములను ముందుగా గుర్తించాలని ప్రభుత్వం ఆయా జిల్లా కలెక్టర్లను ఇటీవల ఆదేశించింది. అత్యధికంగా ప్రభుత్వ భూములు కడప జిల్లాలో గుర్తించినట్లు తెలిసింది.అసైన్డ్ భూముల పంపిణీ చివరిగా ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సిఎంగా ఉన్న సమయంలో నియోజకవర్గ కేంద్రాల్లో ఆయా శాసనసభ్యుల అధ్యక్షతన జరిగిన అసైన్‌మెంట్ కమిటీలో తీర్మానం చేసి భూములను పంపిణీ చేశారు. అనంతరం కిరణ్‌కుమార్ రెడ్డి సిఎంగా ఉన్న సమయంలో అక్కడక్కడా గిరిజన భూములకు సంబంధించి కొంత భూముల పంపిణీకి సంబంధించి కొంత మేర అడుగులు పడ్డాయి. అప్పట్లోనే నియోజకవర్గ స్థాయి అసైన్‌మెంట్ కమిటీలను రద్దు చేసి జిల్లా ఇన్‌చార్జీమంత్రి అధ్యక్షతన కమిటీలను వేయాలని ప్రభుత్వాలు నిర్ణయించాయి.

రాష్ట్ర విభజనానంతరం 2014 నుంచి 2023 జూన్ వరకు ఒక్క సెంటు భూమి కూడా పేదలకు పంచిన దాఖలాల్లేవు. ఈ నేపథ్యంలో పేదలకు పంపిణీ చేయనున్న భూముల విషయంలో స్థానిక శాసనసభ్యుల పాత్ర లేకుండా ఈ కార్యక్రమం నిర్వహిస్తే తమకు కానీ, పార్టీకి కానీ రాజకీయపరంగా ఉపయోగం ఉండదని, గతంలో మాదిరిగానే అసైన్‌మెంట్ కమిటీలు నియోజకవర్గ స్థాయిలో పునరుద్ధరించాలని అధికార పార్టీ ఎమ్మెల్యేలు ప్రభుత్వంపై ఒత్తిడిని పెంచుతున్నట్లు సమాచారం. దళితులకు సంబంధించి శ్మశాన వాటికలకు స్థలాలు లేక అనేక ప్రాంతాల్లో ఎవరైనా చనిపోయిన సమయంలో దహన సంస్కారాలకు ఇబ్బంది పడుతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఈనేపథ్యంలో దళితులకు శ్మశాన వాటికల కోసం అర ఎకరా స్థలం కేటాయించే విధంగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. అసైన్డ్ భూముల పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు డిబిటి ద్వారా ఓ కార్యక్రమం నిర్వహించి పంపిణీ చేస్తున్న విధంగా భూముల పంపిణీ కార్యక్రమాన్ని దళితుల సంక్షేమం పేరుతో నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. ఈ కార్యక్రమానికి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి జులై 8న కానీ లేక ఆయన వర్ధంతి సెప్టెంబరు2న కానీ నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది.

భూ యజమాని సంతకం నిబంధన తొలగించాలి

- కౌలు రైతు సంఘం పాదయాత్రలో ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వై కేశవరావు

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి, తోట్లవల్లూరు

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అడుగులకు మడుగులొత్తుతున్న జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలోని కౌలు రైతులకు తీవ్రమైన అన్యాయం చేస్తోందని ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.కేశవరావు అన్నారు. ఎపి కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో కౌలు రైతు రక్షణయాత్ర-పాదయాత్ర కృష్ణా జిల్లాలో కొనసాగింది. ఆదివారం ఉదయం తోట్లవల్లూరు మండలం వల్లూరుపాలెంలో ప్రారంభమైన పాదయాత్ర రొయ్యూరు మీదుగా కంకిపాడు మండలం మద్దూరు, కాసరనేనిపాలెం, పెనమలూరు మండలం చోడవరం, పెదపులిపాక, యనమలకుదురు వరకు సాగింది. పాదయాత్రలో కేశవరావు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సభలు నిర్వహించి నిజమైన కౌలుదారులను గుర్తించి వారందరికీ గుర్తింపు కార్డులు ఇచ్చే వరకు ఉద్యమం కొనసాగించాలన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వకపోవడంతో పంటల పెట్టుబడికి బ్యాంకుల రుణాలు అందక ప్రయివేటు వ్యాపారుల వద్ద ఎక్కువ వడ్డీకి అప్పులు చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్‌పుట్ సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు అందడంలేదని, ప్రకృతి వైపరీత్యాల్లో పంటలు నష్టపోయినా పంటల బీమా, ప్రభుత్వ సాయం దక్కడంలేదని తెలిపారు. ఈ పరిస్థితుల్లో కౌలు రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి బయటపడే మార్గంలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పండించిన పంటను రైతు భరోసా కేంద్రంలో అమ్ముకునే అవకాశం ఇవ్వకుండా భూ యజమానికి కల్పిస్తూ కౌలు రైతుకు ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. కౌలు రైతుకు నష్టం చేస్తోన్న నూతన చట్టంలో మార్పు చేయాలని డిమాండ్ చేశారు. భూ యజమాని సంతకం నిబంధన తొలగించి కౌలు రైతులందరికి గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.సూర్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు. ప్రముఖ సంఘ సేవకులు, న్యాయవాది సూరి పవన్ కుమార్ రక్షణ యాత్ర బృందానికి అల్పాహారం అందించారు. సోమవారం ఉదయం విజయవాడ ప్రకాశం బ్యారేజీ మీదుగా జాతా బృందం గుంటూరు జిల్లా మంగళగిరిలోని సిసిఎల్ఎ కార్యాలయానికి చేరుకుంటుంది. అక్కడ సిసిఎల్ఎ కమిషనర్‌కు సామూహిక రాయభారం పేరుతో నాయకులు వినతిపత్రాన్ని అందజేయనున్నారు.

కౌలు రైతుల రక్షణ యాత్రలో మాట్లాడుతున్న వై.కేశవరావు

సిఎం సభ ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి విడదల రజని

నేడు జెవికె కిట్ల పంపిణీకి సిఎం శ్రీకారం

- పల్నాడు జిల్లా క్రోసూరులో ఏర్పాట్లు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

రాష్ట్రంలో వరుసగా నాలుగో ఏడాది ఒకటి నుంచి పదవ తరగతి విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీకి సిఎం జగన్మోహన్‌రెడ్డి పల్నాడు జిల్లా క్రోసూరులో శ్రీకారం చుట్టనున్నారు. 2023-24 విద్యా సంవత్సరానికి జగనన్న విద్యాకానుక (జెవికె)ను ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 43,10,165 మంది విద్యార్థులకు రూ.1,042.53 కోట్లతో కిట్లను అందించనున్నారు. పాఠ్యపుస్తకాలు, నోట్, వర్క్ పుస్తకాలు, మూడు జతల యూనిఫామ్, ఒక జత షూ, రెండు జతల సాక్సులు, బెల్టు, స్కూలు బ్యాగుతో పాటు ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీషు-తెలుగు డిక్షనరీ (6-10 తరగతి పిల్లలకు), పిక్టోరియల్ డిక్షనరీ (1-5 తరగతి పిల్లలకు)తో కూడిన కిట్ పంపిణీని ముఖ్యమంత్రి క్రోసూరులో ప్రారంభిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో జెవికె కిట్ల పంపిణీకి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. సిఎం పాల్గొనే సభ ఏర్పాట్లను ఆదివారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజనీ, ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, ఎస్‌పి రవిశంకర్‌రెడ్డి పరిశీలించారు. జెవికె కిట్ల పంపిణీతోపాటు వివిధ పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాల్లోనూ ముఖ్యమంత్రి పాల్గొంటారని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు విలేకరులకు తెలిపారు.

ఆర్థికశాఖకు అప్పుల తిప్పలు

- చెల్లింపు కోసం విత్త సంస్థల ఒత్తిళ్లు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

అప్పులు..రాష్ట్ర ఆర్థిక శాఖను ముప్పతిప్పలు పెడుతున్నాయి. రుణాలు ఇచ్చిన విత్త సంస్థలు వాయిదాలు, వడ్డీ చెల్లింపుల కోసం ఒత్తిళ్లు పెంచుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ శాఖలు, సంస్థలు ఆర్థిక శాఖ అనుమతి ద్వారా వివిధ విత్త సంస్థల నుంచి రుణాలు తీసుకుంటున్న సంగతి తెలిసిందే. అయితే రుణాలు తీసుకున్న సంస్థలు వాటిని సకాలంలో చెల్లించకపోవడంతో రుణదాతలు ఆర్థిక శాఖ చుట్టూ తిరుగుతున్నాయి. తామిచ్చిన రుణ సొమ్మును తిరిగి చెల్లించేలా చూడాలని ఒత్తిడి చేస్తున్నాయి. దీంతో ఆర్థిక శాఖ తలపట్టుకుంటోంది.

జాతీయ స్థాయి విత్త సంస్థలు నేరుగా ఢిల్లీ నుంచే తమ ప్రతినిధులను రాష్ట్ర సచివాలయానికి పంపి 'మా సొమ్ము తేల్చండి' అంటూ ఆర్థిక శాఖను నిలదీస్తున్నాయి. మరికొన్ని సంస్థలు విజయవాడలోని స్థానిక అధికారులను సచివాలయానికి పంపిస్తున్నట్లు తెలుస్తోంది. పలు బ్యాంకులు, కేంద్రానికి చెందిన అనేక సంస్థల నుంచి రాష్ట్రానికి చెందిన వివిధ ప్రాజెక్టులకు భారీ మొత్తంలోనే రుణాలు వచ్చాయి. ఈ రుణాలకు ఆర్థికశాఖ అనుమతి అవసరం. ప్రధానంగా కేంద్రం పరిధిలో ఉన్న గ్రామీణ విద్యుదీకరణ సంస్థ, జాతీయ సహకారాభివృద్ధి సంస్థ (ఎన్‌సిడిసి), ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఎడిబి), నబార్డ్ వంటి అనేక ఆర్థిక సంస్థల నుంచి రాష్ట్ర ప్రాజెక్టులకు అప్పులు స్వీకరించారు. అయితే ఈ రుణాలను తిరిగి చెల్లించడంలో రాష్ట్ర సంస్థలు విఫలమవుతున్నాయి. కొన్ని డిఫాల్టర్లుగా, మరికొన్ని నిరర్థక ఆస్తుల (ఎన్‌పిఎ) జాబితాలోకి చేరిపోతున్నట్లు తెలుస్తోంది.

వాస్తవానికి 60 రోజుల్లోగా రుణ వాయిదాలు, వడ్డీలు చెల్లించకపోతే డిఫాల్టర్‌గా పరిగణిస్తారు. ఇక 90 రోజుల్లోగా చెల్లింపులు జరగకపోతే ఎన్‌పిఎ జాబితాలోకి చేరుస్తారు. ఇది రాష్ట్ర ప్రతిష్టకు ఇబ్బందికరమే అయినప్పటికీ నిధుల లేమితో చెల్లింపులు జరగడం లేదని అధికారులు అంటున్నారు. ఈ నేపథ్యంలోనే తమకు రావాల్సిన రుణంపై అసలు వాయిదాలు, వడ్డీ వాయిదాలు చెల్లించాలంటూ ఈ సంస్థలకు రుణదాతల నుంచి ప్రతినెలా లేఖలు వస్తూనే ఉన్నాయి. ఫలితం లేకపోవడంతో ఇక నేరుగా అమరావతికి వచ్చేందుకు రుణదాతలు ప్రయత్నిస్తున్నారు. ఇదే అంశాన్ని ముందుగానే రాష్ట్ర అధికారులకు చెబుతున్నప్పటికీ, అధికారులు అందుబాటులో ఉండడం లేదన్న ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో త్వరలోనే చెల్లింపులు చేపడతామంటూ రుణదాతల లేఖలకు ఆర్థికశాఖ అధికారులు ప్రతి లేఖలు రాస్తున్నట్లు తెలిసింది. ఎన్‌పిఎలోకి చేరకుండా చూసేందుకుగాను ఇతర సంస్థల నుంచి నిధులను సమీకరించుకుని చెల్లింపులు చేసేందుకు ఆర్థిక శాఖ ప్రయత్నాలు సాగిస్తోంది.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-గుత్తి (అనంతపురం జిల్లా)

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన అనంతపురం జిల్లా గుత్తి మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఊటకల్లు గ్రామానికి చెందిన వడ్ల చిన్న ఆచారి (35)కి మూడు ఎకరాల భూమి ఉంది. తనకున్న భూమిలో వేరుశెనగ, పత్తి పంటలను సాగు చేసేవారు. పంటల సాగు కోసం రూ.5 లక్షలు దాకా అప్పులు చేశారు. దిగుబడులు సరిగా రాకపోవడంతో పంటల సాగు కోసం చేసిన అప్పులు తీర్చేలేక తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. గ్రామ శివారులో ఉన్న కొండ వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పార్టీ ఎడ్యుకేషన్ సిరీస్ 2, 5 వెలువడినవి



వెల : 20/-
చారిత్రక భౌతిక వాదం



వెల : 15/-
పార్టీ కార్యక్రమం

ప్రతులకు
భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు), ఆంధ్రప్రదేశ్ కమిటీ
27-13-3, గవర్నర్‌పేట, విజయవాడ - 2,
ఫోన్ నెం. 0866 2577202, 9490098000

KARVY FINANCE

కార్పోరేట్ ఆఫీసు-మెసర్స్ కార్వీ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్, 301, 3వ అంతస్తు, గుర్జాల్స్ హౌస్, 167 సిఎస్టీ రోడ్, కొలివెరీ ఏరియాగ్రామం, శాంతక్రజ్ (ఇ), ముంబయి-400098. **Email :-** reddy.laxma@karvy.com; **Contact No.:** 9010191999

ప్రైవేట్ ట్రీటి ద్వారా అమ్మకపు ప్రకటన

సెక్యూర్డ్ అస్సెట్ ఆస్థి అమ్మకానికి 15 రోజుల యొక్క సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 9(1)కి నిబంధన క్రింద నోటీసు క్రిష్ణ జిల్లా, విజయవాడ టౌన్, గొల్లపూడి, శివ రెసిడెన్సీ, గ్రౌండ్ ఫ్లోర్, ఫ్లాట్ నెం.జి.ఎఫ్-2, డోర్ నెం.7-192, ఆర్.సర్వే నెం.570/8 కలిగిన ఆస్తి మొత్తం భాగం. పూర్తి విస్తీర్ణం 29చ.గ.ల యుడిఎస్‌లతో 286చ.గ.లు &ఫ్లాట్ ఏరియా 840చ.అ.లు, ప్లింత్-760చ.అ.లు + 60 చ.అ.ల ఉమ్మడి + 20చ.అ.ల పార్కింగ్. డిపాజిట్ ఆఫ్ టైటిల్ డీడ్ ద్వారా కార్వీ ఫైనాన్సియల్ సర్వీసెస్ లిమిటెడ్ (సెక్యూర్డు క్రెడిటార్)తో తాకట్టుపెట్టబడినవి.

మీరు, SARFAESI చట్టం, 2002 యొక్క సెక్షన్ 13(2) ప్రకారం 2 మార్చ్, 2021నాటి డిమాండ్ నోటీసు అందించినప్పటికీ, పై పేరు రుణగ్రహీతలు మరియు హామీదారులు సదరు నోటీసు 60 రోజులలోపు డిమాండ్‌చేసిన మొత్తం చెల్లించుటలో విఫలమైనారు మరియు కార్వీ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి SARFAESI చట్టం, 2002 యొక్క సెక్షన్ 13(4) మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క 8(1) మరియు (2) నిబంధనల ప్రకారం క్రిష్ణ జిల్లా, విజయవాడ టౌన్, గొల్లపూడి, శివ రెసిడెన్సీ, గ్రౌండ్ ఫ్లోర్, ఫ్లాట్ నెం.జి.ఎఫ్-2, డోర్ నెం.7-192, ఆర్.సర్వే నెం.570/8 కలిగిన ఆస్తి మొత్తం భాగం. పూర్తి విస్తీర్ణం 29చ.గ.ల యుడిఎస్‌లతో 286చ.గ.లు &ఫ్లాట్ ఏరియా 840చ.అ.లు, ప్లింత్-760చ.అ.లు + 60 చ.అ.ల ఉమ్మడి + 20చ.అ.ల పార్కింగ్. ("ది సెక్యూర్డ్ అస్సెట్")ను స్వాధీనం చేసుకోవడమైనది. ఆ తరువాత సెక్యూర్డ్ అస్సెట్ విలువ ప్రభుత్వం అమోదించిన విలువ నుండి పొందబడింది మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(5) అంగీకారంతో రిజర్వ్ ధర ఖరారు కాబడింది.

సెక్యూర్డు అసెట్‌ను సంబంధిత సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నియమాలు, 2002లోని సంబంధిత రూల్స్‌ను అనుసరించి మీకు 30 రోజుల నోటీసు 27.06.2022న పంపించడంతోపాటు, రూల్ 8(6) కింద అవసరమైనట్లుగా ఆ తర్వాత వేలం నోటీసులను ప్రచురించడం ద్వారా తేది.29.06.2022నాటి వేలం నోటీసులను తగినంత సర్కులేషన్ కలిగిన రెండు ప్రముఖ వార్తాపత్రికలలో ఒకటి తెలుగు భాషలో మరియు మరొకటి ఆంగ్లంలో 29.06.2022న విజయవాడలో ప్రచురించబడినది. అయితే, సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6) యొక్క నియమాలను అనుసరించి వేలం నోటీసులను ప్రచురించినప్పటికీ మరియు విస్తృత ప్రచారం కల్పించినప్పటికీ, రిజర్వ్ ధర **రూ.32,50,000/-** (రూపాయలు ముప్పైరెండు లక్షల యాభైవేలు మాత్రమే) వద్ద సదరు వేలం విఫలమైంది. మీకు కూడాను వేలం నోటీసులో ప్రచురించబడిన తేదీకి ముందు సెక్యూర్డు క్రెడిటార్‌కు అన్ని ఖర్చులు, ఛార్జీలు మరియు ఖర్చులతో కలిపి బకాయిలు చెల్లించడంలో విఫలమయ్యారు.

మళ్లీ, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని సంబంధిత నియమాలను పాటించిన తర్వాత, రూల్ 8 (6) & రూల్ 9 (1) కింద అవసరమైన విధంగా మీకు 11.10.2022 తేదీన 15రోజుల నోటీసును అందిస్తోంది. 13.10.2022 నాటి వేలం నోటీసును ప్రచురించడం ద్వారా తగినంత సర్క్యులేషన్ కలిగిన రెండు ప్రముఖ వార్తాపత్రికలలో ఒకటి తెలుగు భాషలో మరియు మరొకటి ఆంగ్ల భాషలో 13.10.2022న ప్రచురించబడినది. అయితే, సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 9(1) మరియు రూల్ 8 (6)కి సంబంధించిన నిబంధనను ప్రచురించి, విస్తృత ప్రచురణ ఇచ్చినప్పటికీ, సదరు వేలం కూడా విఫలమైంది, ఎందుకంటే 13.10.2022 నాటి వేలం నోటీసు నిబంధనల ప్రకారం 09.11.2022న లేదా అంతకు ముందు ధరావత్తు (ఇఎండి) స్వీకరించబడలేదు, రిజర్వ్ ధర **రూ.25,00,000/-** (రూపాయలు ఇరవైఐదు లక్షలు మాత్రమే) వద్ద సదరు వేలం విఫలమైంది. మీకు కూడా వేలం నోటీసులో ప్రచురించబడిన తేదీకి ముందు సెక్యూర్డు క్రెడిటార్‌కు అన్ని ఖర్చులు, ఛార్జీలు మరియు ఖర్చులతో కలిపి బకాయిలు చెల్లించడంలో విఫలమయ్యారు.

మళ్లీ, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని సంబంధిత నియమాలను పాటించిన తర్వాత, రూల్ 8 (6) & రూల్ 9 (1) కింద అవసరమైన విధంగా మీకు 22.02.2023 తేదీన 15రోజుల నోటీసును పంపించడం తరువాత. 22.02.2023 నాటి వేలం నోటీసును ప్రచురించడం ద్వారా తగినంత సర్క్యులేషన్ కలిగిన రెండు ప్రముఖ వార్తాపత్రికలలో ఒకటి తెలుగు భాషలో మరియు మరొకటి ఆంగ్ల భాషలో 22.02.2023న ప్రచురించబడినది. అయితే, సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 9(1) మరియు రూల్ 8(6)కి సంబంధించిన నిబంధనను ప్రచురించి, విస్తృత ప్రచురణ ఇచ్చినప్పటికీ, సదరు వేలం కూడా విఫలమైంది, ఎందుకంటే 22.02.2023నాటి వేలం నోటీసు నిబంధనల ప్రకారం 09.03.2023న లేదా అంతకు ముందు ధరావత్తు (ఇఎండి) స్వీకరించబడలేదు, రిజర్వ్ ధర **రూ.18,00,000/-** (రూపాయలు పద్దెనిమిది లక్షలు మాత్రమే) వద్ద సదరు వేలం విఫలమైంది. మీకు కూడా వేలం నోటీసులో ప్రచురించబడిన తేదీకి ముందు సెక్యూర్డు క్రెడిటార్‌కు అన్ని ఖర్చులు, ఛార్జీలు మరియు ఖర్చులతో కలిపి బకాయిలు చెల్లించడంలో విఫలమయ్యారు.

పైన పేర్కొన్న రిజర్వ్ ధర వద్ద ఏబిడ్ స్వీకరించబడనందున పైన పేర్కొన్న బహిరంగ వేలం విఫలమైనందున మరియు అమ్మకాన్ని మళ్లీ నిర్వహించాల్సిన అవసరం ఉన్నందున, రిజర్వ్ ధర అనగా **రూ.16,00,000/-** (రూపాయలు పదహారు లక్షలు మాత్రమే) ఉంచబడింది.

26 ఏప్రిల్, 2023 నాటికి బకాయిలు **రూ.56,57,672/-** (రూపాయాలు యాభైఆరు లక్షల యాభైఏడు వేల ఆరువందల డెబ్బై రెండు మాత్రమే) యొక్క సెక్యూర్డ్ డెట్ మరియు తదుపరి వడ్డీ మరియు రియలైజేషన్ తేది వరకు దానిపై ఇతర వ్యయాల రికవరీ కోసం ప్రైవేట్ ట్రీటీ రూపంలో సెక్యూర్డు ఆస్తిని మళ్లీ అమ్మకానికి పెట్టార మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 8 (6) మరియు రూల్ 9 (1) నిబంధనలకు అనుగుణంగా వేలం నోటీసును ప్రచురించబడుతున్నది.

సెక్యూర్డ్ అస్సెట్‌లు విమోచనానికి అందుబాటులోఉన్న సమయానికి సంబంధించి SARFAESI చట్టం, 2002లోని సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) నిబంధనల అహ్వానించడమైనదని మీరు శ్రద్ధ వహించాలి.

ఈ 30రోజుల నోటీసు, చిరునామాలు మీకు ఇవ్వబడుతున్నాయి, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 9(1) యొక్క నిబంధనలకి అనుగుణంగా ఉంటుంది మరియు ఇందుమూలంగా మీకు తెలియజేయునది ఏమనగా మరియు గమనించాల్సిందేమనగా ప్రైవేట్ ట్రిటి రూపంలో ఈ నోటీసు నుండి 30 క్లియర్ రోజుల తరువాత పై పేర్కొన్న సెక్యూర్డు అసెట్ విక్రయించబడును.

26.06.2023న లేదా ముందుగా దిగువ పేర్కొన& ఆవరణల నుండి చరాస్తులను మీకు చెందిన అన్నింటినీ తీసివేయుటకు ఈ నోటీసు ద్వారా మిమ్మల్ని పిలువడమైనది. కెఎఫ్ఎస్ఎల్ వారు పై పేర్కొన్న సమయం తరువాత సదరు ఐటంల ఏదేని నష్టానికి/డ్యామేజ్‌కు బాధ్యత వహించదు.

రుణ ఖాతా నెం.తో రుణగ్రహీత పేరు & చిరునామా	తనఖాపెట్టిన స్థిరాస్తుల వివరాలు	అమ్మకం/ రిజర్వు ధర (రూ.)	విక్రయిస్తున్న ఆస్తి రికవరీ కొరకు బాకీపడిన బకాయిలు
రుణ ఖాతా నెం : 543033 & 544378 1) దేసు నవీన్ 2) మీన కుమారి దేసు 3) డి జయకుమార్ అందరి నివాసం: డోర్ నెం.6-98-1, జి-2, శివ రెసిడెన్సీ, వన్ సెంటర్, గొల్లపూడి, విజయవాడ-521226	ఆర్.సర్వే నెం.570/8, డోర్ నెం.7-192, ఫ్లాట్ నెం.జి.ఎఫ్-2, గ్రౌండ్ ఫ్లోర్, శివరెసిడెన్సీ, గొల్లపూడి, విజయవాడ టౌన్, క్రిష్ణ జిల్లా. **ఐటం 1:** యుడిఎస్ 29 చ.గ.లలో 286చ.గ.ల పూర్తి విస్తీర్ణం. **ఐటం 2:** ఫ్లాట్ ఏరియా 840చ.అ.లు, ప్లింత్-760చ.అ.లు + 60చ.అ.లు ఉమ్మడి + 20చ.అ.ల పార్కింగ్ మరియు సరిహద్దులు దిగువ విధంగా కలవు.	రూ. 16,00,000/- (రూపాయలు పదహారు లక్షలు మాత్రమే)	26 ఏప్రిల్, 2023 నాటికి బాకీపడిన మొత్తం రూ.56,57,672/- (రూపాయాలు యాభైఆరు లక్షల యాభైఏడు వేల ఆరువందల డెబ్బై రెండు మాత్రమే).

తేది: 12 జూన్, 2023
ప్రదేశం: విజయవాడ

శ్రీ. బి లక్ష్మారెడ్డి
కార్వీ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్
(అధీకృత అధికారి)

అక్షరం

ప్రజాశక్తి

www.prajasakti.com

facebook/prajasakti, twitter/prajasakti

4 | విజయవాడ
సోమవారం 12 జూన్ 2023

"మంచి సమాజం ఏర్పడాలంటే- మంచి సాహిత్యం రావాలి. మంచి సాహిత్యం రావాలంటే మంచి సాహిత్య విమర్శ రావాలి. మంచి సాహిత్య విమర్శ రావాలంటే విమర్శకులు విమర్శకు గురి కావాలి."

– కొడవటిగంటి కుటుంబరావు

విభ్రమ

పచ్చిబద్దల్లా పగిలిన పాదాలు
నల్లటి నలుపు
మరింకేం పోలిక అక్కర్లేదు
త్రీడీలో చూసినట్టు ఉబ్బిన ముఖాలు
భుజాల మీద వేళ్లాడుతూ
చర్మాన్ని చుట్టుకున్న శబ్దాల చందమామలు

ఆ రసధ్వని వెనక ఉనికి మహాసముద్రం
సలవాద్రి గొంతులో పలికిన
దు:ఖపు వెలివేతల జీర కలిసిపోయిన
నిష్కల్మష సంగీతం ఎందుకు నన్ను ముంచెత్తుతుంది!
ఆగిపోయిన ఊపిరిని
మళ్ళీ మళ్ళీ పోసి ఆశలు పూయిస్తుంది
అది మోహమూ కాదు; మాయా కాదు
నా పితరుల ముందు నిల్చోబెట్టేందుకు
నన్ను గతానికి మోసుకెళ్లే కలల పడవ

బిర్ర బిగుసుకున్న చర్మపు పలక మీద
చీకటిలో మునిగిన చేతులు
చిర్రా చిటికెనపుల్ల తగిలించగానే
సూర్య కిరణాలన్నీ నిప్పురవ్వలై చిందిపడినట్టు
మెరుపొచ్చి కరచాలనం చేసినట్టు
ఊహించని తత్తరపాటు
ఒళ్ళు ఒళ్ళంతా నిట్ట నిలువునా నిలబడి
నాగుబామై ఆడుతుంది!

ఆ హోరు చెవులకి తాకుతుంటే
భౌతికాభౌతికాల మజ్జన వేలాడుతూ
ఆకాశపు అంచుమీద నుంచి ఈ ప్రపంచాన్ని చూస్తావు
ముఖంలో రంగులు మారిపోతూ మారిపోతూ
నీలోకి నీ తాతో ముత్తాతో వచ్చి ఆవహిస్తారు
మాటల్లేని తనంలో
మట్టి మీద పొర్లాడుతూ మహదానందం పొందుతావు

ఇది సంప్రదాయానికి ఆవల జరిగే ఉత్సవం
నొసలు చిట్లించే ముఖాలకి అర్థంకాని ఆనంద పరమావధి
మన్నుని మనసారా కౌగలించుకునే మహద్భాగ్యం!

చావైనా , సంబరమైనా
మోత సాగే కొద్దీ
గుండెల్లో ఎక్కడో నరాల్ని చీల్చుకుని
గొంతుముడిలో చిక్కుబడ్డ పాటల
ముందటి సాకీ గుర్తుకుతెస్తుంది
ఎక్కడ ఆ చప్పుడు విన్నా
విలాప వాక్యాలన్నీ
వీపు మీదనే పలికించుకున్న
ప్రవక్తల రోదనలా వినబడుతున్నా
మళ్ళీ మళ్ళీ హత్తుకోవాలనిపిస్తుంది
నన్ను నేను దొరకబుచ్చుకుని
చిందు తొక్కాలనిపిస్తుంది!

– అనిల్ డ్యాని
97033 36688

నీలిరంగు తోడేలు

ఏ ఇచ్చికాలాడిందో
మా అడవిచుక్కని మనువాడీ ..
మా గూడకొచ్చిందో నీలిరంగు తోడేలు
మా హక్కులకోసం అనిగాసీ ..
మా వెంటే మసలేది
మా బతుకుల్లానే .. కుసులూడిన
మా కుక్కిమంచాల మీద తొంగుండేది
మాతో పాటు కలోగంజో తాగేది
తుడుంగొడుతూ .. థింసాలాడేది
గోచీ కట్టుకున్న
మా గొంగళి పురుగులతో గూటీ బిళ్లాడేది
నిప్పును అరిసేతపట్టీ ..
నిజాయితీకి నిలువుటద్దాన్ననేది !

కొన్నాళ్లకి ..
అయిదేళ్ల జాతరలో అధికారం చిక్కింది
అరిసేతిలో నిప్పు ఆరిపోయింది
కరిమబ్బు కొండల్ని ఆవహించినట్టు
దానినావహించింది రాజ్యం
వాన కురిసీ .. దాని నీలిరంగు వెలిసిపోయింది
మా అడుగక్కడే ఆగిపోయింది
దానిచుట్టూరా మొలుచుకొచ్చింది
తుపాకుల పెండె
కార్పొరేట్ మృగాలు చుట్టాలయ్యేయి
అయినోళ్లకు ఆకుల్ల .. కానోళ్లకి కంచాళ్ల
అందలమెక్కించిన వాళ్లమే
ఇయ్యాల అలగాజనమై పోయేము!

ఇయ్యాల ..
మార్చుకుంది దాని దోపిడీ రూపం ..
కన్నుగానక పులి .. పిల్లల్ని తినేసినట్టు
మా బొటనవేళ్ల తెగ్గోసీ
కంపెనీలకు తాకట్టుబెట్టింది మా బతుకుల్ని ..
కాళ్లకింద మట్టిని దువ్వేసీ
గనుల కోసం జల్లెడ పట్టింది అడవిని ..
నేలకూల్చింది ఎదురు తిరిగిన ఎర్రపొద్దుల్ని
గడపగడపలో ఇనుప దడులు ..
నెత్తుటి వాగులు వీధులు ..
ఎటుజూసినా శవాల దిబ్బలు
గూడెం .. ఇయ్యాల కనిపించని కారాగారం !

ఏందయ్యా .. యిలా అయిందనీ
మా పెద్దయ్యనడిగితే అంటాడూ ..
కుక్కలకి అధికారమిస్తే ..
కుండలన్నీ సెండోబండారం జెయ్యవా అనీ ..!

నిజమే ..
పులులు మేకల్ని వేటాడతాయి .. అదీ అడవి
మనిషిని మనిషి వేటాడుతాడు .. యిదీ సమాజం !!

– సిరికి స్వామినాయుడు,
94940 10330

జ్ఞాపకాల పూలరేకులు

సందర్భం

అవి బ్రిటిష్ పాలన రోజులు. తిరుచురాపల్లి స్టేషన్లో రైలు ఆగింది. కంపార్ట్‌మెంట్లోకి ఇద్దరు రేడియో ఉద్యోగులు ప్రవేశించి, పెట్టెనంతా మొగలి, సంపెంగ పూలు, వికసిత పద్మాలు, కలువలు, గులాబీ, కదంబ పువ్వుల దొంతరలతో అలంకరించారు. ఇంతకీ ఆ పెట్టెలో ప్రయాణిస్తున్నది రేడియో అధికారి ఆచంట జానకీరాం. తెలుగు రేడియో ప్రసారాల ఆద్యుల్లో ఆయనొకరు. జానకీ రాం భావుకుడు, సౌందర్య పిపాసి, సున్నిత మనస్కుడు. ఆయన సంగతి తెలిసే, బదిలీపై తిరుచురాపల్లి నుంచి మదరాసు కేంద్రానికి వెళుతున్న ఆయన ప్రయాణాన్ని అంత సౌందర్య శోభితంగా, పరిమళ భరితంగా మార్చారు సహోద్యోగులు, ఆయన మీద ప్రేమతో.

దక్షిణ భారతదేశంలో రేడియో ప్రసారాల ఆరంభం నుంచి జానకీరాం కి సంబంధం వుంది. కొద్దికాలం ఢిల్లీ కేంద్రంలో 'క్యాజువల్'గా పనిచేశారు. దక్షిణాదిలో తొలి రేడియో కేంద్రం మదరాసులో 1938లో ప్రారంభమైనప్పుడు జానకీరాంని అక్కడకి పంపింది ప్రభుత్వం. అక్కడ కొన్నాళ్లు పని చేసిన తర్వాత ఆయనకి దక్షిణ భారతంలో రెండో కేంద్రమైన ఆకాశవాణి, తిరుచురాపల్లికి బదిలీ అయ్యింది. కొన్నాళ్ల తర్వాత ఆయనకి తిరిగి మదరాసుకు బదిలీ అయ్యింది. ఆ పరిమళ భరిత ప్రయాణం ఆ సందర్భంలోనిదే!

తెలుగు ప్రసారాల ప్రారంభ సంరంభ సన్నివేశంలో పాలు పంచుకున్న వ్యక్తుల్లో జానకీ రాం ఒకరు. ఆరోజు 1938, జూన్ 16. అప్పటి ఉమ్మడి మదరాసు రాష్ట్ర ముఖ్యమంత్రి చక్రవర్తుల రాజగోపాలచారి, అప్పటి కేంద్ర రవాణా శాఖ మెంబర్ అలెగ్జాండర్ క్లవ్‌ని శ్రోతలకి పరిచయం చేయడంతో మదరాసు కేంద్రంలో ప్రసారాలు శుభారంభం అయ్యాయి. తొలి కార్యక్రమంగా 'అనార్కలి' నాటకం ప్రసారమైంది. తెలుగులో మొదటి కవితా సంకలనం 'వైతాళికులు' పుస్తకాన్ని తెచ్చిన ముద్దుకిష్టే ఈ నాటక రచయిత. నిర్వహణ ఆచంట జానకీ రాం. ఇందులో దేవులపల్లి కష్ణశాస్త్రి సలీం పాత్రని పోషించడం విశేషం.

"రావమ్మ! రావమ్మా! మందారమా
రక్త కరవీరమా
రావే శేఫాలికా! రావే నవ మల్లికా
రావమ్మ! రావమ్మా!"

పిల్లలు పాడిన ఈ క్రిష్ణశాస్త్రి పాటతో నాటకానికి నాందీ ప్రస్తావన జరిగింది. తొలి రేడియో నాటకంగా 'అనార్కలి' చరిత్రలో నిలిచిపోయింది.

తెలుగు సినిమా మొదలైన కొత్తల్లో పౌరాణిక, చారిత్రిక నాటకాల్నే చలనచిత్రాలుగా తీసేవారు. ఇదే ధోరణి రేడియో నాటకాల్లోనూ కనిపిస్తుంది. పౌరాణిక, చారిత్రిక అంశాల్నే రేడియో నాటకాలుగా మలిచి ప్రసారం చేసేవారు.

రుషి కుమారుడు రురూ, అతని ప్రేయసి ప్రమద్వర. రురూని గుడ్డిగా ప్రేమించే మరో యువతి కుముదిని. ఈ త్రిముఖ ప్రేమకథనే భూమికగా చేసుకుని ఒక నాటకం రాశారు జానకీ రాం. తన రసపూరితమైన సంభాషణలతో నాటకాన్ని రక్తి కట్టించారు. ఈ సంభాషణ చూడండి... :

"అగ్నిహోత్రాల పొగకు అలవాటు పడ్డ నా కళ్లు నీ వినీల కుంతలాల్లో దాక్కుని నిద్రపోవాలని కోరుతున్నాయి..." ఇది రురూ, ప్రేయసి ప్రమద్వరతో జరిపిన ప్రేమ భాషణ. ఈ సంభాషణను ప్రముఖ చరిత్ర పరిశోధకుడు, మేధావి మల్లంపల్లి సోమశేఖర శర్మ ఎంతో మెచ్చుకున్నారట. మదరాసు కేంద్రం నుంచి వెలువడిన మొదటి సాంఘిక నాటకంగా 'దయ్యాల లంక' నిలిచింది. దీని రచయిత ప్రముఖ న్యాయ కోవిదుడు, నాటక రచయిత పాకాల రాజమన్నారు. నిర్వహణ జానకీరాం.

రేడియోలో తొలి పుస్తక సమీక్షా కార్యక్రమం నిర్వహించిందీ జానకిరామే. ఈ సమీక్షని శ్రీ కోలవెన్ను రామ కోటేశ్వరరావు చేశారు. ఆయన సమీక్షించిన పుస్తకాల్లో... మల్లవరపు విశ్వేశ్వరరావు

'కళ్యాణ కింకిణి', శివశంకర శాస్త్రి 'వకుళమాలిక', వేదుల సత్యనారాయణ 'దీపావళి' ఖండ కావ్యాలు ఉన్నాయి.

ఉద్యోగ బాధ్యతగా ఆకాశవాణిలో ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తూనే, పత్రికల్లో రచనలు చేశారు జానకీరాం. ఆనాడు ప్రబలంగా వున్న భావ కవిత అంటే ఆయనకి చాలా ఇష్టం. స్వయంగా భావ కవిత్వం రాశారు. జానకీరాం రాసిన భావ కవితను ఒక దాన్ని చూద్దాం.

"ఇదిగో! ఇంకా నిద్ర లేవని
మంచు తడి ఆరని పారిజాతాలు
ఈ ధవళిమ నా భావాల స్వచ్ఛత
ఈ ఎరుపు నా అనురాగ రక్తిమ
ఈ పరిమళము మన స్నేహ సౌరభవము
అందుకోవూ
నీవెక్కడున్నా నీ వద్దకే వస్తాను
భిక్షా పాత్రతో గాని
నవరత్నాలు కూర్చిన కంఠమాలతో గాని"

అంటూ సాగుతుంది ఆ కవిత.

జానకీరాం తన జ్ఞాపకాలను గ్రంథస్థం చేశారు. ఇవి 'నా స్మృతిపథంలో', 'సాగుతున్న యాత్ర'గా రెండు భాగాలుగా వచ్చాయి. వీటిని జ్యేష్ఠ లిటరరీ ట్రస్ట్, విశాఖపట్నం వారు ఒకే పుస్తకంగా ప్రచురించారు. ఈ పుస్తకం ప్రధానంగా ఆయన రేడియో జ్ఞాపకాల్నే ప్రస్తావించినా, తొలి రోజుల నాటి తెలుగు రేడియో ప్రసారాల వెలుగు నీడల్ని సాధికారంగా చెబుతుంది. ఈ పుస్తకంలో ప్రతి అధ్యాయమూ ఎవరో ఒక కవి రాసిన భావ కవితతో ప్రారంభమవుతుంది. భావ కవిత్వంపై రచయితకు వున్న మమకారాన్ని ఇది తెలియజేస్తుంది.

జానకీరాం కథలు కూడా రాశారు. 'తోటమాలి' అన్న కథ 'భారతి' మాసపత్రికలో అచ్చయింది. రాకుమారిని ప్రేమించిన తోటమాలి కథ ఇది. భావ కవిత్వాన్ని అభిమానించే రచయిత కథలు కూడా అదే ధోరణిలో సాగడం మనకి కనిపిస్తుంది. 'మీరు నవ్వరేమి?' అనేది మరో కథ. ఇదీ ప్రేమకథే. దీనికి సీక్వెల్‌గా మరో కథ కూడా రాశారు రచయిత. ఒక కథకి కొనసాగింపుగా మరో కథను రాయడం జానకీరాం గారికి అలవాటుగా తోస్తుంది.

శ్రీరంగంలో ఎదురైన ఒక అనుభవాన్ని ఆధారం చేసుకుని జానకీరాం 'వడ్డాణము' అన్న కథని రాశారు. ఈ కథలో పురుషునికీ, పురుషునికీ మధ్య గాఢమైన స్నేహం వున్నట్టే, ఒక పురుషునికీ, స్త్రీకి మధ్య అంతటి స్నేహం వర్ధిల్లగలదనే అంశాన్ని ఈ కథలో ప్రతిపాదించారు రచయిత. అప్పటికి ఇలాంటి విషయంపై కథ రాయడం కొంచెం విప్లవాత్మకమైనదే అని చెప్పాలి. 'వడ్డాణము' కథకి కొనసాగింపుగా 'మంగళము' అన్న కథ రాశారాయన. 'వడ్డాణము' కథ మదరాసు నుంచి వచ్చిన 'ప్రజాబంధు' పత్రికలో అచ్చయితే, 'మంగళము' అక్కడి నుంచే వచ్చిన 'చిత్రాంగి' పత్రికలో వచ్చింది. ఇదే పత్రికలో 'మెయిల్ ఆగని స్టేషన్' అనే వినూత్నమైన శీర్షికతో కథ రాశారు ఆయన. 'మా ఊరి స్టేషన్లో మెయిల్ ఆగదు. కాని తీగ సంపెంగ పువ్వులు పూస్తాయి'... అంటూ రచయిత సౌందర్యాత్మక దృష్టిని ప్రతిబింబించే విధంగా కథ మొదలవుతుంది.

ఆచంట జానకీరాం రచనాశైలి సొగసుగా, సౌకుమార్యంగా వుంటుంది. తన 'సాగుతున్న యాత్ర'లో ఒకచోట డ్రెస్సింగ్ టేబుల్‌ని 'శృంగార మేజా' అని ప్రస్తావించారు. అలంకరించుకోవడాన్ని సింగారించుకోవడం అని అనడం మనకి పరిపాటే! ఆ రోజుల్లో డ్రెస్సింగ్ టేబుళ్లు కొంచెం అపురూపమే, కానీ, జానకీరాం వుండేది మదరాసు మహానగరంలో కదా. ఆనాటికే ఉన్నత వర్గాల వారికి అవి అందుబాట్లోకి వచ్చి వుంటాయి.

తెలుగులో ఉత్తమమైన నవలల్లో ఒకటిగా పరిగణించే బుచ్చిబాబు గారి 'చివరికి మిగిలేది' కి ఆ పేరును సూచించింది జానకీరాం. ఆ నవలకి రచయిత బుచ్చిబాబు ముందు 'ఏకాంతం' అని పేరు పెట్టారు. బుచ్చిబాబు, జానకీరాం ఆకాశవాణిలో సహోద్యోగులు. జానకీరాం ఆకాశవాణి పత్రిక 'వాణి'కి సంపాదకులుగా పనిచేశారు. ఆయన శ్రీమతి శారదాదేవి కూడా రచయిత్రే.

జానకీరాం తండ్రి ప్రసిద్ధ ఆయుర్వేద వైద్యులు ఆచంట లక్ష్మీపతి. తల్లి పేరు సీతమ్మ. ఆయన చిన్నతనాన వారి ఇంటికి వీరేశలింగం, గురజాడ, ఉన్నవ లాంటి సాహితీవేత్తలు లక్ష్మీపతి గారితో మాట్లాడటానికి వచ్చేవారు. తండ్రితో వారి సంభాషణలు జానకీరాం శ్రద్ధగా వినేవారు. అలాగే తర్వాత బెజవాడలో ఉద్యోగరీత్యా వున్నప్పుడు అక్కడ ప్రముఖ భావ కవులతో ఆయనకి గాఢమైన స్నేహం ఉండేది. జానకిరాం వ్యక్తిత్వం రూపుదిద్దుకోవడానికి ఈ నేపథ్యం ఉపకరించింది. 1903 జూన్ 16న మదరాసులో జన్మించిన జానకీరాం, 1994లో తిరుపతిలో మరణించారు.

(జూన్ 16 : ఆచంట జానకీరాం జయంతి)

– ఎస్.హనుమంతరావు
88978 15656

నేలపై తలెత్తి నడిచే నక్షత్రాలు

పుస్తకం

ఆ మధ్య విజయవాడలో కవితా సాంస్కృతిక సంస్థ వారి అవార్డుల ఫంక్షన్‌లో భండారు విజయ గారిని కలిశాను. అదే మొదటిసారి ఆమెను చూడడం, కలవడం. పరిచయాలు, పలకరింపులు అయ్యాక నా కవితా, కథా సంపుటులు ఆమెకు ఇవ్వగానే, "మీరు కథలు కూడా రాస్తారా? ఐతే ఒక కాన్సెప్ట చెప్తాను. దానిపై కథ రాయండి" అన్నారు. ఒంటరి మహిళ అనే అంశంపై రాయమని చెప్పి, ఒక వారం రోజులు గడువు లోపల కథ ఇవ్వాలన్నారు. కానీ, నేను కొన్ని అనివార్య కారణాల వల్ల విజయవాడలోనే ఉండిపోవాల్సి వచ్చింది. విశాఖపట్నం తిరిగొచ్చాక రాయలేకపోయానని మెసేజ్ పెట్టాను. పరవాలేదని చెప్పి, మరొక పది రోజులు గడువిచ్చారు. నా ఆలోచనలలో ఎన్నాళ్ళగానో మెదులుతున్న కథ, నేను అనుకున్నదంతా కథగా చెప్పలేనేమో అనుకున్న కథను మొత్తానికి పూర్తి చేశాను. కథ బావుందని కొన్ని చిన్న సూచనలు చేశారు. ఆ ప్రకారం కథకు మార్పులు చేసి వారికి పంపాను. నా కథ 'స్వయంసిద్ధ' కథాసంకలనంలో చేరిందని తెలిసాక గర్వపడ్డాను. మహిళల జీవితాల గురించి, వారి వ్యథల గురించి మహిళలు కాక ఇంకెవరు విపులంగా చెప్పగలరు?

స్త్రీ అంటే సమాజానికి ఒక చిన్నచూపు ఎప్పుడూ ఉంటుంది. 'ఆడామగా సమానమైనా, మగవాడు కాస్త ఎక్కువ సమానం' అన్నట్టు ఆ తేడా ఎప్పటికీ చెరిగిపోనిది. బయటకు అనకపోయినా అది రకరకాలుగా వ్యక్తమౌతుంది. ఇక ఒంటరి మహిళంటే సమాజం విపరీతమైన ఆసక్తి కనబరుస్తుంది. ఆమె గురించి అన్నీ ఎలాగైనా తెలుసుకుని, కాలక్షేపంగా మాట్లాడుకుని తెగ ఆనందపడుతుంది. పెళ్ళి అవకపోయినా, పెళ్ళై భర్త చనిపోయినా లేక దూరమైనా, ఒంటరిగా ఉండి మరొక స్నేహితుడితో సన్నిహితంగా మెలిగినా గుసగుసలు పోతుంది. ఒకవేళ ఆమె మెత్తనిదైతే బహిరంగంగానే మాటల వాతలు పెట్టి, వెంటాడి వేటాడి వేధిస్తూ ఉంటుంది. అదే నోరు తెరచి గట్టిగా బుద్ధి చెప్పి, తనను తాను రక్షించుకుంటే గయ్యాళి అనే బిరుదు కూడా ప్రదానం చేస్తుంది.

ఇలా మహిళ జీవితపు ప్రతి పొరలో ఎన్నో తెలియని దుఃఖకోణాలు ఉంటాయి. భర్త కొట్టకపోయినా, తాగకపోయినా మంచివాడు అనే ముద్ర వేసి తెగ పొగిడి, స్త్రీని తన అదృష్టాన్ని తలచుకుని మురిసిపోమని కూడా సమాజం సూచిస్తుంది. నలుగురిలో భార్యని అవమానించినా, ఆమెకు స్వేచ్ఛ ఇవ్వకపోయినా అది అతిసహజం అన్నట్టు చూస్తుంది. భర్త మరొక స్త్రీతో సంబంధం పెట్టుకున్నా, అది చాలా మామూలు విషయంగా పరిగణిస్తుంది. అంతేకాక భార్య అతడికి తగినట్టు ప్రవర్తించలేదని ఆమెనే తప్పుబడుతుంది.

మహిళ ప్రతి అడుగునీ, మాటనీ గుచ్చి గుచ్చి చూస్తూ, ఏ చిన్న అవకాశం దొరికినా విమర్శించడానికి, విరుచుకు తినడానికి సిద్ధంగా ఉన్న నోళ్ళు ఎన్నో ఉంటాయి. ఉద్యోగం చేసే మహిళకు మరొక విచిత్రమైన పరిస్థితి. ఉద్యోగపు ఒత్తిళ్ళతో పాటు బయట ఎదురయ్యే వేధింపులు, చులకన చూపులు, శల్యపరీక్షలు ఉండనే ఉంటాయి. అవన్నీ ఇంట్లో చెప్పుకోలేని, సాంత్వన పొందలేని పరిస్థితులు అనేకం. పరాయి మగాడు ఏమైనా అన్నా, తాకినా అందులో మహిళ ఇచ్చిన చనువే కారణం అనే తీర్పులూ ఉంటాయి. ఇన్ని రకాల అవస్థల నడుమ ఆమెకు జీవితం దినదిన గండమై ఉంటుంది.

అసభ్య పదజాలంతో అవమానించినా, తమ జీవిక కోసం కిమ్మనకుండా భరించే మహిళల అసహాయత గురించి వినే ఉంటాం. ఏదో ఒక సందర్భంలో ఇటువంటివి ప్రతి స్త్రీ అనుభవించే ఉంటుంది. ఎవరికీ చెప్పుకోలేనితనం వారిని మరింత కృంగదీస్తుంది. అవసరం ఉన్నంతవరకూ వాడుకునే యంత్రంగా స్త్రీని ఉపయోగించుకుని, ఆ అవిశ్రాంతంగా నడిచే యంత్రం కుంటుబడితే వదిలించుకుందామనుకునే వాళ్ళూ కోకొల్లలు. లోతుగా చూస్తే వివాహ వ్యవస్థలో ఎన్నో లొసుగులు, మరెన్నో ద్వంద్వ నీతులు. అంతెందుకు... ఈనాటికీ ప్లస్సూ మైనస్సూ అంటూ ఆడమగల తేడాల గురించిన నిర్వచనాలు ఉండనే ఉన్నాయి.

తనదైన ఇంట్లోనే ఆమె పరాయిదై నిశ్శబ్దంగా దుఃఖిస్తుంది. తన అనుకున్న వాళ్ళే తనను తేడాగా చూస్తుంటే, మాట్లాడుతుంటే, ఆమె చుట్టూ మనుషులున్నా ఒంటరితనం అనుభవిస్తుంది. ఇలా చెప్పుకుంటే ఎన్నెన్నో కోణాల్లో మహిళ వివక్షకు గురవుతోంది.

అటువంటి మహిళల బాధాతప్త జీవితాల్లోని నలభై కోణాలను పరిచయం చేసే కథలే 'స్వయంసిద్ధ'లోని కథలు. ఈ సంకలనం అటువంటి అవస్థలను, కనబడని కన్నీళ్ళను కథలుగా వినిపిస్తుంది. ఒంటరి పోరాటాలను కళ్ళకు కడుతుంది. ఎన్నో ముళ్ళదారుల్లో ప్రయాణిస్తూ వాళ్ళు గర్వంగా ఎగరేసిన గెలుపు జెండాలు ఈ కథలు. ఇందులో సీనియర్ రచయిత్రుల దగ్గర నుంచి ఇదే తొలి కథగా రాసిన వర్ధమాన రచయిత్రుల వరకూ ఉన్నారు.

'స్వయంసిద్ధ'లోని కథలను నలభై మంది రచయిత్రుల నుంచి సేకరించి ఎంతో శ్రమకోర్చి సంకలనం చేసిన భండారు విజయ గారికి, జ్యోతి గారికి వేవేల అభినందనలు. ఈ సంకలనం తప్పక చదవండి, చదివించండి. ఒంటరి మహిళల జీవన గాథలను, వారి బతుకు పోరాటాలను గురించి తెలుసుకోవడం, మార్పు కోసం కొంతైనా ప్రయత్నించి ఆశించడం మన బాధ్యత కదా! పుస్తకాల కోసం భండారు విజయ గారిని 8801910908 నంబర్‌లో సంప్రదించవచ్చు.

– పద్మావతి రాంభక్త

సీమ నాటక పరిశోధనా 'మూల'స్తంభం

నాటకం

యోగి వేమన విశ్వవిద్యాలయం లలిత కళల శాఖలో బోధన, పరిశోధనా రంగాల్లో అంకితభావం కలిగిన సార్థక ఆచార్యుడు డాక్టర్ మూల మల్లికార్జున రెడ్డి. రాయలసీమలో గత 50 ఏళ్ళుగా పద్య నాటక జైత్రయాత్రలే తప్ప సాంఘిక నాటక ప్రదర్శనలు వేళ్ళ మీద లెక్కింపగలిగినంత స్వల్పం అనుకుంటున్నప్పుడు, ఆయన తన అవిశ్రాంత శోధనా పటిమతో తన పరిశోధన అధ్యయన గ్రంథాన్ని యుజిసి వారికి సమర్పించేనాటికి 500 పైగా పౌరాణిక, చారిత్రక, సాంఘిక, అనువాద నాటకాలు, నాటికలు, ఏకాంకికలను సేకరించారు. ఇంకా అధ్యయనం చేయాల్సిన మరో 500 నాటకాల జాబితాను చూపించారు. ఇలా ఆయన సీమలో నాటకరంగ విశాలమైన పరిధులను పరికింపజేసి ఆశ్చర్యానంద చకితులను చేశారు.

బాల్యం నుంచి పౌరాణిక, చారిత్రక నాటకాలు అంటే ఇష్టం చూపిస్తూ... సాంఘిక నాటకాల పట్ల అంత ఆసక్తిని చూపించని డాక్టర్ మూలకు ... 2015లో నంది నాటక విభాగాల్లో పిల్లల నాటికలకు ప్రాథమిక పరిశీలకుడిగా పనిచేసిన సందర్భంలో, సాంఘిక నాటకం శక్తి సామర్థ్యాలు, సామాజిక ప్రయోజనం వగైరాలు అనుభవంలోకి వచ్చాయి. పరిశోధనలో భాగంగా రాయలసీమ అంతటా తిరుగుతూ 500 పైగా అన్ని రకాల నాటకాలను సేకరిస్తూ, అధ్యయనం చేస్తున్న సందర్భంలో తనలోని నటుడిని, నాటక రచయితను గమనించి, ఆ లక్షణాలను మరింత పదును దిద్దుకున్నారు. పరిశోధనకు తాను నిర్దేశించుకున్న లక్ష్యం–500 నాటకాల సేకరణ. కానీ, రాతప్రతులు, అచ్చు పుస్తకాలు, ప్రదర్శనలు చూస్తూ, తెలుసుకుంటూ మరో 500 నాటకాల సూచి ప్రకటించగలిగారు. ఆయన పడ్డ కష్టం– పరిశోధనలో నూతన అధ్యాయాన్ని సష్టించింది.

ఆ కృషిని పుస్తక రూపంలో చూసిన పెద్దలందరూ మిగిలిన, తాను సేకరించి పెట్టిన, మరో 500 నాటకాలను కూడా శోధించి గ్రంథస్థం చేయమని, చేయగల సత్తా సామర్థ్యాలు డాక్టర్ మూలలో ఉన్నాయన్న ప్రగాఢ విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. దీనినిబట్టే అర్థమవుతుంది.. రాయలసీమ నాటకరంగ పరిశోధనా మూలస్తంభంగా డాక్టర్ మూల చరిత్రలో నిలిచిపోతాడని. 'తినగ తినగ వేము తీయనుండు' అన్నట్టుగా తన పరిశోధనా గ్రంథం ముగించిన సమయానికి, ఆయనలో సాంఘిక నాటికలు, నాటిక రచనపై మమకారం, ఆసక్తి ఆత్మవిశ్వాసం మెండుగా పొటమరించాయి. మనః పూర్వకంగా చేసిన పని సత్ఫలితాలను ఉత్తమ ప్రయోజనాల్ని సంతరింప చేయకుండా పోతుందా? ఇదిగో... అలాంటి దీక్షాంత ఫలితమే 'యమసభ' (నాలుగు) నాటికల సంపుటి ప్రచురణ.

డాక్టర్ మూల స్వతహాగా హాస్య ప్రియుడు, కార్యశీలి, కార్యసాధకుడు. ఒకప్పటి సాంఘిక నాటకాలు అంటే తనకున్న విముఖత దశ నుంచి సాంఘిక నాటికల పౌరాణిక పాత్రధారణతో పాటు అంతకుమించి నాటికల రచయితగా వెలుగులోకి, ప్రసిద్ధిలోకి రావడం





ఒకింత ఆశ్చర్యం కలిగించేదే. తన పది వేళ్ళ మధ్య వేయి నాటక ప్రతులను పరిశీలించిన అనుభవంతో, ఈ నాలుగు నాటికలను రచించారు. ఈ నాలుగూ నూటికి నూరుపాళ్ళు సామాజిక ప్రయోజనంతో పాటు ప్రహసనం, అధిక్షేపం, వ్యంగ్యం, హాస్యం, సామెతలు, లోకోక్తులు, నానుడులు, పలుకుబడులు అనాయాసంగా వాటి ఇతివత్తాల్లో, కథాకథనంలో చోటుచేసుకున్నాయి. ఇంకా ప్రశంసించదగ్గ విషయం ఏమంటే తన నాటికలను ఒక విమర్శకుడిగా నిష్పక్షపాత దృష్టితో, స్వీయ రచనా వ్యామోహంలో పడకుండా, పరిశీలించుకుని ప్రదర్శనాపరంగా ఉన్న కొన్ని లోపాల్ని సవరించుకొని దోషరహితంగా ప్రక్షాళన చేసుకోవడం.

'యమసభ' అంటేనే ఆధునిక ప్రేక్షకుడికి కావలసినంత వినోదం దొరుకుతుందని ఆశ పడతాడు. అంతకుమించి అందులో.. దేశం పట్ల గౌరవం, వైద్య వృత్తి పట్ల ఆదరం, వృత్తిపరమైన నిజాయితీ, మానవ ప్రేమ – సేవ సహానుభూతులకు భిన్నంగా, డబ్బే సర్వస్వంగా పాకులాడే కొందరు వైద్యుల తీరుతెన్నులను నిర్భయంగా చీల్చి చెండాడారు డాక్టర్ మూల. పనిలో పనిగా మాతృభాష పట్ల ప్రేమ లేకపోవడం, కని పెంచిన తల్లిదండ్రులపై ప్రేమ రాహిత్యం, రాజకీయ నేతల వికృత చేష్టలు, చరవాణి విశృంఖలత్వం, అది తెచ్చి పెడుతున్న అనర్థాలను దృశ్యమానం చేశారు. 'నిత్యశంకితులు' నాటికలో మూఢ అంధవిశ్వాసాలను ఎండగడుతూ శాస్త్రీయ, సహేతుక దృక్పథాన్ని అలవర్చుకోవల్సిన అవసరాన్ని బలంగా చెప్పారు. 'అనురాగ స్పర్శ' నాటికలో ఆడపిల్లల పట్ల కొందరు వివక్షగల తండ్రులకు జీవితంలో మర్చిపోలేని గుణపాఠం. 'వ్యసనం' నాటికలో దాని పర్యావసానాల్ని.. వ్యసనపరుల దుశ్చర్యలు, వయస్సు పైబడిన వారు ఆదర్శప్రాయంగా నడుచుకోవల్సిన తీరు– బొమ్మా బొరుసులా చాకచక్యంగా రచన నడిపించారు. 'విలువలు మారుతున్నాయ్' నాటికలో కీర్తిశేషులు వైజీ ప్రకాష్ అన్నట్లు – ఈ నాలుగింటిలోనూ ఒకో రకమైన ప్రత్యేకత– తొణికిసలాడే హాస్యం, సందర్భానికి తగిన శక్తివంతమైన సంభాషణలు, మనుషుల్లోని చిత్ర విచిత్ర తత్వాలను కాచి వడబోసి, తన రచనా నికషోపలంగా డాక్టర్ మూల తీర్చిదిద్దారు.

"నాటకానికి సంఘర్షణ ప్రాణం. ఈ సంఘర్షణ బహిర్గతంగానూ అంతర్గతంగానూ ఉంటుంది. మానవ మనో లోకాల్లో జరిగే అంతః సంఘర్షణను ఆవిష్కరించే ప్రయత్నం చేసింది ఆధునిక తెలుగు నాటక సాహిత్యం" అంటారు డాక్టర్ దీర్ఘాసి విజయ భాస్కర్. అందుకు తాజా ఉదాహరణగా 'యమసభ' సంపుటిలోని నాలుగు నాటికలూ నిలుస్తాయి.

"సమాజంలోని మూఢ నమ్మకాలను నిరసించి, దురాచారాలను ఖండించి దోషాలను తిరస్కరించి సద్గుణాలను ప్రోత్సహించడంలో నాటకానికి గొప్ప ప్రాధాన్యత ఉంది" అని తెలుగు నాటక తొలి ప్రయోక్త కందుకూరి వీరేశలింగం అన్నారు. అలాంటి ఉదాత్త ఆశయంతో ఈనాటి నాటక రచయితలు అడుగులు వేస్తున్నారనడానికి అక్షర సాక్ష్యాలు డాక్టర్ మూల నాటికలు.

– మల్లేశ్వరరావు ఆకుల
79818 72655

రచనలకు ఆహ్వానం

ఈ పేజీలో ప్రచురణార్థం రచయితల నుంచి సాహిత్య వ్యాసాలను, సాహిత్య విమర్శలను ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలను కంపోజు చేసి పంపేవారు సాఫ్ట్ కాపీని, పిడిఎఫ్‌ని కలిపి పంపాలి. సమకాలీన రచనలపై విమర్శనాత్మక వ్యాసాలకు ప్రాధాన్యం ఉంటుంది. పుస్తకాలను, వ్యాసాలను కింది చిరునామాకు పంపాలి. అక్షరం, ప్రజాశక్తి కార్యాలయం, తాడేపల్లి, అరవిందా స్కూలు దగ్గర, గుంటూరు జిల్లా..
prajasavvadi@gmail.com

ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకింగ్‌లో దిగజారిన ఐఐఎఫ్‌టీ ప్లేస్

- మూడు స్థానాలు దిగజారి 27వ ర్యాంకుకు పడిపోయిన వైనం

న్యూఢిల్లీ : వాణిజ్య మంత్రిత్వ శాఖకు చెందిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (ఐఐఎఫ్‌టి) ర్యాంకు పడిపోయింది. ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకింగ్ 2023లో మేనేజ్‌మెంట్ విభాగంలో మూడు స్థానాలు దిగజారి 27వ స్థానానికి చేరుకున్నది. నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్‌ఐఆర్‌ఎఫ్) కింద ర్యాంకింగ్‌ను హెచ్‌ఆర్డీ మంత్రిత్వ శాఖ జాబితా విడుదల చేసింది. గతేడాది ర్యాంకింగ్‌లో, ఐఐఎఫ్‌టీ 24వ స్థానంలో ఉండగా... 2021లో 25వ స్థానంలో ఉన్నది. 2020లో 26వ స్థానంలో, 2019లో 31వ స్థానంలో ఉన్నది. ఎన్‌ఐఆర్‌ఎఫ్ 2015లో దేశంలోని ఉన్నత విద్యాసంస్థలకు ఆబ్జెక్టివ్ ప్రమాణాల ఆధారంగా ర్యాంక్ ఇవ్వడానికి అటువంటి సంస్థలలో పోటీ వైఖర్యాన్ని ప్రోత్సహించడానికి ప్రారంభించబడింది.

మణిపూర్‌లో ఇంటర్నెట్‌పై మరో 5 రోజులు నిషేధం

ఇంఫాల్ : గిరిజన తెగల మధ్య హింస చెలరేగిన నేపథ్యంలో మణిపూర్‌లో ఇంటర్నెట్ సేవలపై విధించిన నిషేధాన్ని మరో ఐదు రోజుల పాటు పొడిగించారు. నెల రోజులు దాటినా ఇప్పటికీ రాష్ట్రంలో హింసాత్మక ఘటనలు కొనసాగుతూనేవుండటంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ నెల 15 మధ్యాహ్నం 3 గంటల వరకు ఇంటర్నెట్ నిషేధం అమల్లో ఉంటుందని రాష్ట్ర హోం శాఖ జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. మరోవైపు ఇంఫాల్ ఈస్ట్, ఇంఫాల్ వెస్ట్‌లలో కర్ఫ్యూని సడలించారు. ఉదయం 5 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు ఆంక్షలు సడలిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. కాగా, శుక్రవారం ఇంఫాల్ జిల్లాలో ఓ గ్రామంలో జరిగిన కాల్పుల్లో ముగ్గురు వ్యక్తులు మరణించిన సంగతి తెలిసిందే.

శ్రీలంక డెంగీ రోగుల్లో 25 శాతం మంది స్కూలు పిల్లలే

కొలంబో : శ్రీలంకలోని డెంగీ రోగుల్లో దాదాపు 25 శాతం మంది స్కూలుకెళ్లే పిల్లలేనని ఆరోగ్య అధికారి ఆదివారం తెలిపారు. జాతీయ డెంగీ నియంత్రణ విభాగం డైరెక్టర్ నళిన్ అరియరత్నె మాట్లాడుతూ, ఈ ఏడాది ఇప్పటివరకు దేశంలో 42 వేలకు పైగా డెంగీ కేసులు నమోదయ్యాయని చెప్పారు. కొత్త విద్యా సంవత్సరంలో పాఠశాలలు ప్రారంభమవడానికి ఒక రోజు ముందుగా మీడియానుద్దేశించి ఆయన మాట్లాడుతూ, స్కూలు స్థాయిలో డెంగీ వ్యాప్తిని కట్టడి చేయాల్సిన అవసరం వుందని అన్నారు. దాదాపు 50 శాతం కేసులు పశ్చిమ ప్రావిన్స్ నుండి వచ్చాయని చెప్పారు. శ్రీలంకలో ఆ ప్రావిన్స్ అత్యంత జనాభా కలిగిన ప్రాంతంగా వుందని అన్నారు. ఈ ఏడాది దేశంలో పెద్ద ఎత్తు డెంగీ కేసులు పెరుగుతుండటంతో ఆరోగ్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. గతేడాదిలో దేశంలో 76 వేల డెంగీ కేసులు నమోదైనట్లు అధికారిక డేటా తెలిపింది.

పాక్ గగనతలంలోకి ఇండిగో విమానం

- ప్రతికూల వాతావరణం వల్లేనని వివరణ

న్యూఢిల్లీ: ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా అమృత్‌సర్ నుంచి అహ్మదాబాద్ ప్రయాణిస్తున్న ఇండిగో విమానం పాకిస్తాన్ గగనతలంలోకి ప్రవేశించింది. శనివారం రాత్రి ఈ సంఘటన జరిగింది. ఇండిగో అధికారి ఒకరు ఆదివారం నాడు ఈ విషయాన్ని ధ్రువీకరించారు. ఇండిగో 6ఇ-645 విమానం అమృత్‌సర్ నుంచి రాత్రి 8 గంటలకు బయలుదేరి స్వల్పకాలం పాక్ గగనతలంలోకి ప్రవేశించిన తరువాత 9.40 గంటలకు అహ్మదాబాద్‌లో దిగినట్లు ఇండిగో ఒక ప్రకటనలో తెలిపింది. వాతావరణ ప్రతికూలత కారణంగా లాహోర్ మీదుగా పాకిస్తాన్ గగనతలంలోకి విమానం ప్రవేశించినట్లు పేర్కొంది. విమానం డైవర్షన్ విషయంలో అటు పాకిస్తాన్ ఎటిసి, ఇటు అమృత్‌సర్ ఎటిసి ఫోనులో వివరాలు ఇచ్చిపుచ్చుకుంటూ చక్కటి సమన్వయంతో వ్యవహరించారని పేర్కొంది. 30 నిమిషాల అనంతరం విమానం సరైన మార్గంలోకి ప్రవేశించి సురక్షితంగా అహ్మదాబాద్ చేరుకున్నట్లు తెలిపింది. కాగా శనివారం మరో విమానం కూడా వాతావరణ పరిస్థితుల ప్రతికూలత కారణంగా అత్యవసర ల్యాండింగ్ అయ్యింది. ఢిల్లీ-చెన్నై విమానం ఒకటి గాలిలో ఉండగానే ఇంజన్‌లో లోపం తలెత్తడంతో ఢిల్లీ విమానాశ్రయంలో ల్యాండింగ్ చేశారు.

పరేడ్‌లో స్పృహ తప్పి పడిపోయిన బ్రిటన్ సైనికులు

లండన్ : బ్రిటన్‌లో 'ట్రూపింగ్ ది కలర్' పరేడ్ కోసం రిహార్సల్ నిర్వహిస్తుండగా ముగ్గురు సైనికులు మూర్ఛపోయినట్లు స్థానిక మీడియా పేర్కొంది. ఎండ తీవ్రంగా ఉండటంతో వారు స్పృహ తప్పి పడిపోయినట్లు తెలిపింది. ఆ సమయంలో లండన్‌లో 30 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదవగా, సైనికులు ఉన్ని ట్యూనిక్స్, బేర్‌స్కిన్ టోపీలు ధరించి పరేడ్‌లో పాల్గొనడంతో తీవ్ర అలసటకు గురయ్యారు. ప్రిన్స్ విలియం ఎదుటే ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. 'ట్రూపింగ్ ది కలర్' అనేది ఏటా నిర్వహించే పరేడ్. వచ్చేది అధికారిక పుట్టినరోజు సందర్భంగా జూన్‌లో 'ట్రూపింగ్ ది కలర్ పరేడ్'ను నిర్వహిస్తారు. ప్రస్తుతం దీని రిహార్సల్స్ జరుగుతున్నాయి. జూన్ 17న కింగ్ చార్లెస్ 3 ఎదుట 'ట్రూపింగ్ ది కలర్' పరేడ్ జరగనుంది.

'రాజీ' కోసం రెజ్లర్లకు బెదిరింపులు

- నయానో భయానో దారికి తెచ్చుకోవడానికి కమలం ఒత్తిళ్లు

ఆందోళన చేస్తున్న రెజ్లర్లు (ఫైల్‌ఫోటో)

న్యూఢిల్లీ : లైంగిక వేధింపులకు పాల్పడిన డబ్ల్యూఎఫ్‌ఐ చీఫ్, బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను అరెస్ట్ చేయాలనే డిమాండ్‌తో ఆందోళన నిర్వహిస్తున్న మల్లయోధులపై రాజీ చేసుకోవాల్సిందిగా కేంద్ర ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడుతుంది. రెజ్లర్లపై తీవ్ర ఒత్తిడి తీసుకుని వస్తుంది. దీనికి కారణం లేకపోలేదు. ఆందోళన చేస్తున్న రెజ్లర్లలో ఎక్కువ మంది జాట్ కులానికి చెందిన వారు. ఈ జాట్ల ప్రాబల్యం కేవలం హర్యానాకే పరిమితం కాదు. పశ్చిమ ఉత్తరప్రదేశ్, రాజస్థాన్‌తో పాటు ఢిల్లీలో కొంతమేర వీరు నిర్ణయాత్మక శక్తిగా కొనసాగుతున్నారు. ఈ నాలుగు రాష్ట్రాలలోని 40 లోక్‌సభ స్థానాలలో, వాటి పరిధిలోని 160 అసెంబ్లీ స్థానాలలో అభ్యర్థుల జయాపజయాలను తారుమారు చేసే బలం వీరి సొంతం. కర్ణాటక ఓటమితో దక్షిణాది రాష్ట్రాలపై పూర్తిగా పట్టు కోల్పోయిన బిజెపి, ఉత్తరాదిలోనూ వ్యతిరేకతను మూటకట్టుకుంటోంది. ఈ నేపథ్యంలో రెజ్లర్లను బెదిరించి లేదా ఒత్తిళ్లతోనూ వారిని దారికి తెచ్చుకోవడం మినహా మరో మార్గం లేదని ఆ పార్టీ నిర్ణయానికి వచ్చింది. ఈ నేపథ్యంలోనే నిరసన విరమించాలని, రాజీ చేసుకోవాలని రెజ్లర్లకు బెదిరింపులు వస్తున్నాయి. బ్రిజ్ భూషణ్‌పై తొలుత ఆరోపణలు చేసిన మైనర్ రెజ్లర్ ఆ తర్వాత మాట మార్చడానికి ఈ ఒత్తిడే కారణమని ఒలింపిక్ కాంస్య పతక విజేత సాక్షి మాలిక్ తెలిపారు. రాజీ చేసుకోవాల్సిందిగా పెద్ద ఎత్తున ఒత్తిడి వస్తోందని ఆమె ఓ టెలివిజన్ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. బ్రిజ్ భూషణ్ సన్నిహితులు ఫోన్ చేసి బెదిరిస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

ఫిర్యాదును వెనక్కి తీసుకోవాల్సిందిగా మైనర్ రెజ్లర్ తండ్రిపై తీవ్రమైన ఒత్తిడి తెచ్చారని, దీంతో ఆయన మానసిక ఒత్తిడికి లోనయ్యారని సాక్షి మాలిక్ తెలిపారు. హర్యానాలోని సోనేపట్‌లో ఆమె విలేకరులతో మాట్లాడుతూ రెజ్లర్లు రోజురోజుకూ మానసికంగా ఎంతగా కుంగిపోతున్నారో ఎవరికీ అర్థం కావడం లేదని వాపోయారు. భవిష్యత్ కార్యాచరణను నిర్ణయించడానికి రెజ్లర్లు ఏర్పాటు చేసిన మహాపంచాయత్‌లో పాల్గొనేందుకు ఆమె సోనేపట్ వచ్చారు.

సమస్యను పూర్తిగా పరిష్కరించని పక్షంలో ఆసియా క్రీడలలో పాల్గొనబోమని స్పష్టం చేశారు. ఆసియా క్రీడల కోసం ఈ నెలలో ట్రయల్స్ నిర్వహిస్తున్న నేపథ్యంలో సాక్షి మాలిక్ చేసిన ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. నిరసనలో పాల్గొంటున్న రెజ్లర్లు ఆందోళన విరమించి, ఈ ట్రయల్స్‌కు హాజరై ఆసియా క్రీడల జట్టులో స్థానం సంపాదించాల్సి ఉంటుంది. చైనాలో సెప్టెంబర్ 23 నుండి అక్టోబర్ 8 వరకూ ఆసియా క్రీడలు జరగనున్న విషయం తెలిసిందే. కాగా ఈ వ్యవహారంలో పోలీసుల విచారణ పూర్తి కావడానికి ఈ నెల 15 వరకూ సమయం ఇవ్వాలని కేంద్ర క్రీడల శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ తమను కోరినట్లు రెజ్లర్లు నాలుగు రోజుల క్రితం తెలిపారు.

బిజెపికి ఓటమి భయం

రెజ్లర్లలో ఎక్కువ మంది జాట్ కులానికి చెందిన వారు ఉండడంతో వారి ప్రభావం నాలుగు రాష్ట్రాల్లోని ఎన్నికల ఫలితాలపై ఉండబోతోంది. జాట్ల మద్దతుతోనే ఉత్తరప్రదేశ్‌లో బిజెపి అధికారంలోకి రాగలిగింది. అయితే ఇప్పుడు ఆ రాష్ట్రంలో పరిస్థితి మారుతోంది. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్‌ఎల్‌డి ఎనిమిది స్థానాలు గెలిచింది. ఇవన్నీ జాట్ల ప్రాబల్యం అధికంగా ఉన్న స్థానాలే. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ జాట్ల ప్రభావం ఎక్కువగా ఉన్న చోట ఆర్‌ఎల్‌డి, దాని మిత్రపక్షమైన సమాజ్‌వాది పార్టీ గణనీయమైన విజయాలు సాధించింది. మరోవైపు ఆయా ప్రాంతాలలో బిజెపి చతికిలపడింది. జాట్ల ప్రాబల్యం ఎక్కువగా ఉన్న జిల్లాలలో ఆ పార్టీ 20 నగరపాలిక ఛైర్మన్ స్థానాలను (మొత్తం 56 స్థానాలు), 34 నగర పంచాయత్ ఛైర్మన్ స్థానాలను (మొత్తం 124 స్థానాలు) మాత్రమే పొందగలిగింది. పశ్చిమ యూపీలోని 12 లోక్‌సభ స్థానాలు, 40 అసెంబ్లీ స్థానాలలో అభ్యర్థుల గెలుపు ఓటములను నిర్ణయించే శక్తి జాట్లకు ఉంది. మొత్తంగా చూస్తే ఉత్తరప్రదేశ్, హర్యానా, రాజస్థాన్, ఢిల్లీ రాష్ట్రాలలోని 40 లోక్‌సభ స్థానాలు, 160 అసెంబ్లీ స్థానాలలో జాట్లు నిర్ణయాత్మక శక్తిగా ఉన్నారు. యుపి 2022 అసెంబ్లీ ఎన్నికల సమయంలోనే జాట్ల ఓట్లు పార్టీలవారీగా చీలిపోయాయి. రెజ్లర్ల ఆందోళనతో జాట్లు అంతా 2024 సాధారణ ఎన్నికల్లో తమకు వ్యతిరేకంగా ఓటు వేస్తారని, దీంతో తమకు ఓటమి తప్పదని బిజెపి నాయకులు భయపడుతున్నారు.

ఆధారాలు ఇవ్వండి
రెజ్లర్లకు ఢిల్లీ పోలీసులు నోటీసులు

ప్రజాశక్తి -న్యూఢిల్లీ బ్యూరో

రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్‌పై కేసును నమోదు చేసిన ఇద్దరు మహిళా రెజ్లర్లకు ఢిల్లీ పోలీసులు సమన్లు పంపించారు. సింగ్ పై లైంగిక ఆరోపణలు చేస్తూ కన్నాట్ ప్లేస్ పోలీస్ స్టేషన్‌లో సీఆర్పీసీ సెక్షన్ 91 ప్రకారం ఆరోపణలు చేసినదాని ప్రకారం వీడియోలు, ఆడియోలు, వాట్సాప్ చాటింగ్‌లు, ఫోటోలు, బెదిరింపు సందేశాలు వంటి సాక్ష్యాధారాలు ఏమైనా ఉంటే స్టేషన్‌లో పొందుపరచాలని కోరింది.

ఏప్రిల్ 21న భారత మహిళా రెజ్లర్లు ఇద్దరు భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు, బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ తమను లైంగికంగా వేధిస్తున్నారని, ఊపిరి చెక్ చేస్తానంటూ ఇష్టానుసారంగా మీద చేతులు వేస్తున్నారని, అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. తాజాగా కన్నాట్ ప్లేస్ పోలీసులు ఫిర్యాదులో వారు తెలిపిన వివరాల ప్రకారం నిందితుడికి సంబంధించిన వివరాలు ఉంటే తమకివ్వాలంటూ సీఆర్పీసీ సెక్షన్ 91 చేతులు వేసినట్టుగా కానీ, తమను ముట్టుకుంటున్నట్టుగా కానీ ఫోటోలు, వీడియోలు, వాట్సాప్ సందేశాలు ఏమైనా తమకి ఇవ్వాలంటూ సిఆర్పిసి సెక్షన్ 91 ప్రకారం ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ సంతకాలు చేసిన నోటీసులను పంపించారు.

రూ. సున్నా టిక్కెట్ అందిస్తున్న సిద్ధరామయ్య

ఉచితంగా చలోచలో !

- కర్ణాటకలో 'శక్తి యోజన' ప్రారంభం
- స్వయంగా టిక్కెట్లు అందజేసిన సిద్ధరామయ్య

బెంగళూరు : కర్ణాటకలో మహిళలు రాష్ట్ర ప్రభుత్వ రవాణాకు సంబంధించిన బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే పథకం ఆదివారం నుంచి అమల్లోకి వచ్చింది. 'శక్తి యోజన' పేరిట ఈ పథకాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆదివారం నాడు స్థానిక విధానసభ సమీపంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్, రాష్ట్ర రవాణా మంత్రి రామలింగా రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ధర 'సున్నా'గా ఉన్న టిక్కెట్లను మహిళా ప్రయాణికులకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్వయంగా అందజేశారు. ఐదుగురు మహిళలకు ' శక్తి స్మార్ట్' కార్డులను కూడా ఆయన అందచేశారు. దీంతో మహిళలకు ఉచిత ప్రయాణం అందుబాటులోకి వచ్చింది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఐదు ప్రధాన హామీల్లో 'శక్తి యోజన' ఒకటి. ఈ ఉచిత ప్రయాణ పథకం వల్ల ప్రతి రోజూ 41.8 లక్షల మహిళా ప్రయాణికులు లబ్ది చేకూరనుంది. ఇందుకోసం ప్రభుత్వం రూ.4,051.56 కోట్లు ఖర్చు చేయనుంది. ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట నుండి రాష్ట్ర పరిధుల్లో అమల్లోకి వచ్చిన ఈ పథకం కేవలం కర్ణాటక మహిళలకు మాత్రమే వర్తిస్తుంది. పథకం ప్రయోజనాలు అందుకునేందుకు మహిళలు 'సేవా సింధు' అనే ప్రత్యేక వెబ్ పోర్టల్‌లో ద్వారా నమోదు చేసుకోవాల్సివుంటుంది. లబ్దిదారులకు 'శక్తి స్మార్ట్'లు అందజేస్తారు. అవి చూపించి ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని పొందవచ్చు.

శాంతి కమిటీని బహిష్కరిస్తాం

- కుకీల ప్రకటన

ఇంఫాల్ : మణిపూర్‌లో కేంద్రం వేసిన శాంతి కమిటీని బహిష్కరిస్తామని కుకీ ప్రతినిధులు తెలిపారు. ఆ కమిటీలో ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్, ఆయన మద్దతుదారులు సభ్యులుగా వున్నారు. అయితే కమిటీలో వీరిని సభ్యులుగా తీసుకోవడానికి ముందుగా తమ సమ్మతిని కోరలేదని కుకీ ప్రతినిధులు తెలిపారు. చర్చలు జరిపేందుకు వీలుగా కేంద్రం పరిస్థితిని సానుకూలంగా చేయాలని వారు డిమాండ్ చేశారు. మణిపూర్‌లో వివిధ జాతుల గ్రూపుల మధ్య శాంతి ప్రక్రియకు వెసులుబాటు కల్పించేందుకు గానూ కేంద్ర హోం శాఖ శనివారం ఒక మిటీని ఏర్పాటు చేసింది. 51మంది సభ్యులతో కూడిన కమిటీకి గవర్నర్ అనుసూయ ఉయికే అధ్యక్షత వహిస్తారు. తమ అనుమతి లేకుండానే సభ్యులుగా కమిటీలో తమను చేర్చారని అనేకమంది వెల్లడించారు. అటువంటి ఒక సభ్యుడు, కుకీ ఇన్పి మణిపూర్ (కెఐఎం) అధ్యక్షుడు అజంగ్ ఖోంగ్సాయ్ మాట్లాడుతూ, శాంతిచర్చల కోసం మణిపూర్ ప్రభుత్వంతో కూర్చోవడానికి తాను సిద్ధంగా లేనని చెప్పారు.

అత్యంత తీవ్రంగా 'బిపోర్‌జాయ్'

- 15న గుజరాత్‌లో తీరం దాటే అవకాశం

న్యూఢిల్లీ : అరేబియా సముద్రంలో ఏర్పడిన 'బిపోర్‌జాయ్' తుపాను అతి తీవ్ర తుపాను నుంచి, అత్యంత తీవ్ర తుపానుగా మారింది. ఇది అతిపెను తుపానుగా మారనున్నట్లు భారత వాతావరణ శాఖ(ఐఎండి) ఆదివారం హెచ్చరించింది. ప్రస్తుతం తూర్పు మధ్య అరేబియా తీరంలో కేంద్రీకృతమైనట్లుగా పేర్కొంది. గంటకు 5 కిలోమీటర్ల వేగంతో ఈ తుపాను ఉత్తర దిశగా కదులుతుందని, కొన్ని గంటల్లోనే అతి పెను తుపానుగా మారుతుందని వెల్లడించింది. అలాగే ఈ తుపాను ఈ నెల 15న గుజరాత్‌లోని సౌరాష్ట్ర, కచ్‌ల మధ్య తీరం దాటే అవకాశం ఉందని ఐఎండి అంచనా వేసింది. 'బిపర్‌జాయ్ ముంబయికి ఉత్తర నైరుతి దిక్కున 530 కిలోమీటర్ల దూరంలో, పోర్‌బందర్ నౌకాశ్రమానికి దక్షిణా 830 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమయింది. ఇది మరింత తీవ్రమై గుజరాత్‌లోని సౌరాష్ట్ర, కచ్ వద్ద తీరాన్ని తాకవచ్చు' అని ఐఎండి ఆదివారం ట్వీట్ చేసింది. ఈ తుపానుతో ఇప్పటికే మూడు రాష్ట్రాలను ఐఎండి హెచ్చరించిన సంగతి తెలిసిందే. అలాగే మరోవైపు పాకిస్థాన్‌లోని కరాచీ పోర్టు ట్రస్ట్ ఇప్పటికే దీనిపై రెడ్ అలర్ట్ జారీ చేసింది. నౌకలకు అత్యవసర మార్గదర్శకాలను జారీ చేసింది.

నా ప్రభుత్వ కూల్చివేత వెనుక
అమెరికా హస్తం

' న్యూస్ వీక్' కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇమ్రాన్‌ఖాన్



ఇస్లామాబాద్: రష్యాతో ఒప్పందం కుదుర్చుకున్న తరువాత అమెరికా తనపై కుట్ర పన్నిందని పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ ఆరోపించారు. ఉక్రెయిన్‌లో రష్యా మిలిటరీ ఆపరేషన్‌ను ఖండించాలని అమెరికా తెచ్చిన ఒత్తిడికి తాను తలొగ్గనందుకు తనపై కక్ష కట్టిందని ఇమ్రాన్ అన్నారు. అమెరికాకు చెందిన ' న్యూస్ వీక్' పత్రికకిచ్చిన ఇంటర్వ్యూలో ఇమ్రాన్ ఖాన్ పలు ఆసక్తికర విషయాలు వెల్లడించారు. ఈ ఇంటర్వ్యూను ఆ పత్రిక శుక్రవారం ప్రచురించింది. గత ఏడాది తనను పదవి నుంచి తొలగించడంలో అమెరికా పాత్ర గురించి ఇమ్రాన్‌ఖాన్ ఆ ఇంటర్వ్యూలో సవివరంగా తెలిపారు. 2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్‌లో రష్యా మిలిటరీ ఆపరేషన్ ప్రారంభించిన రోజున తాను రష్యా సందర్శనకు వెళ్లానని ఇమ్రాన్ తెలిపారు. ఆ పర్యటనను రద్దు చేసుకోవాలని అమెరికా ఎంత ఒత్తిడి చేసినా వినలేదు. రష్యా నుంచి చౌకగా చమురు, గోధుమలు దిగుమతి చేసుకునేందుకు వీలు కల్పించే ఒప్పందాన్ని ఆ పర్యటనలో తాను కుదుర్చుకున్నానని అన్నారు.. రష్యా మిలిటరీ ఆపరేషన్‌ను ఖండించాలని అమెరికా ఎంత ఒత్తిడి తెచ్చినా తాను ఖాతరు చేయలేదని, దేశ ప్రయోజనాలే తనకు ముఖ్యమని భావించానని అన్నారు. ఒప్పందం రద్దు చేసుకోకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని దౌత్యవేత్తల ద్వారా అమెరికా తనను బెదిరించిందని, వాటిని కూడా తాను లెక్కచేయలేదని అన్నారు. ఆ మరుసటి రోజునే తన ప్రభుత్వానికి వ్యతిరేకంగా పార్లమెంటులో అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టే ప్రతిపాదన వచ్చింది. ఆ అవిశ్వాస తీర్మానం పై ఓటింగ్‌కు ముందు తన పార్టీకి చెందిన ఎంపీలను, ఇతర పార్టీల పార్లమెంటు సభ్యులతో అమెరికన్ ఎంబసీ సంప్రదించింది. వారిని ప్రలోభపెట్టింది. దీంతో అవిశ్వాస తీర్మానం నెగ్గి తాను ప్రధాని పదవి నుంచి నిష్క్రమించాల్సి వచ్చిందని ఇమ్రాన్ తెలిపారు. పదవి నుంచి వైదొలగిన తరువాత కూడా తనపై రకరకాల కేసులు పెట్టి వేధిస్తున్నారని ఇదంతా అగ్రరాజ్యం కుట్రలో భాగమేనని ఇమ్రాన్ చెప్పారు. అవినీతి నుంచి దేశ ద్రోహం వరకు అనేక రకాల కేసులు తనపై మోపారని తెలిపారు. పాకిస్తాన్ మిలిటరీ అధిపతి కూడా ఈ కుట్రలో భాగస్వామి అయ్యారని ఇమ్రాన్ ఆరోపించారు. మాజీ ప్రధానిపై వచ్చిన దేశ ద్రోహం ఆరోపణలపై పరిశోధిస్తున్న న్యాయవాది హత్య కేసులో ఎలాంటి ఆధారాలు లేకున్నా ఇమ్రాన్ ఖాన్ పేరును నిందితుల జాబితాలో చేర్చారు.

అమెరికా నుంచే అసలు ముప్పు

- సిన్హువా వ్యాఖ్య

బీజింగ్ : అమెరికా నేతృత్వంలోని కొన్ని అభివృద్ధి చెందిన దేశాలు చైనాను లక్ష్యంగా చేసుకునేందుకు డీ కపులింగ్ స్థానంలో డీ రిస్కింగ్‌తో వ్యవహరిస్తున్నాయని, కానీ ఇది కొత్త సీసాలో పాత సారా వంటిదని చైనా వ్యాఖ్యానించింది. 'డీ రిస్కింగ్' గురించి మాట్లాడేటపుడు ముందుగా అసలు ముప్పు ఎక్కడ ఉన్నదో గుర్తించాలి, శాంతి, సౌభాగ్యం, మానవాళి సంక్షేమం వీటికి నిజమైన ముప్పు చైనా వ్యతిరేకుల నుండే వస్తోందని చైనా అధికార వార్తా సంస్థ సిన్హువా వ్యాఖ్యానించింది. చైనాను లక్ష్యంగా చేసుకునే డీ రిస్కింగ్ గురించి కొందరు మాట్లాడుతున్నారు. చైనా నుంచి ప్రపంచానికి ఎలాంటి ముప్పు లేదు. అసలు ముప్పు అంతా అమెరికా, దాని తైనాతీల నుంచే. వాటి గుత్తాధిపత్య ధోరణి నుంచే. అందుకే పశ్చిమ దేశాల డీ రిస్కింగ్ ఇప్పుడు ప్రపంచానికి అవసరం. పశ్చిమ దేశాలు తమ అహంకారాన్ని వీడి బహుళ ధ్రువ ప్రపంచం వాస్తవికతను అర్థం చేసుకునేందుకు ప్రయత్నిస్తే మంచిదని సిన్హువా పేర్కొంది. గత కొన్ని దశాబ్దాల్లో ఇరాక్ వంటి దేశాల్లో పశ్చిమ దేశాల దాడులు, దురాక్రమణల వల్ల తలెత్తిన దుష్పరిణామాల గురించి ఇక్కడ ప్రస్తావించుకోవాలి, కొన్ని దేశాలు తరచుగా ఇతర దేశాల ముంగిట కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నాయి, వేల మైళ్ళ దూరంలో వున్నప్పటికీ ప్రపంచానికి తీవ్ర ముప్పు కలుగజేస్తున్నాయి. గతేడాది అమెరికా అనేకసార్లు దక్షిణచైనా సముద్ర జలాల్లో దాడులకు, విన్యాసాలకు దిగడాన్ని ఈ సందర్భంగా సిన్హువా ప్రస్తావించింది.

పాక్‌లో భారీ వర్షాలు

- 27 మంది మృతి

ఇస్లామాబాద్: పాకిస్థాన్ ఈదురు గాలులు, భారీ వర్షాలు కుదిపేస్తున్నాయి. శనివారం రాత్రి నుంచి ఆదివారం వరకు పాకిస్థాన్‌లో కొన్ని ప్రాంతాల్లో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్షాల ధాటికి 8 మంది చిన్నారులతో సహా 27 మంది మృతి చెందారని అధికారులు తెలిపారు. మరో 140 మంది పైగా గాయపడ్డారని పేర్కొన్నారు. ఖైబర్ ఫక్తుంఖ్వా ప్రావిన్స్‌లోని నాలుగు జిల్లాల్లో భారీ వర్షాల ప్రభావంతో ఇళ్లు కూలడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. 200కు పైగా పశువులు కూడా మరణించాయని అధికారులు తెలిపారు. బన్ను జిల్లాలో 15 మంది మరణించగా, వీరికే ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు పిల్లలున్నారు. మిగిలిన ప్రాంతాల్లో ఇంటి పైకప్పు, గోడలు కూలిపోవడంతో శిథిలాల్లో చిక్కుకొని 12 మంది మరణించారు. ప్రభుత్వం ఈ నాలుగు జిల్లాల్లో ఎమర్జెన్సీ ప్రకటించి, సహాయక చర్యలు ముమ్మరం చేసింది.

సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్
CUB TRUST AND EXCELLENCE SINCE 1904
క్రెడిట్ రికవరీ మరియు మేనేజ్‌మెంట్ శాఖ
అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసు: నెం. 24-బి, గాంధీనగర్, కుంభకోణం-612001,
E-Mail id : crmd@cityunionbank.in,
Ph : 0435-2432322, Fax : 0435-2431746

SARFAESI యాక్ట్ 2002 క్రింద రీ-టెండరు మరియు వేలం అమ్మకపు ప్రకటన

SARFAESI చట్టం 2002 ప్రకారం సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నియమాలు, 2002లోని రూల్ 8(6) మరియు 9 ప్రకారం, సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్‌కి తనఖా పెట్టిన ఈ క్రింది ఆస్తి/లు బ్యాంక్ అధీకృత అధికారి ద్వారా రీ-టెండర్-కమ్-పబ్లిక్ వేలం ద్వారా విక్రయించబడతాయి. రికవరీ కోసం రూ. 14,27,46,737/- (పద్నాలుగు కోట్ల ఇరవై ఏడు లక్షల నలభై ఆరు వేల ఏడు వందల ముప్పై ఏడు రూపాయలు మాత్రమే) 06.06.2023 నాటికి 07.06.2023 నుండి ఛార్జ్ చేయబడే తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులు, రుణగ్రహీతలు/ గ్యారంటర్లు బ్యాంకుకు చెల్లించాల్సిన ఇతర బకాయిలు, సంఖ్య 1) మెసెర్స్ తుమ్మిడి బ్రదర్స్ జ్యూవెలరీ, డో.నం.28-4-8, ప్రకాశరావు పేట, జగదాంబ సెంటర్, విశాఖపట్నం-530001. నం.2) శ్రీ. టి. రామ్ కుమార్, తండ్రి. పుల్లయ్య, డో.నం.78-7-19, తుమ్మిడి పుల్లయ్య భవన్, తుమ్మిడి రామ్‌కుమార్ వీధి, గాంధీపురం, రాజమండ్రి. నం.3) శ్రీ. టి. విజయకుమార్, తండ్రి. పుల్లయ్య, డో.నం.78-7-19, తుమ్మిడి పుల్లయ్య భవన్, తుమ్మిడి రామ్‌కుమార్ వీధి, గాంధీపురం, రాజమండ్రి. నం.4) శ్రీ. టి. అరుణ్‌కుమార్, తండ్రి. పుల్లయ్య, డో.నం.78-7-19, తుమ్మిడి పుల్లయ్య భవన్, తుమ్మిడి రామ్ కుమార్ వీధి, గాంధీపురం, రాజమండ్రి. నం.5) శ్రీమతి. టి. ప్రసన్న మహాలక్ష్మి, భర్త. బుల్లి గోవిందరాజు, డో.నం.78-7-19, తుమ్మిడి పుల్లయ్య భవన్, తుమ్మిడి రామ్ కుమార్ వీధి, గాంధీపురం, రాజమండ్రి. నం.6) శ్రీమతి. టి. రమ్యారాణి, భర్త. శ్రీనివాస్, డో.నం.78-7-19, తుమ్మిడి పుల్లయ్య భవన్, తుమ్మిడి రాజ్‌కుమార్ వీధి, గాంధీపురం, రాజమండ్రి. నం.7) శ్రీ. టి. శ్రీనివాస్ పుల్లకుమార్, తండ్రి. రామ్ కుమార్, డో.నం.78-7-19, తుమ్మిడి పుల్లయ్య భవన్, తుమ్మిడి రామ్‌కుమార్ వీధి, గాంధీపురం, రాజమండ్రి. ఇక్కడ కూడా: శ్రీ. టి. శ్రీనివాస్ పుల్లకుమార్, తండ్రి. రామ్‌కుమార్, హౌ.నం.28-2-60, ప్రకాశరావు పేట జగదాంబ జంక్షన్ విశాఖపట్నం-530020. నం.8) శ్రీ. టి.శ్రీనివాస్, తండ్రి. పుల్లయ్య, ఫ్లాట్ నం.10, సెక్టార్ నం.1, రోడ్డు నం.7, లోటస్ ల్యాండ్, విజయవాడ-520002. నం.9) శ్రీమతి. తుమ్మిడి బాలనాగమణి, భర్త. రామ్‌కుమార్, బీసెంట్ రోడ్డు, డో.నం.27.16.2ఎ విజయవాడ, ఇక్కడ కూడా: శ్రీమతి. తుమ్మిడి బాలనాగమణి, భర్త. రామ్‌కుమార్, డో.నం.78-7-19, తుమ్మిడి పుల్లయ్య భవనం, తుమ్మిడి రామ్‌కుమార్ వీధి, గాంధీపురం, రాజమండ్రి. నం.10) శ్రీమతి. తుమ్మిడి రామలక్ష్మి, భర్త. విజయకుమార్, డో.నం.78-7-19, తుమ్మిడి పుల్లయ్య భవన్, తుమ్మిడి రామ్‌కుమార్ వీధి, గాంధీపురం, రాజమండ్రి. నం.11) మెసెర్స్. తుమ్మిడి బ్రదర్స్, డో.నం.27.16.2ఎ, బీసెంట్ రోడ్డు, గవర్నర్‌పేట, విజయవాడ-520002. నం.12) శ్రీ. టి. బుల్లి గోవింద రాజు, తండ్రి. పుల్లయ్య, డో.నం.78-7-19, తుమ్మిడి పుల్లయ్య భవన్, తుమ్మిడి రామ్‌కుమార్ వీధి, గాంధీపురం, రాజమండ్రి. నం.13) శ్రీమతి. టి.బాల సరస్వతి, భర్త. టి.అరుణ్‌కుమార్, డో.నం.78-7-19, తుమ్మిడి పుల్లయ్య భవన్, తుమ్మిడి రామ్‌కుమార్ వీధి, గాంధీపురం, రాజమండ్రి. నం.14) మెసెర్స్. తుమ్మిడి బ్రదర్స్ టెక్స్‌టైల్స్, డో.నం.28-4-8, జగదాంబ సెంటర్, విశాఖపట్నం-530001. నోట్: మా 105- విజయవాడ-గవర్నర్‌పేట బ్రాంచ్ కూడా 09.09.2014 నాటి ఆర్థిక సహాయాన్ని (ఓఎల్‌సిసి:105120000069143) నం.లు. 2,3,4,5,6,8,9,10,12 మరియు 13 భాగస్వాములుగా వ్యవహరిస్తున్నారు. నం.లు. 2,3,4,5,6,8,9,10,12 మరియు 13 సహ దరఖాస్తుదారులుగా నిలిచారు మరియు నం.7 హామీదారులుగా నిలిచారు మీలో నెం.11 ద్వారా అభ్యర్థించిన మొత్తం రూ. 2,50,00,000/- 13.5 శాతం ఆర్‌ఓఐ వద్ద అదే 06.06.2023 నాటికి రూ.2,66,31,589/- (రెండు కోట్ల అరవై ఆరు లక్షల ముప్పై ఒక వేల ఐదు వందల ఎనభై తొమ్మిది రూపాయలు మాత్రమే) దీని కోసం నం.1, 2, 3, 4, 7, 8, 9, 10, 11 మరియు 12 ఇక్కడ వివరించిన ఆస్తిపై సమానమైన తనఖాని పొడిగించింది.
2) మా 105- విజయవాడ-గవర్నర్‌పేట బ్రాంచ్ కూడా 01.09.2020 నాటి ఆర్థిక సహాయాన్ని (ఎఫ్‌ఐటిఎల్-ఎడిహెచ్‌ఓసి:501912090016350) నం.లు. 2,3,4,5,6 మరియు 7 భాగస్వాములుగా వ్యవహరిస్తున్నారు. నం.లు.2,3,4,5,6 మరియు 7 సహ దరఖాస్తుదారులుగా నిలిచారు మరియు నం.2 హామీదారులుగా నిలిచారు మీలో నెం.1 ద్వారా అభ్యర్థించిన మొత్తం రూ. 36,30,000/- 12 శాతం ఆర్‌ఓఐ వద్ద అదే 29.12.2020న ఎన్‌పిఏగా కూడా వర్గీకరించబడింది. అదే 06.06.2023 నాటికి రూ.52,19,546/- (యాభై రెండు లక్షల పంతొమ్మిది వేల ఐదు వందల నలభై ఆరు రూపాయలు మాత్రమే) ప్లస్ తదుపరి వడ్డీ మరియు పెనాల్ వడ్డీ 2.00శాతం తో 07.06.2023 నుండి రియలైజేషన్ తేది వరకు నెలవారి ఖర్చులు, ఛార్జీలు.
3) మా 105- విజయవాడ-గవర్నర్‌పేట బ్రాంచ్ కూడా 30.03.2017 నాటి ఆర్థిక సహాయాన్ని (ఓఎల్‌సిసి : 105120000131838) నం.లు. 7,8,9,10,12 మరియు 13 భాగస్వాములుగా వ్యవహరిస్తున్నారు. నం.లు.7,8,9,10,12 మరియు 13 సహ దరఖాస్తుదారులుగా నిలిచారు మరియు నం.1,2,3,4,5,6 మరియు 11 హామీదారులుగా నిలిచారు మీలో నెం.14 ద్వారా అభ్యర్థించిన మొత్తం రూ. 4,00,00,000/- 06.06.2023 నాటికి 11.5 శాతం ఆర్‌ఓఐ వద్ద ఉన్న బకాయి మొత్తం అదే రూ.5,20,55,239/- (ఐదు కోట్ల ఇరవై లక్షల యాభై ఐదు వేల రెండు వందల ముప్పై తొమ్మిది రూపాయలు మాత్రమే) దీని కోసం నం.1, 2, 3, 4, 7, 8, 9, 10, 11 మరియు 12 ఇక్కడ వివరించిన ఆస్తిపై సమానమైన తనఖాని పొడిగించింది.
4. మా 105- విజయవాడ-గవర్నర్‌పేట బ్రాంచ్ కూడా 27.12.2018 నాటి ఆర్థిక సహాయాన్ని (సియుబి ఓఎస్‌ఎల్ టెర్మ్ ఇఎమ్‌ఐ-బిఆర్-501812080046578) నం.లు. 7,8,9,10,12 మరియు 13 భాగస్వాములుగా వ్యవహరిస్తున్నారు. నం.లు.7,8,9,10,12 మరియు 13 సహ దరఖాస్తుదారులుగా నిలిచారు మరియు నం.1,2,3,4,5,6 మరియు 11 హామీదారులుగా నిలిచారు మీలో నెం.14 ద్వారా అభ్యర్థించిన మొత్తం రూ.2,00,00,000/- 06.06.2023 నాటికి 11.5 శాతం ఆర్‌ఓఐ వద్ద ఉన్న బకాయి మొత్తం అదే రూ.2,39,51,942/- (రెండు కోట్ల ముప్పై తొమ్మిది లక్షల యాభై ఒక వేల తొమ్మిది వందల నలభై రెండు రూపాయలు మాత్రమే) దీని కోసం నం.1, 2, 3, 4, 7, 8, 9, 10, 11 మరియు 12 ఇక్కడ వివరించిన ఆస్తిపై సమానమైన తనఖాని పొడిగించింది.
5) మా 105- విజయవాడ-గవర్నర్‌పేట బ్రాంచ్ కూడా 07.09.2020 నాటి ఆర్థిక సహాయాన్ని (ఎఫ్‌ఐటిఎల్-ఎడిహెచ్‌ఓసి:501912090017301) నం.లు. 7,8,9,10,12 మరియు 13 భాగస్వాములుగా వ్యవహరిస్తున్నారు. మీలో నెం.14 ద్వారా అభ్యర్థించిన మొత్తం రూ.24,92,000/- 06.06.2023 నాటికి 11.5 శాతం ఆర్‌ఓఐ వద్ద ఉన్న బకాయి మొత్తం అదే రూ.33,09,306/- (ముప్పై మూడు లక్షల తొమ్మిది వేల మూడు వందల ఆరు రూపాయలు మాత్రమే).

మా బ్యాంకుకు తనఖా పెట్టబడిన స్థిరాసి

షెడ్యూల్-ఎ (ఆస్తి యజమాని శ్రీ తుమ్మిడి రామ్‌కుమార్, శ్రీ. తుమ్మిడి విజయ్‌కుమార్, శ్రీ. తుమ్మిడి అరుణ్‌కుమార్, శ్రీ.తుమ్మిడి బుల్లి గోవిందరాజు, మరియు శ్రీ. తుమ్మిడి శ్రీనివాస్)
విజయవాడ, గవర్నర్‌పేట, పెద్దిబొట్లవారి వీధి, మున్సిపల్ వార్డు నం.23, రెవెన్యూ వార్డు నం.9, మూల్యాంకనం నం.20176, 20177, డో.నం.27-16-1,2,3 వద్ద ఉన్న అవిభక్త మరియు పేర్కొనబడని ఉమ్మడి వాటా 11.92 చ.గ.లు. సైట్ యొక్క 1,175.32 చ.గ.లు. హద్దులు: తూర్పు: పెద్దిబొట్లవారి వీధి/ మున్సిపల్ రోడ్డు, దక్షిణం: ముద్ద నారాయణ శర్మ మరియు ఇతరుల యొక్క ఆస్తి, పడమర: బీసెంట్ రోడ్డు/ మున్సిపల్ రోడ్డు, ఉత్తరం: తుమ్మలపల్లి అన్నపూర్ణ హాస్టల్ యొక్క ఆస్తి. షెడ్యూల్-బి: పైన వివరించిన అంశం నం.1, రామచంద్రా కాంప్లెక్స్ షాపింగ్ కాంప్లెక్స్ పేరు, గ్రౌండ్ ఫ్లోర్ లో షాప్ బేరింగ్ నం.9 ప్లింత్ ఏరియా 369 చ.అ.లు. హద్దులు: తూర్పు: మెట్లకేస్, దక్షిణం: 5 అ.లు. వెడల్పు పాసేజ్ మరియు ముద్ద నారాయణ శర్మ యొక్క ఆస్తి, పడమర: సిహెచ్. ఆనందరామ సుధాకర్ యొక్క షాప్ నం.8, ఉత్తరం: 8 అ.లు. వెడల్పు కామన్ కారిడార్ మరియు షాప్ నం.జిఎఫ్-15.

షెడ్యూల్-బి: (ఆస్తి యజమాని శ్రీ. తుమ్మిడి రామ్‌కుమార్, శ్రీ. తుమ్మిడి విజయ్‌కుమార్, శ్రీ. తుమ్మిడి అరుణ్‌కుమార్, శ్రీ.తుమ్మిడి బుల్లి గోవిందరాజు, మరియు శ్రీ. తుమ్మిడి శ్రీనివాస్)
విజయవాడ, గవర్నర్‌పేట, పెద్దిబొట్లవారి వీధి, మున్సిపల్ వార్డు నం.23, రెవెన్యూ వార్డు నం.9, మూల్యాంకనం నం.20176, 20177, డో.నం.27-16-1,2,3 వద్ద ఉన్న అవిభక్త మరియు పేర్కొనబడని ఉమ్మడి వాటా 144.58 చ.గ.లు. సైట్ యొక్క 1,175.32 చ.గ.లు. హద్దులు: తూర్పు: పెద్దిబొట్లవారి వీధి/ మున్సిపల్ రోడ్డు, దక్షిణం: ముద్ద నారాయణ శర్మ మరియు ఇతరుల యొక్క ఆస్తి, పడమర: బీసెంట్ రోడ్డు/ మున్సిపల్ రోడ్డు, ఉత్తరం: తుమ్మలపల్లి అన్నపూర్ణ హాస్టల్ యొక్క ఆస్తి. బి-షెడ్యూల్: పైన వివరించిన అంశం నం.1, రామచంద్రా కాంప్లెక్స్ షాపింగ్ కాంప్లెక్స్ పేరు, 1వ అంతస్తులో షాప్ బేరింగ్ నం.ఎఫ్‌ఎఫ్-1 ప్లింత్ ఏరియా 4,404 చ.అ.లు. హద్దులు: తూర్పు: సిహెచ్.ఆనంద రామ సుధాకర్ యొక్క షాప్ నం.ఎఫ్‌ఎఫ్-2, దక్షిణం: 5 అ.లు. వెడల్పు పాసేజ్ మరియు ముద్ద నారాయణ శర్మ యొక్క ఆస్తి మరియు ఓపెన్ టు స్కై, పడమర: బీసెంట్ రోడ్డు మరియు ఓపెన్ టు స్కై, ఉత్తరం: 7 అ.లు. వెడల్పు పాసేజ్ మరియు టి.అన్నపూర్ణమ్మ హాస్టల్ మరియు ఓపెన్ టు స్కై.

షెడ్యూల్-సి : (ఆస్తి యజమాని శ్రీ. తుమ్మిడి రామ్‌కుమార్, శ్రీ. తుమ్మిడి విజయ్‌కుమార్, శ్రీ. తుమ్మిడి అరుణ్‌కుమార్, శ్రీ.తుమ్మిడి బుల్లి గోవిందరాజు, మరియు శ్రీ. తుమ్మిడి శ్రీనివాస్)
విజయవాడ, గవర్నర్‌పేట, పెద్దిబొట్లవారి వీధి, మున్సిపల్ వార్డు నం.23, రెవెన్యూ వార్డు నం.9, మూల్యాంకనం నం.20176, 20177, డో.నం.27-16-1,2,3 వద్ద ఉన్న అవిభక్త మరియు పేర్కొనబడని ఉమ్మడి వాటా 79.62 చ.గ.లు. సైట్ యొక్క 1,175.32 చ.గ.లు. హద్దులు: తూర్పు : పెద్దిబొట్లవారి వీధి/ మున్సిపల్ రోడ్డు, దక్షిణం: ముద్ద నారాయణ శర్మ మరియు ఇతరుల యొక్క ఆస్తి, పడమర: బీసెంట్ రోడ్డు/ మున్సిపల్ రోడ్డు, ఉత్తరం: తుమ్మలపల్లి అన్నపూర్ణ హాస్టల్ యొక్క ఆస్తి. బి-షెడ్యూల్: పైన వివరించిన అంశం నం.1, రామచంద్రా కాంప్లెక్స్ షాపింగ్ కాంప్లెక్స్ పేరు, 1వ అంతస్తులో షాప్ బేరింగ్ నం.ఎఫ్‌ఎఫ్-2 ప్లింత్ ఏరియా 2,465 చ.అ.లు. హద్దులు: తూర్పు: పెద్దిబొట్లవారి వీధి (ఓపెన్ టు స్కై), దక్షిణం: 7 అ.లు. వెడల్పు పాసేజ్ మరియు ముద్ద నారాయణ శర్మ యొక్క ఆస్తి మరియు ఓపెన్ టు స్కై, పడమర: విక్రేతల వద్ద కొనుగోలు చేసిన సిహెచ్. నాగేంద్రకుమార్ యొక్క షాప్ నం.ఎఫ్‌ఎఫ్-1, ఉత్తరం: 10 అ.లు. వెడల్పు పాసేజ్ మరియు టి. అన్నపూర్ణ హాస్టల్ మరియు ఓపెన్ టు స్కై.

షెడ్యూల్ డి: (ఆస్తి యజమాని శ్రీ తుమ్మిడి రామ్‌కుమార్, శ్రీ. తుమ్మిడి విజయ్‌కుమార్, శ్రీ. తుమ్మిడి అరుణ్‌కుమార్, శ్రీ.తుమ్మిడి బుల్లి గోవిందరాజు, మరియు శ్రీ. తుమ్మిడి శ్రీనివాస్)
విజయవాడ, గవర్నర్‌పేట, పెద్దిబొట్లవారి వీధి, మున్సిపల్ వార్డు నం.23, రెవెన్యూ వార్డు నం.9, మూల్యాంకనం నం.20176, 20177, డో.నం.27-16-1,2,3 వద్ద ఉన్న అవిభక్త మరియు పేర్కొనబడని ఉమ్మడి వాటా 27.81 చ.గ.లు. సైట్ యొక్క 1,175.32 చ.గ.లు. హద్దులు: తూర్పు: పెద్దిబొట్లవారి వీధి/ మున్సిపల్ రోడ్డు, దక్షిణం: ముద్ద నారాయణ శర్మ మరియు ఇతరుల యొక్క ఆస్తి, పడమర: బీసెంట్ రోడ్డు/ మున్సిపల్ రోడ్డు, ఉత్తరం: తుమ్మలపల్లి అన్నపూర్ణ హాస్టల్ యొక్క ఆస్తి. షెడ్యూల్-బి: పైన వివరించిన అంశం నం.1, రామచంద్రా కాంప్లెక్స్ షాపింగ్ కాంప్లెక్స్ పేరు, గ్రౌండ్ ఫ్లోర్ లో షాప్ బేరింగ్ నం.10,11,12 మరియు 13 ప్లింత్ ఏరియా 861 చ.అ.లు. హద్దులు: తూర్పు: పెద్దిబొట్లవారి వీధి, దక్షిణం: 7 అ.లు. వెడల్పు పాసేజ్ మరియు ముద్ద నారాయణ శర్మ యొక్క ఆస్తి, పడమర: మెట్లకేస్, ఉత్తరం: 8 అ.లు. వెడల్పు కామన్ పాసేజ్.

షెడ్యూల్ ఇ : (ఆస్తి యజమాని శ్రీ. టి. శ్రీనివాస్)
విజయవాడ, గవర్నర్‌పేట, పెద్దిబొట్లవారి వీధి, మున్సిపల్ వార్డు నం.23, రెవెన్యూ వార్డు నం.9, మూల్యాంకనం నం.20176, 20177, డో.నం.27-16-1,2,3 వద్ద ఉన్న అవిభక్త మరియు పేర్కొనబడని ఉమ్మడి వాటా 28.87 చ.గ.లు. సైట్ యొక్క 1,175.32 చ.గ.లు. హద్దులు: తూర్పు: పెద్దిబొట్లవారి వీధి/ మున్సిపల్ రోడ్డు, దక్షిణం: ముద్ద నారాయణ శర్మ మరియు ఇతరుల యొక్క ఆస్తి, పడమర: బీసెంట్ రోడ్డు/ మున్సిపల్ రోడ్డు, ఉత్తరం: తుమ్మలపల్లి అన్నపూర్ణ హాస్టల్ యొక్క ఆస్తి. షెడ్యూల్-బి: పైన వివరించిన అంశం నం.1, రామచంద్రా కాంప్లెక్స్ షాపింగ్ కాంప్లెక్స్ పేరు, గ్రౌండ్ ఫ్లోర్ లో షాప్ బేరింగ్ నం.1,2, మరియు 3 ప్లింత్ ఏరియా 894 చ.అ.లు. హద్దులు: తూర్పు: పెద్దిబొట్లవారి వీధి, దక్షిణం: కామన్ పాసేజ్, పడమర: కామన్ కారిడార్, ఉత్తరం: సెల్లార్‌కి దారితీసే రాంప్.

షెడ్యూల్ -ఎఫ్ : (ఆస్తి యజమాని శ్రీ. టి.శ్రీనివాస్ పుల్లకుమార్)
విజయవాడ, గవర్నర్‌పేట, పెద్దిబొట్లవారి వీధి, మున్సిపల్ వార్డు నం.23, రెవెన్యూ వార్డు నం.9, మూల్యాంకనం నం.20176 డో.నం.27-16-1,2,3 వద్ద ఉన్న అవిభక్త మరియు పేర్కొనబడని ఉమ్మడి వాటా 23.80 చ.గ.లు. సైట్ యొక్క 1,175.32 చ.గ.లు. హద్దులు: తూర్పు: పెద్దిబొట్లవారి వీధి/మున్సిపల్ రోడ్డు, దక్షిణం: ముద్ద నారాయణ శర్మ మరియు ఇతరుల యొక్క ఆస్తి, పడమర: బీసెంట్ రోడ్డు/మున్సిపల్ రోడ్డు, ఉత్తరం: తుమ్మలపల్లి అన్నపూర్ణ హాస్టల్ యొక్క ఆస్తి. షెడ్యూల్-బి: పైన వివరించిన అంశం నం.1, రామచంద్రా కాంప్లెక్స్ షాపింగ్ కాంప్లెక్స్ పేరు, గ్రౌండ్ ఫ్లోర్ లో షాప్ బేరింగ్ నం.4 ప్లింత్ ఏరియా 737 చ.అ.లు. హద్దులు: తూర్పు: కారిడార్, దక్షిణం: గ్రౌండ్ ఫ్లోర్ లో షాప్ నం.15, పడమర: గ్రౌండ్ ఫ్లోర్‌లో షాప్ నం.5, ఉత్తరం: ఉమ్మడి పాసేజ్.

రిజర్వు ధర: రూ. 3,75,00,000/- (మూడు కోట్ల డెభై ఐదు లక్షల రూపాయలు మాత్రమే)
(షెడ్యూల్ ఎ,బి,సి,డి మరియు ఎఫ్ కొరకు)

రీ-వేలం వివరాలు	
రీ-టెండర్-కమ్-వేలం యొక్క విక్రయ తేది:	వేదిక
28-06-2023	సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, విజయవాడ-గవర్నర్‌పేట శాఖ, డో.నం.29-36-18, మల్లాదివారి వీధి, మ్యూజియం రోడ్డు, గవర్నర్‌పేట, విజయవాడ, కృష్ణ-520002. Telephone No:0866-2432436 Cell No:9346204818.

రీ-టెండర్-కమ్-వేలం సేల్ యొక్క నిబంధనలు మరియు షరతులు:
1) వేలం కోసం ఉద్దేశించిన బిడ్డర్లు వ్యక్తిగతంగా హాజరు కావాలి మరియు వ్యక్తిగతంగా పాల్గొనాలి మరియు అతను/ ఆమె తనకోసం వేలం వేస్తున్నట్లు లిఖిత పూర్వకంగా డిక్లరేషన్ ఇవ్వాలి. 2) ఉద్దేశించిన బిడ్డర్లు మేనేజర్, సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, విజయవాడ గవర్నర్‌పేట బ్రాంచ్, డోర్ నెం.29-36-18, మల్లాది వారి వీధి, మ్యూజియం రోడ్, గవర్నర్‌పేట్, విజయవాడ, కృష్ణ - 520002 నుండి టెండర్ ఫారమ్‌లను పొందవచ్చు. 3) "సిటీ యూనియన్ బ్యాంక్" అనుకూలంగా డ్రా చేయబడిన రిజర్వ్ ధరలో 10శాతం ఇఎమ్‌డి కోసం పే ఆర్డర్/డిమాండ్ డ్రాఫ్ట్‌తో పొందేందుకు, ఆథరైజ్డ్ ఆఫీసర్, సిటీ యూనియన్ బ్యాంక్‌కి సంబోధించబడి సీల్డ్ ఎన్వలప్‌లలో సూచించిన టెండర్ ఫారమ్‌లో మాత్రమే బిడ్‌లను సమర్పించాలనుకునేవారు తమ బిడ్‌లను సమర్పించాలి. టెండర్-కమ్-వేలం విక్రయ తేదీలో మధ్యాహ్నం 12.00గం.లకు లేదా అంతకంటే ముందు తెలియజేయబడింది. 4) వివరాల తనిఖీ కోసం, ఉద్దేశించిన కొనుగోలుదారు టెలిఫోన్ నెం.: 0866-2432436, సెల్ నెం. : 9346204818 సంప్రదించవచ్చు. 5) ఆస్తి/లు "ఉన్న-ఎక్కడ-ఉన్నవో", "ఏమిటి- ఉన్నవో" మరియు "ఏదైనా- ఉంటే" ప్రాతిపదికన విక్రయించబడతాయి. 6) సీల్డ్ టెండర్లు టెండర్-కమ్-వేలం అమ్మకం తేదీన మధ్యాహ్నం 01.00గం.లకు ఉద్దేశించిన బిడ్డర్ల సమక్షంలో తెరవబడతాయి. సాధారణంగా అమ్మకం క్లోజ్డ్ టెండర్ల ద్వారా జరిగినప్పటికీ, ఆథరైజ్డ్ అధికారి తన స్వంత అభీష్టానుసారం, క్లోజ్డ్ టెండర్ ప్రక్రియలో అందుకున్న దానికంటే ఎక్కువ బిడ్‌ని కోట్ చేయాలనుకునే ఆసక్తిగల బిడ్డర్‌ల మధ్య బహిరంగ వేలం నిర్వహించవచ్చు. అటువంటి సంఘటన అత్యధిక బిడ్ చేసిన వ్యక్తి విక్రయం ఇవ్వబడుతుంది. సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్ పరిమితి యొక్క నిర్ధారణకు లోబడి ఉంటుంది. 7) విజయవంతమైన బిడ్డర్ అమ్మకం పూర్తయిన వెంటనే అమ్మకపు మొత్తంలో 25శాతం (చెల్లించిన ఇఎమ్‌డితో సహా) చెల్లించాలి మరియు అమ్మకం ధృవీకరించబడిన తేదీ నుండి 15 రోజులలోపు 75శాతం బ్యాలెన్స్ మొత్తం, విఫలమైన అధీకృత అధికారి ఇక్కడ నిర్దేశించిన సమయ పరిమితులలోపు మొత్తం అమ్మకపు పరిశీలనను స్వీకరించిన తర్వాత విజయవంతమైన కొనుగోలుదారు. 8) నిర్దేశించిన సమయ పరిమితిలోపు మొత్తం విక్రయ పరిశీలనను స్వీకరించిన తర్వాత మాత్రమే విజయవంతమైన కొనుగోలుదారుకు అనుకూలంగా అధీకృత అధికారి ద్వారా విక్రయ ధృవీకరణ పత్రం జారీ చేయబడుతుంది. 9) విజయవంతమైన కొనుగోలుదారు, చట్ట ప్రకారం వర్తించే విధంగా స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు వంటి రవాణ కోసం చెల్లించాల్సిన ఛార్జీలు/ ఫీజులను భరించాలి. 10) విజయవంతమైన బిడ్డర్ చట్టపరమైన బకాయిలు (చట్టబద్దమైన ఇంటి పన్ను, విద్యుత్ ఛార్జీలు మరియు ఇతర బకాయిలు), టిడిఎస్, జిఎస్‌టి ఏదైనా ఉంటే, ప్రభుత్వ, ప్రభుత్వ బాధ్యతలు మరియు స్థానిక సంస్థలకు చెల్లించాలి. 11) ఆథరైజ్డ్ అధికారికి బిడ్‌లను అంగీకరించడానికి లేదా తిరస్కరించడానికి లేదా ఎటువంటి కారణం చూపకుండా అమ్మకాన్ని వాయిదా వేయడానికి లేదా రద్దు చేయడానికి అన్ని అధికారాలు ఉంటాయి.

ప్రదేశం: కుంబకోణం, తేది: 09.06.2023 — ఆధీకృత అధికారి.

రిజిస్టర్డు ఆఫీసు: 149, టి.ఎస్.ఆర్ (పెద్ద)వీధి, కుంబకోణం, తంజావూర్ జిల్లా, తమిళనాడు-612 001,
CIN - L65110TN1904PLC001287,
Telephone No. 0435-2402322, Fax : 0435-2431746, Website : www.cityunionbank.com

మీకోసం

టమాటాలు ఎక్కువ రోజులు తాజాగా ఉండాలంటే, ఒకదానికొకటి తగలకుండా నిల్వ చేసుకోవాలి.

జీవన సౌరభం

ప్రతి అవకాశంలోనూ కొన్ని అడ్డంకులు, ప్రతి అడ్డంకి వెనుకా కొన్ని అవకాశాలు ఉంటాయి.

దేశపౌరులు

తెల్లని మల్లెల మాలలు మీరే
జాబిలి వెన్నెల చలువలు మీరే!
చదువులు బాగా చదవండీ!
ప్రథమ స్థానం పొందండీ!

కలువల కన్నుల కాంతులు మీరే!
తీయని మాటల మూటలు మీరే!
అల్లరి చేయక మెలగండీ!
బుద్ధిగ మసలుతూ ఉండండీ!

మింటిలో వెలిగే తారలు మీరే!
అమ్మకు నాన్నకు ఆశలు మీరే!
ఆటలు అన్నీ ఆడండీ!
ఆరోగ్యంగా ఉండండి!

బుడిబుడి నడకల బుడతలు మీరే!
జగతిన విరిసిన పూవులు మీరే!
ఆనందగా ఉండండీ!
ఆహ్లాదాన్ని పొందండీ!

మెత్తని మల్లెల మనసులు మీరే!
సుందర వనముల తావులు మీరే!
మంచి పౌరులుగా మెలగండీ!
దేశకీర్తినీ పెంచండీ!

– రావిపల్లి వాసుదేవరావు,
94417 13136



దారి చూపండి

చిన్నారులూ, ఫైర్ ఇంజన్ వెళ్లి మంటలను ఆర్పాలి. మరి ఏ దారిలో వెళుతుంతో చూపరూ!

నేను గీసిన బొమ్మ

జాస్తి హిరణ్మయి
9వ తరగతి,
ఆంబిటస్ స్కూలు, విజయవాడ,
ఎన్టీఆర్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

అతిగా దండించవొద్దు..!

తల్లిదండ్రులు తమ పిల్లలకు క్రమశిక్షణ నేర్పించాలని వారితో కఠినంగా వ్యవహరిస్తూ ఉంటారు. దాంతో పిల్లల్లో మొండితనం ఎక్కువ అవుతుందని నిపుణులు అంటున్నారు. అలా చేయడం సరైన పద్ధతి కాదని తెలియజేస్తున్నారు. ఎంత చెప్పినా అల్లరి మానరు, క్రమశిక్షణ పాటించరు అంటూ వారిని నిత్యం తిట్టకూడదు. నేర్పుగా చెప్పి మార్చుకోవాల్సిందే అంటున్నారు.

- కొంతమంది పిల్లలు హైపర్ యాక్టివ్‌గా ఉండి, అల్లరి బాగా చేస్తారు. వారిని తట్టుకోవడం తల్లిదండ్రులకు కాస్త కష్టంగానే ఉంటుంది. అప్పుడు పిల్లల్ని శారీరకంగా దండిస్తేనే మాట వింటారని అనుకుంటారు చాలామంది. కానీ వారిని అలా దండించటం వల్ల పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయి. ప్రత్యేకంగా చిన్న పిల్లల్లో ఎన్నో మానసిక సమస్యలు వస్తాయి. వారి మానసిక ఎదుగుదల పైనే కాక వారి ఆహారపు అలవాట్లు కూడా ప్రభావితమవుతాయి.
- పిల్లల్ని శారీరకంగా దండించినప్పుడు వారిలో కోపం, అసహనం, నిరాశ లాంటి మానసిక భావోద్వేగాలు కలగాపులగంగా మారతాయి. దాంతో మొండితనం ఎక్కువ అవుతుంది. చిన్నదానికి కూడా పేచీలు పెడతారు.
- పిల్లల్ని కొట్టినప్పుడు వారు చేసిన తప్పే మళ్లీ చేసి పెద్దవాళ్లకు మరింత కోపం తెచ్చే ప్రయత్నం చేస్తారు. ఇది వారిలో ఒకరకమైన అసహనం. ఎదురు తిరిగే మనస్తత్వం ఏర్పడుతుంది.
- కొట్టినప్పుడు కొంతమంది పిల్లలు శారీరకంగా, మానసికంగా కుంగిపోతారు. అది వారిలో అతి భయానికి దారి తీస్తుంది. దండించిన వ్యక్తులకు దూరంగా ఉండేందుకు చూస్తారు. ఇది వారి ఆలోచనా ధోరణిపై, పని తీరుపై తీవ్ర ప్రభా వం చూపిస్తోందని వైద్యులు అంటున్నారు.
- శారీరక పరమైన శిక్ష వల్ల పిల్లలు తమ పట్ల తామే నమ్మకం కోల్పోతారు. తాము ఏ పని సక్రమంగా చేయలేము, ఎందుకూ పనికి రానివారం అనే భావనలోకి వెళ్ళిపోతారు. అందుకే కొట్టకుండా ఏ విషయాన్నైనా సున్నితంగా చెప్పే ప్రయత్నం చేస్తుండాలి.
- మరి పిల్లల్ని కొట్టకుండా ఎలా పెంచుతాము అనే వాదన చేస్తుంటారు చాలామంది. చిన్న పిల్లలకి తప్పు ఒప్పు ఎలా తెలుస్తాయి? పెద్దలు, తల్లితండ్రులు, ఉపాధ్యాయులు, వీరి అందరి మార్గ దర్శకత్వమే కదా, వారి ప్రవర్తనకి దిశా నిర్దేశం చేయాలి.

సానుకూలంగా : పిల్లలు మంచి మార్గంలో నడవాలనే తమ తల్లి తండ్రులు తపన పడతారు. అలాంటప్పుడు వారితో ప్రేమతో మాట్లాడాలి. అల్లరి చేస్తున్నప్పుడు నిదానంగా, ఓర్పుగా చెప్పాలి. అప్పుడు వారి ప్రవర్తనలో కొంత మార్పు వస్తుంది. అంతేగానీ ఒక్కసారిగా అల్లరి తగ్గించరు. అసలు పిల్లలు అల్లరి చేస్తారు, చేయాలి అన్న ఆలోచన పెద్దల్లో ఉండాలి. పిల్లలకు ఎలా మాట్లాడాలో నేర్పించాలి. అమ్మానాన్నల మాట తీరు కూడా పిల్లల ముందు జాగ్రత్తగా ఉండాలి.

- పిల్లలు చేసే చిన్న చిన్న పనులను మెచ్చుకుంటే వారికి ప్రోత్సాహకంగా ఉంటుంది. దాంతో నిదానంగా మొండితనం తగ్గిస్తారు. అప్పుడప్పుడు చిన్న చిన్న కానుకలు ఇవ్వటం ద్వారా వారు చేసిన మంచి పనులు ఏంటి? తప్పులు ఏంటి? గ్రహించగలుగుతారు. దాంతో ఏది చేయకూడదో తెలుసుకుంటారు.
- ఇప్పటి ఉరుకుల పరుగుల జీవితంలో పిల్లల్ని మంచి స్కూల్లో చదివించాలని ఆలోచన చేస్తున్నారు ఎక్కువమంది. కానీ వారితో సమయం కూడా కేటాయించాలి. పిల్లలతో మంచి చెడులు మాట్లాడటం, వారితో చిన్న చిన్న పనులు చేయించటం వల్ల వారు మీకు మానసికంగా దగ్గర అయ్యి వారి మనసులోని భావాలను పంచుకుంటారు.
- పిల్లల్లో శారీరకంగా, మానసికంగా ఉల్లాసంగా ఉండాలంటే మంచి ఆహారం చాలా ముఖ్యం. పోషకాలతో కూడిన ఆహారం ఇస్తూ ఉండాలి. సరైన వ్యాయామాలతో పాటు విహారయాత్రల కు తీసుకెళ్లాలి. కొత్త ప్రదేశాలను చూసినప్పుడు వారిలోఉత్సాహం రెట్టింపవుతుంది. పెద్దల పట్ల సానుకూల ఆలోచనలు పెరుగుతాయి.

ఏసీల వాడకం ఇలా ...

బయట ఎండ ఎక్కువగా ఉందని చాలామంది ఏసీలో టెంపరేచర్‌ను బాగా తగ్గించేస్తుంటారు. రూమ్ చల్లగా ఉండాలని కనిష్ట ఉష్ణోగ్రతను 17, 18 డిగ్రీల వరకు తగ్గిస్తారు. కానీ. అది సరి కాదు అంటున్నారు నిపుణులు. ఏసీల పని సామర్థ్యం బాగుండాలంటే– 24 నుంచి 27 డిగ్రీల ఉష్ణోగ్రతల మధ్యనే ఉపయోగించాలని, అప్పుడే మన్నిక పెరుగుతుందని చెబుతున్నారు.

ఏసీలు కొనేటప్పుడు దాని రివ్యూ ఎలా ఉంది? మంచి కంపెనీయేనా? కాదా? అని చూస్తుంటారు. కానీ అది తమ గదికి సరిపోతుందా లేదా అనేది చాలామంది పట్టించుకోరు. కానీ ఏసీలు కొనుగోలు చేసేటప్పుడు గది విస్తీర్ణానికి తగినట్లుగా ఎంపిక చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

120 నుంచి 140 అడుగుల విస్తీర్ణం ఉండే గదికి ఒక టన్ను కెపాసిటీ ఉన్న ఏసీ సరిపోతుంది. అంతకంటే తక్కువ కెపాసిటీ ఉన్న ఏసీలు కొని తెచ్చుకుంటే.. గదిని చల్లబరిచేందుకు చాలా సమయం తీసుకుంటుంది. దీనివల్ల ఏసీపై ఒత్తిడి పెరుగుతుంది. పైగా విద్యుత్‌ను కూడా ఎక్కువగా వినియోగించుకుంటుంది. ఇలా ఏసీలపై దీర్ఘకాలికంగా ఒత్తిడి పడితే తొందరగా పాడైపోయే అవకాశం ఉంటుంది.ఏసీ అవుట్ డోర్ యూనిట్‌లో కండెన్సర్ కాయిల్, ఫ్యాన్ ఉంటాయి. ఈ ఫ్యాన్ బయట గాలిని సంగ్రహించి కండెన్సర్ కాయిల్‌లోకి పంపిస్తుంది. అప్పుడు గదిలోకి చల్లటి గాలి వస్తుంది. అదే ఏసీ అవుట్ డోర్ యూనిట్‌పై ఎండ ఎక్కువగా పడితే బయట గాలిని చల్లగా మార్చే ప్రక్రియలో కండెన్సర్ కాయిల్‌పై ప్రభావం పడుతుంది. ఏసీ సామర్థ్యం తగ్గిపోతుంది సామర్థ్యం తగ్గకూడదంటే ఏసీ అవుట్ డోర్ యూనిట్‌ను వీలైనంత వరకు ఎండపడని చోటే ఉంచుకోవాలి. ఇక కొంతమంది అవుట్ డోర్ యూనిట్‌పై ఎండ పడకూడదనిబట్టతో కడుతుంటారు. ఫ్యాన్ తిరుగుతున్న సమయంలో ఆ బట్ట లోపలికి వెళ్లే ప్రమాదం ఉంది.

ఏసీలను సర్వీస్ చేయించడం చాలా అవసరం. పట్టించుకోకుండా వదిలేస్తే ఫిల్టర్లు, డక్ట్స్‌లో దుమ్ము, ధూళి పేరుకుపోతాయి. కాబట్టి ఎప్పటికప్పుడూ దాన్ని తొలగించాలి. ఏడాదికి ఒక్కసారైనా ఏసీని సర్వీసింగ్ చేయించడం మంచిది.

ఏసీ ఉన్న గదిలోని చల్లటి గాలి బయటికి పోకుండా ఉండేందుకు తలుపులు, కిటికీలు ఎల్లప్పుడూ మూసి ఉంచాలి. అద్దాల కిటికీలు ఉంటే ఎండ గదిలోకి రాకుండా దళసరి కర్టెన్లను వేయాలి. ఫ్రిజ్, టీవీ, కంప్యూటర్లు చాలా వేడిని ఉత్పత్తి చేస్తాయి. అవి ఏసీ గదుల్లో ఉంటే రూం చల్లబడటానికి చాలా సమయం తీసుకుంటుంది.

ఏసీ నడుస్తున్న సమయంలో ఫ్యాన్ వేయడం వల్ల చల్లటి గాలి తొందరగా గది నలువైపులా వ్యాపిస్తుంది. రూం తొందరగా చల్లబడుతుంది. దీనివల్ల కరెంట్ ఆదా అవుతుంది.

వెండితెర వివాహాలు

ప్రేమలు.. పెళ్లిళ్లు.. సినీ పరిశ్రమలో కొత్త కాదు. కలిసిన మొదటి క్షణం నుండే ప్రేమ మొదలై ఏళ్లకు ఏళ్లు ప్రేమించుకుని పెద్దల అంగీకారంతో ఒక్కటైన జంటలు ఎన్నో ఉన్నాయి. ఇటీవల ప్రేమబంధంతో దగ్గరై, వరుణ్‌తేజ్, లావణ్య త్రిపాఠి వివాహ నిశ్చితార్థం చేసుకోవడం అభిమానులను తెగ ఖుషీ చేసింది. ఏడేళ్ల క్రితం 'మిస్టర్' షూటింగ్‌లో లావణ్యతో ప్రేమలో పడిన వరుణ్ ఇన్నేళ్లకు తమ ప్రేమను పెళ్లిబంధంతో ఒక్కటి చేసే వరకు ఈ వ్యవహారాన్ని చాలా రహస్యంగా ఉంచారు. కొద్దిమంది పెద్దల సమక్షంలో చాలా నిరాడంబరంగా వీరి నిశ్చితార్థం జరిగింది.

ఎన్నో ప్రేమ పెళ్లిళ్లు

వెండితెరపై జంటలుగా నటించిన నటీనటులు తెర వెనుక కూడా వివాహంతో తమ బంధాన్ని కొనసాగించడం దక్షిణాది ఇండస్ట్రీలో చాలాకాలంగా చూస్తున్నాం. తమిళనాట జెమినీ గణేశన్, సావిత్రి ముందు వరుసలో ఉంటే ఆ తరువాత కమల్, సారిక.., శరత్‌బాబు, రాధిక.., సూర్య, జ్యోతిక.., అజిత్, షాలినీ.., స్నేహ, ప్రసన్న.., సీత, పార్థీపన్.., నిరోష, రాంకీ.. ఇలా చెప్పుకుంటూ పోతే ఈ జాబితా పెద్దదే. కన్నడనాట కెజిఎఫ్ హీరో యశ్, రాధిక పండిత్ కూడా వెండితెరపై జంటగా కనిపించినవారే. ఆ తరువాత పెళ్లి బంధంతో ఒక్కటయ్యారు. ఈ జంటల్లో చాలామంది తమ బంధాన్ని పటిష్టంగా కొనసాగిస్తున్నారు. అతి కొద్ది మంది మాత్రమే విభేదాలతో విడిపోయారు.



మహేష్‌బాబు-నమ్రత

'వంశీ' (2000) చిత్రంలో కలిసి నటించిన మహేష్, నమ్రత జంట 2005లో పెళ్లి పీటలెక్కారు. మహేష్ తండ్రి కృష్ణ కూడా ఆనాటి నటి విజయ నిర్మలను ప్రేమ వివాహమే చేసుకున్నారు. 'బద్రీ' (2000) సినిమాలో వెండితెరపై హీరోహీరోయిన్లుగా కనిపించి మెప్పించిన పవన్ కళ్యాణ్, రేణుదేశాయ్ జంట కొన్నాళ్లు కలిసున్న తరువాత, 2009లో పెళ్లి బంధంతో ఒక్కటయ్యారు. ఇద్దరు బిడ్డలు పుట్టాక విడిపోయారు.



ఆది - నిక్కి

హీరోగా, విలన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్న ఆది 2017లో నిక్కితో కలిసి 'మరకత మణి' సినిమా చేశారు. ఆ సమయంలోనే వీరి మధ్య ప్రేమ చిగురించిందని చెబుతారు. ఐదేళ్ల తరువాత 2022లో పెళ్లి పీటలెక్కారు. 'హ్యాపీ డేస్' చిత్రంతో ఇండస్ట్రీకి పరిచయమైన వరుణ్ సందేశ్, మరో నటి వితికను ప్రేమించి పెళ్లి చేసుకున్నారు.



సీనియర్ల జాబితా పెద్దదే..

ఈ ప్రేమ పెళ్లిళ్ల జాబితాలో తెలుగు సీనియర్ నటీనటులు కూడా చాలా మందే ఉన్నారు. శ్రీకాంత్, ఊహ.., సుమంత్, కీర్తిరెడ్డి.., నాగార్జున, అమల.., రాజశేఖర్, జీవిత.. తెరపై హీరోహీరోయిన్లుగా నటించి రియల్ లైఫ్‌లో కూడా జంటలుగా వివాహబంధంతో ఒక్కటయ్యారు. దర్శక, నిర్మాతలు హీరోయిన్లతో ప్రేమాయణం నడిపి పెళ్లి పీటల వరకు చేరుకోవడం కూడా చూశాం.

నాగచైతన్య - సమంత

టాలీవుడ్‌లో దీనికి ముందు ఎక్కువ ఆసక్తి కలిగించిన ప్రేమ జంట నాగచైతన్య, సమంతది. 'ఏ మాయ చేశావే' సినిమాలో కలిసి నటించిన ఈ జంట మధ్య అప్పటి నుండే ప్రేమ వ్యవహారం నడిచింది. 2009 నుండి 2017 వరకు ప్రేమలో మునిగిన ఈ జంట 8 ఏళ్ల తరువాత వివాహబంధంతో ఒక్కటయ్యారు. కానీ నాలుగేళ్లకే 2021లో విడాకులు తీసుకున్నారు.



ఐసిసి గద కంగారూలకే

- ప్రపంచ టెస్టు చాంపియన్స్‌గా ఆస్ట్రేలియా
- 444 ఛేదనలో భారత్ 234/10
- రెండోసారి భారత్‌కు భంగపాటు

1. ఐసీసీ టెస్టు చాంపియన్‌షిప్ గదతో ఆసీస్ క్రికెటర్ల విజయోత్సాహం

కెన్నింగ్టన్ : ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్ ఆస్ట్రేలియా. ది ఓవల్‌లో జరిగిన ప్రపంచ టెస్టు మహా సంగ్రామంలో భారత్‌పై 209 పరుగుల తేడాతో గెలుపొందిన ఆస్ట్రేలియా.. 2023 ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ గదను సొంతం చేసుకుంది. 444 పరుగుల ఛేదనలో భారత్ 234 పరుగులకే కుప్పకూలింది. విరాట్ కోహ్లి (49, 78 బంతుల్లో 7 ఫోర్లు), అజింక్య రహానె (46, 108 బంతుల్లో 7 ఫోర్లు)లు చివరి రోజు భారత్ ఆశలను సజీవంగా నిలిపినా.. ఆట మొదలైన కొద్దిసేపటికే ఆశలూ ఆవిరయ్యాయి!. 63.3 ఓవర్లలోనే భారత్ 234 పరుగులకు చేతులెత్తేసింది. కంగారూ స్పిన్నర్ నాథన లయాన్ (4/41) మాయజాలానికి తోడు పేసర్లు స్కాట్ బొలాండ్ (3/46), మిచెల్ స్టార్క్ (2/77) రాణించారు. తొలి ఇన్నింగ్స్‌లో విధ్వంసక శతకం సాధించిన ట్రావిశ్ హెడ్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు. ఆస్ట్రేలియా కెప్టెన్ పాట్ కమిన్స్ ఐసీసీ టెస్టు చాంపియన్‌షిప్ గదతో పాటు రూ.13 కోట్ల నగదు బహుమతి అందుకున్నాడు. రన్నరప్‌గా నిలిచిన భారత జట్టు సిల్వర్ మెడల్స్‌తో పాటు రూ.6.6 కోట్ల ప్రైజ్‌మనీ దక్కించుకుంది.

లంచ్‌లోపే ఆలౌట్ : ఓవర్‌నైట్ స్కోరు 164/3తో ఐదో రోజు బ్యాటింగ్‌కు వచ్చిన భారత్ మరో 280 పరుగులు చేయాల్సి స్థితిలో నిలిచింది. క్రీజులో విరాట్ కోహ్లి, అజింక్య రహానెలు అజేయంగా ఆడుతున్నారు. చేతిలో ఏడు వికెట్లు ఉండటంతో చివరి రోజు మనోళ్లు గెలుపు కోసం అమీతుమీ తేల్చుకుంటారనే అంచనాలు కనిపించాయి. కానీ ఉదయం సెషన్ ఆరంభంలోనే ఆశలు ఆవిరయ్యాయి. లంచ్ విరామానికి ముందే టీమ్ ఇండియా చేతులెత్తేసింది. 23.3 ఓవర్లలోనే చివరి ఏడు వికెట్లు చేజార్చుకుంది. వ్యక్తిగత స్కోరుకు మరో ఐదు పరుగులు జోడించిన విరాట్ కోహ్లి తీవ్రంగా నిరాశపరిచాడు. ఆసీస్ పేసర్ స్కాట్ బొలాండ్ ఒకే ఓవర్లో రెండు వికెట్లు పడగొట్టి భారత్‌ను ఓటమి కూరల్లోకి నెట్టాడు. బొలాండ్ ఓవర్లో ఆఫ్‌సైడ్ బంతిని వెంటాడిన విరాట్ కోహ్లి.. స్లిప్స్‌లో క్యాచ్ ఇచ్చాడు. కోహ్లి వికెట్‌తో భారత్ మానసికంగా ఓటమిని అంగీకరించగా.. ఆస్ట్రేలియా శిబిరంలో ఉత్సాహం రెట్టింపు అయ్యింది. రవీంద్ర జడేజా (0) ఎదుర్కొన్న రెండో బంతికే వికెట్ల వెనకాల దొరికిపోయాడు. ఒకే ఓవర్లో విరాట్ కోహ్లి, రవీంద్ర జడేజా వికెట్లతో భారత్ పనైపోయింది.

అజింక్య రహానె (46) సైతం ఎంతోసేపు వికెట్ కాపాడుకోలేదు. శార్దుల్ ఠాకూర్ (0) డకౌట్‌గా నిష్క్రమించగా.. ఉమేశ్ యాదవ్ (1), మహ్మద్ సిరాజ్ (1) ఆసీస్‌ను పెద్దగా కష్టపెట్టలేదు. లంచ్ విరామం లోపే చివరి ఏడు వికెట్లు కోల్పోయిన భారత్ 209 పరుగుల తేడాతో ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో పరాజయం పాలైంది.

స్కోరు వివరాలు :

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ : 469/10
భారత్ తొలి ఇన్నింగ్స్ : 296/10
ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్ : 270/8 డిక్లేర్డ్
భారత్ రెండో ఇన్నింగ్స్ : రోహిత్ (ఎల్బీ) లయాన్ 43, గిల్ (సి) గ్రీన్ (బి) బొలాండ్ 18, పుజార (సి) అలెక్స్ (బి) కమిన్స్ 27, కోహ్లి (సి) స్మిత్ (బి) బొలాండ్ 49, రహానె (సి) అలెక్స్ (బి) స్టార్క్ 46, జడేజా (సి) అలెక్స్ (బి) బొలాండ్ 0, భరత్ (సి,బి) లయాన్ 23, శార్దుల్ (ఎల్బీ) లయాన్ 0, ఉమేశ్ (సి) అలెక్స్ (బి) స్టార్క్ 1, షమి నాటౌట్ 13, సిరాజ్ (సి) బొలాండ్ (బి) లయాన్ 1, ఎక్స్‌ట్రాలు : 13, మొత్తం : (63.3 ఓవర్లలో ఆలౌట్) 234.
వికెట్ల పతనం : 1–41, 2–92, 3–93, 4–179, 5–179, 6–212, 7–213, 8–220, 9–224, 10–234.
బౌలింగ్ : పాట్ కమిన్స్ 13–1–55–1, స్కాట్ బొలాండ్ 16–2–46–3, మిచెల్ స్టార్క్ 14–1–77–2, కామెరూన్ గ్రీన్ 5–0–13–0, నాథన్ లయాన్ 15.3–2–41–4.

రన్నరప్ మెడల్‌తో నిష్క్రమిస్తూ కోహ్లి..!

అక్కడే చేజారింది!

వరుసగా రెండో ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్. రెండేండ్ల క్రితం ఇదే పరిస్థితుల్లో గద వేటలో భంగపాటు నుంచి భారత్ పాఠాలు నేర్చుకోలేదు. 2021లో న్యూజిలాండ్‌తో ఫైనల్లో, 2023లో ఆస్ట్రేలియాతో తుది పోరులో టీమ్ ఇండియాను విజయానికి దూరం చేసింది బ్యాటర్లే!. కివీస్‌పై తొలి ఇన్నింగ్స్‌లో 217 పరుగులే చేసిన భారత్.. రెండో ఇన్నింగ్స్‌లో 170 పరుగులకే కుప్పకూలింది. ఇప్పుడూ తొలి ఇన్నింగ్స్‌లో 296 పరుగులు చేసి, రెండో ఇన్నింగ్స్‌లో 234 పరుగులకు చేతులెత్తేసింది. తాజా టైటిల్ పోరులో బౌలర్ల వైఫల్యం సైతం కాస్త కనిపించినా.. ఓవరాల్‌గా రెండు ఐసీసీ టెస్టు ఫైనల్స్‌లో బ్యాటింగ్ విభాగం దారుణంగా విఫలమైంది. ది ఓవల్‌లో టాస్ భారత్ వశం. ప్రణాళిక ప్రకారం తొలుత ఆసీస్ బ్యాటింగ్. బౌలర్లు రాణించగా 24.1 ఓవర్లలోనే 76/3తో కంగారూ శిబిరంలో ఒత్తిడి. ఇక్కడి వరకు బాగానే నడిచినా.. ఇక్కడ్నుంచే ఐసీసీ టెస్టు గద భారత్‌కు దూరమవుతూ వచ్చింది. ట్రావిశ్ హెడ్ (163), స్టీవ్ స్మిత్ (121) నాల్గో వికెట్‌కు 285 పరుగుల భారీ భాగస్వామ్యం నమోదు చేసి.. రోహిత్‌సేనను మానసికంగా వెనక్కి నెట్టారు. రిషబ్ పంత్ ప్రత్యర్థి జట్లకు ఇచ్చే ఝలక్ ది ఓవల్‌లో ట్రావిశ్ హెడ్ భారత్‌కు రుచి చూపించాడు. హెడ్, స్మిత్ భాగస్వామ్యాన్ని కట్టడి చేసి ఉంటే ఫలితం భిన్నంగా వచ్చేందుకు అవకాశాలు ఉండేవి. ఇక పిచ్ బ్యాటింగ్‌కు సహకరిస్తున్న సమయంలో టాప్ ఆర్డర్ కుప్ప కూలటం కొంప ముంచింది. రోహిత్ (15), గిల్ (13), పుజార (14), కోహ్లి (14) పెవిలియన్‌కు క్యూ కట్టారు. రెండో ఇన్నింగ్స్‌లోనూ పరిస్థితిలో పెద్ద మార్పు లేదు. 91/1తో మెరుగ్గా సాగుతున్న దశలో రోహిత్, పుజార వికెట్లతో భారత్‌పై ఒత్తిడికి అధికమైంది. తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ 285 పరుగుల నాల్గో వికెట్ భాగస్వామ్యం ఆ జట్టును ఐసీసీ ప్రపంచ టెస్టు విజేతగా నిలుపగా.. బ్యాటర్ల సమిష్టి వైఫల్యం భారత్‌ను వరుసగా రెండోసారి రన్నరప్‌గా నిలిపింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68